WWW.nindam.co.in

తెలుగు దినపత్రిక

# నినాదం

నిఖార్సైన జర్నలిజం

బుధవారం, జూన్ 26, 2024 | సంపుటి - 20 | సంచిక 286 | వెల - 6 | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.



## విద్యుత్ కొనుగోళ్లపై మరింత సమాచారం ఇవ్వండి

### కెసిఆర్‌కు మరో లేఖ రాసిన నరసింహారెడ్డి కమిషన్

**హైదరాబాద్,జూన్25(నినాదం):**

విద్యుత్ కొనుగోళ్లపై విచారణ చేస్తున్న జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ భారాస అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు మరో లేఖ రాసింది. విద్యుత్ కొనుగోళ్ల అంశంపై మరింత సమాచారం ఇవ్వాలని ఈ నెల 19న లేఖ పంపించింది. యాదాద్రి, భద్రాద్రి విద్యుత్ ప్లాంట్ల నిర్మాణంపై మరిన్ని వివరాలు తెలియజేయాలని అందులో పేర్కొంది. ఛత్తీస్‌గఢ్ నుంచి కొన్న విద్యుత్ గురించి మరింత సమాచారం కోరింది. ఈ నెల 27 లోపు సమాధానమివ్వాలని కమిషన్ సూచించింది. అయితే మరోవైపు కమిషన్‌నే రద్దు చేయాలని కెసిఆర్ హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే.

# టైర్లు అరుగుతున్నయ్.. కట్టలు విరుగుతున్నయ్

## మహాలక్ష్మి పథకంతో బస్సుల్లో పెరిగిన ఓవర్ లోడ్

- నిర్వహణ ఖర్చులు పెరిగాయని అద్దె బస్సు యజమానుల ఆవేదన
- సీటింగ్ కెపాసిటీకే ఇన్సూరెన్స్
- పొంచి ఉన్న ప్రమాదాలు
- బస్సుల సంఖ్య పెరిగితేనే సమస్య తీరే అవకాశం

2లో..



హాలక్ష్మి పథకంతో ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని మహిళలు పెద్ద ఎత్తున వినియోగించుకుంటున్నారు. అయితే ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా బస్సులు పెరగలేదు. ఫలితంగా ఆర్టీసీ బస్సులు ఓవర్ లోడ్ తో రాకపోకలు సాగిస్తున్నాయి. కిటకిటలాడే ప్రయాణికులకు తో వెళుతున్న బస్సులతో ఎప్పుడే ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొన్నది. కొండగట్టు లాంటి సంఘటన పునరావృతం కాకుండా ప్రభుత్వం ముందు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది.

**పెద్దపల్లి ప్రతినిధి(నినాదం):**

రాష్ట్రంలో మూడు జోన్ల పరిధిలో తొమ్మిది వేలకు పైగా బస్సులున్నాయి. వీటిలో 6368 ఆర్టీసీ, 2726 ప్రైవేటు అద్దె బస్సులున్నాయి. ఎన్నికల హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం డిసెంబర్ 9 నుంచి తెలంగాణలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించింది. ఎక్స్ ప్రెస్, పల్లె వెలుగు బస్సుల్లో రాష్ట్రంలో ఎక్కడికైనా మహిళలు ఉచితంగా ప్రయాణించే వెసులుబాటు కల్పించారు. పేద ధనిక అనే ఆంక్షలు లేకపోవడంతో అన్ని వర్గాల మహిళలు ఉచిత బస్సు సౌకర్యాన్ని వినియోగించుకుంటున్నారు.

### పెరిగిన నిర్వహణ ఖర్చులు

బస్సుల్లో ఓవర్ లోడ్ పెరిగడంతో పలు సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. డీజిల్ వినియోగం పెరుగుతోంది. టైర్ల అరుగుదల అధికమైందని అద్దె బస్సుల యజమానులు వాపోతున్నారు.






### బస్సులు కిటకిట

మహాలక్ష్మి పథకం అమల్లోకి వచ్చాక ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య అధికమైంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తిరిగే బస్సులన్నీ కిటకిటలాడుతున్నాయి. 70 మంది నుంచి 120 మంది దాకా ప్రయాణిస్తున్నారు. ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా బస్సులు లేకపోవడం వల్ల ఈ సమస్య అనివార్యంగా మారింది.

### ప్రమాదాలు జరిగితే బాధ్యులెవరు?

బస్సులన్నీ ఓవర్ లోడ్ తో రాకపోకలు సాగిస్తున్నాయి. దీనివల్ల ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఏవైనా సంఘటనలు జరిగితే పరిస్థితి ఏమిటని ప్రైవేటు అద్దె బస్సుల యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో బస్సుకు సంబంధించి 60 మంది మాత్రమే(సీటింగ్ కెపాసిటీ) ఇన్సూరెన్స్ వర్తిస్తుంది. కాగా అంతకు మించి ప్రయాణిస్తున్నారు. ఒకవేళ ప్రమాదాలు జరిగితే బాధ్యత ఎవరిదని అద్దె బస్సుల యజమానులు ప్రశ్నిస్తున్నారు.



## రైతు భరోసాపై ప్రభుత్వం కీలక నిర్ణయం

### ప్రజాభిప్రాయ సేకరణతో ముందుకు వెళతాం: భట్టి

**హైదరాబాద్,జూన్25(నినాదం):**

రైతు భరోసాపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత, జౌళి శాఖల అధికారులతో మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వ్యవసాయ మార్కెటింగ్ చేనేత జౌళి శాఖల అధికారులతో వార్షిక బ్జడెట్ ప్రతిపాదనలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశానికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఫైనాన్స్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రఘునందన్ రావు తదితరులు హాజరయ్యారు.

2లో..

## భవిష్యత్ బిఆర్‌ఎస్‌దే.. ఎవరూ తొందరపడకండి

### ఎమ్మెల్యేలతో కెసిఆర్ లంచ్ మీటింగ్

వివరాలు 2లో..



## జీవన్‌రెడ్డికి కాంగ్రెస్ అధినాయకత్వం బుజ్జగింపు



- ఫోన్ చేసి మాట్లాడిన పార్టీ జనరల్ సెక్రటరీ కెసి వేణుగోపాల్
- మంత్రి పదవి ఇస్తామని ఆఫర్ ఇచ్చినట్లుగా ప్రచారం
- జీవన్ ఇంటికి వెళ్లి చర్చించిన భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు
- రాజీనామా అంశాన్ని ఉపసంహరించుకున్న జీవన్‌రెడ్డి

వివరాలు 2లో..

## బాలికపై ఐదుగురి లైంగికదాడి

గంజాయి మత్తులో దింపి ఘాతుకం

నేరెడ్‌మెట్‌లో వెలుగు చూసిన దారుణ ఘటన

**హైదరాబాద్, నినాదం :**

నిర్భయ లాంటి చట్టాలు ఎన్ని తెచ్చినా మృగాళ్ల తీరు మారడం లేదు. తాజాగా, హైదరాబాద్‌లో దారుణం జరిగింది. మత్తుకు బానిసైన యువకులు ఆ మత్తులోనే దారుణాలకు ఒడిగడుతున్నారు. ఓ బాలికకు గంజాయి అలవాటు చేసిన యువకులు ఆమె మత్తులోకి దిగగానే దారుణానికి ఒడిగట్టారు. ఈ అమానుష ఘటన హైదరాబాద్ నేరేడుమెట్‌లో జరిగింది.

వివరాలు 2లో..

## కాంగ్రెస్ గూటికి గూడెం మహిపాల్ రెడ్డి

### సిఎం రేవంత్ వెంట ఢిల్లీకి చేరుకున్న ఎమ్మెల్యే

హైదరాబాద్ : బీఆర్ఎస్ కు వరుసగా షాకులమీద షాకులు తగులుతున్నాయి. ఇటీవలే బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కాంగ్రెస్ లో చేరగా.. లేటెస్ట్ గా పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కాంగ్రెస్ చేరేందుకు సిద్ధమయ్యారు. సీఎం రేవంత్ వెంట ఢల్లీ వెళ్లిన మహిపాల్ రెడ్డి ఏఐసీసీ పెద్దల సమక్షంలో కాంగ్రెస్ లో చేరనున్నారు. ఎన్నికల ముందు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్ రావు కాంగ్రెస్ కండువా కప్పుకోగా.. ఎన్నికల ఫలితాల తర్వాత పోచారం, సంజయ్ కుమార్ పార్టీలో చేరారు.

వివరాలు 2లో..

## 'పాడి' ప్రమాణాలు పచ్చి అబద్దాలు

- దిగజారుడు రాజకీయాలకు కేరాఫ్ కౌశిక్ రెడ్డి
- దురుద్దేశంతోనే మంత్రిపై నిరాధార విమర్శలు
- ఉద్యోగాల పేరుతో లక్షలు వసూలు
- ఆరోపణలు హద్దుదాటితే చట్టం బుద్ది చెబుతుంది
- మీడియా సమావేశంలో వొడితల ప్రణవ్





**జమ్మికుంట, జూన్ 25(నినాదం):**

హుజురాబాద్ ఎమ్మెల్యే పాడికౌశిక్ రెడ్డి దేవుడిపై ఒట్టేసి మరీ అబద్ధాలు ఆడడం సిగ్గుచేటని, తన ఉనికిని కాపాడుకోవడం కోసం దేవుడిని సైతం వదలటం లేదని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇంచార్జివొడితల ప్రణవ్ అన్నారు.మనస్సాక్షిని చంపుకొని మరీ అబద్ధాలు ఆడు తున్నాడని ఆయన పాడిపై విరుచుకుపడ్డారు. మంగళవారం సింగాపురం లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రణవ్ మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఓట్లు వేసి గెలిపించకపోతే తాను తన కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకుంటానని నియోజకవర్గ ప్రజలను బెదిరించి గెలిచిన ఘనత కౌశిక్ రెడ్డికే దక్కిందన్నారు. అబద్ధాలు ఆడడం మోసం చేయడం తనకు కొత్తేమీ కాదన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ కు సవాల్ విసిరిన కౌశిక్ రెడ్డికి తాము ప్రతి సవాలు విసిరామని ప్రణవ్ తెలిపారు. దమ్ముంటే ఆధారాలతో సహా చెల్పూరు ఆంజనేయ స్వామి ఆలయానికి రావాలన్నామని ఆయన తెలిపారు.

2లో..



ఫైల్ ఫోటో..

# కష్టాల వానా కాలం

వానలు.. వరదలు.. వలసలు..

- రాకపోకల స్తంభన, విద్యుత్ నిలిపివేత
- వానాకాలం వస్తుందంటే భయపడుతున్న ప్రజలు
- భద్రాద్రి ఏజెన్సీ స్థితిగతులు మారేదెన్నడు

పాలకులు మారినా, ప్రభుత్వాలు మారినా భద్రాద్రి ఏజెన్సీ వాసుల వానాకాలం కష్టాలు మాత్రం తీరడం లేదు. వానాకాలం వస్తుందంటే ఏజెన్సీ వాసుల గుండెల్లో గుబులు మొదలవుతుంది. ముందు వానలు.. తదుపరి వరదలు.. ఆ పిమ్మట వలసలు.. ఇవీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గోదావరి పరివాహక గ్రామాల ప్రజల వర్షాకాల బాధలు. వరదలు వస్తేరహదారులు నీట మునిగి ఓవైపు రాకపోకల స్తంభన, మరోవైపు లోతట్టు గ్రామాల ప్రజల వలసలు.. ఇంకోవైపు విద్యుత్ సప్లై నిలిపివేత ఇవీ భద్రాద్రి ఏజెన్సీ వాసుల వానాకాలం కష్టాలు..

**కొంగూరు రమణారావు**
**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి(నినాదం):**

వర్షాకాలం అనగానే రాష్ట్రంలో ముందుగా గుర్తుకు వచ్చే ప్రాంతం భద్రాచలం. ఆంధ్రాలోని పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ భద్రాచలం ప్రాంతానికి పెనుప్రమాదంగా మారింది. భద్రాచలం పట్టణ ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్న అంశం కూడా ఇదే. వానాకాలంలో భద్రాచలం ఏజెన్సీ అధిక వర్షాలు, వరదలకు నీటమునిగి అతలాకుతలం అవుతుంది. ప్రాణ, ఆస్థినష్టం జరగకుండా గోదావరి వరదలను ఎదుర్కోవడం ప్రభుత్వ యంత్రాంగానికి సవాల్ అని చెప్పవచ్చు. భద్రాచలం వద్ద గోదావరి 43 అడుగులకు చేరుకోగానే జిల్లా కలెక్టర్ మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసి ఫ్లడ్ డ్యూటీ అధికారులను అలర్ట్ చేస్తారు. 48 అడుగులకు రెండవ ప్రమాద హెచ్చరిక, 52 అడుగుల వద్ద మూడవ (చివరి) ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. భద్రాచలం వద్ద హెచ్చరికలను దాటి గోదావరి ఉగ్రరూపం దాల్చి ప్రవహించిన సందర్భాలు ఉన్నాయి. అపుడు వందల గ్రామాలు జలదిగ్బంధనంలో చిక్కుకొంటాయి. వేలాది కుటుంబాల ప్రజలు పునరావాస కేంద్రాలకు తరలి వెళతారు.

2లో..

సినాదం



## 'పాడి' ప్రమాణాలు పచ్చిఅబద్దాలు

**మొదటిపేజీ తరువాయి**

ఆలయానికి రాకుండా పబ్లిసిటీ కోసం ఇంటివద్ద స్నానం చేసి దేవుడి ఫోటో మీద ప్రమాణం చేయడం విచిత్రంగా ఉందన్నారు. నిరుద్యోగులనుండి లక్షలు వసూలు చేసి బాధితులపైనే కేసులు పెట్టించి జైలుకు పంపించిన చరిత్ర కౌశిక్ రెడ్డిదని ప్రణవ్ ఆరోపించారు. గెలిస్తే అభివృద్ధి చేస్తానని ప్రజలను మభ్యపెట్టి గెలిచిన ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి తమ పార్టీ అధికారంలోకి రాకపోవడంతో అసమర్ధునిగా మిగిలారన్నారు. అధికార దర్పం పోవటంతో పసలేని ఆరోపణలు చేస్తూ మంత్రి పొన్నం ను టార్గెట్ చేయడం సిగ్గుచేటన్నారు. పవరుంటే ఒకలా లేకుంటే మరోలాగా ఉండడం కౌశిక్ రెడ్డికి అలవాటేనని, ఎమ్మెల్యేగా గెలిచినప్పటినుండి ఇప్పటివరకు నియోజకవర్గానికి ఆయన చేసింది ఏమీ లేదని తేల్చిచెప్పారు. 1000 కోట్లు తీసుకువస్తానని చెప్పి వంద రూపాయల మొరం కూడా పోయ లేని పరిస్థితుల్లో కౌశిక్ రెడ్డి ఉన్నాడని ప్రణవ్ అన్నారు. కౌశిక్ రెడ్డికి చిల్లర, దిగజారుడు బ్లాక్ మెయిల్ రాజకీయం, నిరాధారా ఆరోపణలు చేయడం అలవాటేనన్నారు. అటువంటి ఆరోపణలు చేస్తే ఇకపై చట్టం తన పని తాను చేసుకుపోతుందని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. తప్పుడు ఆరోపణలు చేసినప్పుడు వాటిపై సాక్షాలు ఉండాలని, ఆ సాక్షాలు ఎక్కడ ఉన్నాయో చూపెట్టాలని ఆయన అన్నారు. తమ దగ్గర కౌశిక్ చేసిన తప్పుడు పనులకు ఆధారాలున్నాయన్నారు. ఉద్యోగాల కోసం డబ్బులు తీసుకున్న బాధితులు చెల్పూర్ ఆలయంలో తడి బట్టలతో కొబ్బరికాయలు కొట్టి ప్రమాణం చేశారని సదరు ఆధారాలను మీడియాకు చూపించారు. ఫ్లై యాష్ కు సంబంధించి కూడా ఏవైనా ఆధారాలుంటే మీడియా ముందు పెట్టాలన్నారు. తాము గతంలోనే సమాధానం చెప్పామని ఇకపై ఆ విషయంలో మాట్లాడడానికి ఏమీ లేదని ప్రణవ్ అన్నారు. ఓవర్ లోడ్ పేరుతో ఓవర్ యాక్షన్ చేస్తే సహించేది లేదన్నారు. ప్రజలపై ఏమైనా ప్రేమ ఉంటే అభివృద్ధి కొరకు ప్రభుత్వానికి సూచనలు చేయాలని మంచి సలహాలు ఇస్తే తప్పకుండా స్వీకరిస్తామని తెలిపారు. ఇకనైనా ఈ బురద జల్లుడు రాజకీయాలు మానుకోవాలని అభివృద్ధి పై దృష్టి పెట్టాలని ఆయన హితవుపలికారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు పత్తి కృష్ణారెడ్డి, కొల్లూరి కిరణ్, సొల్లు బాబు, పూదరి రేణుక శివకుమార్ గౌడ్, పొన్నగంటి మల్లయ్య, వేముల పుష్పలత, దేశిని కోటి, మిడిదొడ్డి రాజు, ఇంగిలే రామారావు, ఎండి సాహెబ్ హుస్సేన్, జమ్మికుంట మున్సిపల్ కౌన్సిలర్లు దిడ్డి రామ్మోహన్, శ్రీపతి నరేష్ గౌడ్, బొంగోని వీరన్న గౌడ్ నియోజకవర్గంలోని పలువురు నాయకులు, పార్టీ వివిధ అనుబంధ సంఘాల కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రైతు భరోసాపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

**మొదటిపేజీ తరువాయి**

వార్షిక బడ్జెట్ ప్రతిపాదనలపై మంత్రులు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు చర్చించారు. అనంతరం మీడియాతో ఈ సమీక్షలో చర్చించిన విషయాలను మీడియాకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడిరచారు.ప్రజాభిప్రాయ సేకరణ చేద్దామని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ... గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో నిలిపివేసిన వ్యవసాయ పథకాలు ఏంటి.. అందుకు గల కారణాలను వ్యవసాయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పంటల భీమాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాలు. రాబోయే సీజన్‌కు పంటల భీమాకు సంబంధించి పిలవాల్సిన టెండర్లపై చర్చించారు. రాష్ట్రంలో ఉమ్మడి జిల్లాల్లో ఉన్న వ్యవసాయ కళాశాలలు, ఇప్పటికీ కళాశాలలు లేని జిల్లాల వివరాలను డిప్యూటీ సీఎం సమావేశంలో తీసుకున్నారు.

## కాంగ్రెస్ గూటికి గూడెం మహిపాల్ రెడ్డి

**మొదటిపేజీ తరువాయి**

గూడెం మహిపాల్ కాంగ్రెస్ లో చేరితే బీఆర్ఎస్ ను వీడిన ఎమ్మెల్యేల సంఖ్య 6 కు చేరుతుంది. ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, ఆయన సోదరుడు మధుసూదన్‌రెడ్డి ఇండ్లు, ఆఫీసుల్లో ఇటీవల ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు దాడులుచేశారు. అక్రమ మైనింగ్‌తో రూ.300 కోట్లు కూడబెట్టారని గుర్తించినట్టు తెలిపారు. ప్రభుత్వానికి రాయల్టీ రూపంలో చెల్లించాల్సిన మరో రూ. 39.08 కోట్లు ఎగవేసినట్టు వెల్లడిరచారు.

## బాలికపై ఐదుగురి లైంగికదాడి

**మొదటిపేజీ తరువాయి**

బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలికపై ఐదుగురు యువకులు అత్యాచారానికి ఒడిగట్టిన దారుణ ఘటన నేరెడుమెట్ పరిధిలో తాజాగా వెలుగుచూసింది. కాచిగూడలో ఉంటున్న ఓ బాలికను ఐదుగురు యువకులు ట్రాప్ చేసి నేరెడుమెట్ తీసుకెళ్లారు. అక్కడ బాలికకు గంజాయి అలవాటు చేసి ఆమె మత్తులోకి వెళ్లగానే ఐదుగురు యువకులు సామూహిక అత్యాచారం చేశారు. బాలిక ఈ ఘోరాన్ని తల్లికి చెప్పకుండా దాచింది. ఆమెలో వస్తున్న మార్పులు గమనించిన తల్లి గట్టిగా నిలదీయగా.. జరిగిన దారుణాన్ని తల్లికి చెప్పింది. దీంతో బాధితురాలి తల్లి పోలీసులను ఆశ్రయించింది. బాధిత బాలిక ఫిర్యాదు మేరకు కాచిగూడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసిన పోలీసులు.. కేసును నేరెడ్‌మెట్‌కు బదిలీ చేశారు. దీనిపై విచారించిన పోలీసులు నిందితుల కోసం గాలింపు చేపట్టారు. పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఎమ్మెల్యేలను చేర్చుకోవడం నీతిమాలిన చర్య

### రేవంత్ తీరుపై మండిపడ్డ కెటిఆర్

### పార్టీ మారిన వారిపై అనర్హత వేటు వేయాలి

### స్పీకర్‌ను టైమ్ కోరినట్లు జగదీశ్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్ :
పార్టీ ఫిరాయింపులకు పాల్పడుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకుంటున్న రేవంత్ తీరును ఎక్స్ వేదికగా కేటీఆర్ ఎండగట్టారు.ప్రచారంలో నీతులు మాట్లాడిన రేవంత్ రెడ్డి.. ప్రభుత్వంలోకి వచ్చాన నీతిమాలిన పనులు చేస్తున్నారని విమర్శించారు. ఒక పార్టీ తరపున గెలిచి మరో పార్టీలో చేరడం నేరం. ఎమ్మెల్యేలు పార్టీ మారితే రాళ్లతో కొట్టిచంపమన్నారు. రాజీనామా చేయకుండా ఇతర పార్టీల్లో చేరితే ఊళ్లనుంచే తరిమికొట్టమన్నారు. కానీ ఇవాళ రేవంత్ రెడ్డినే.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఇండ్లకు వెళ్లి మరీ కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్నారు. ఏ ఎమ్మెల్యేనైనా రాజీనామా చేయకుండా పార్టీ ఫిరాయిస్తే.. రాళ్లతో కొట్టించే బాధ్యత తీసుకుంటా అన్నది మీరే. అందుకే జవాబు చెప్పాల్సింది కూడా మీరే అని రేవంత్ రెడ్డిని ఉద్దేశించి కేటీఆర్ ప్రశ్నించారు. ఇదిలావుంటే బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లిన ఎమ్మెల్యేలపై సూర్యాపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి మండిపడ్డారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల సభ్యత్వాలు రద్దు కావాల్సి ఉందన్నారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. చట్టం ప్రకారం డాక్టర్ సంజయ్, పోచారం శ్రీనివాస్ రెడ్డి సభ్యత్వాలు రద్దు కావాలి. ఆ ఇద్దరు ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్ ఇచ్చేందుకు స్పీకర్‌ను సమయం కోరాం. వెసులుబాటు చూసుకొని సమయం ఇస్తానని స్పీకర్ చెప్పారు. స్పీకర్ న్యాయంగా సమయం ఇస్తారని ఆశిస్తున్నాం. అనర్హత పిటిషన్లపై ఈ నెల 27న హైకోర్టులో విచారణ ఉంది. కాంగ్రెస్ పార్టీ దేశ ప్రజలను వంచిస్తోంది. రాహుల్ కాంగ్రెస్‌ది ఒక విధానం.. రేవంత్ కాంగ్రెస్‌ది మరో విధానం. గత పదేండ్లలో ఫిరాయింపులను ప్రోత్సహించింది బీజేపీ. బీజేపీకి తోకగా తెలంగాణ పీసీసీ వ్యవహరిస్తోంది అని జగదీశ్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బాన్సువాడ, జగిత్యాల ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్ రెడ్డి, సంజయ్.. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ టికెట్‌పై గెలుపొందారు. వీరిద్దరిని రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్నారు. ఈ నేపథ్యంలో ఆ ఇద్దరిపై గులాబీ శ్రేణులు మండిపడుతున్నారు. ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# టైర్లు అరుగు తున్నయ్.. కట్టలు విరుగుతున్నయ్

**మొదటిపేజీ తరువాయి**

గతంలో ఒక టైరు 80000 కిలోమీటర్లు తిరిగాక మార్చేవారు. ఇప్పుడు 50 వేల కిలోమీటర్లకే అరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు బస్సుల కట్టలు( కమాన్ పట్టీలు ) విరిగిపోవడం తరచూ జరుగుతున్నాయని తెలిపారు. గుంతలమయమైన రూట్లలో కట్టలు విరిగిపోతున్న సమస్య అధికంగా ఉందని తెలిపారు. మొత్తంగా నిర్వహణ ఖర్చులు 15-25 వేల దాకా పెరిగాయని పలువురు అద్దె బస్సుల యజమానులు తెలిపారు. మరోవైపు ఓవర్ లోడ్ వల్ల బస్సులు గమ్య స్థానాలకు చేరడం ఆలస్యం అవుతుంది. దీంతో నిర్ణీత వేళలు అమలు కావడం లేదు. ఇదిలా ఉంటే ఆర్టీసీ అధికారులు మాత్రం నిర్వహణ ఖర్చులు పెరగలేదంటున్నారు. ఓవర్ లోడ్ అనేది సమస్య కాదంటున్నారు. ప్రమాదాలు జరుగుతాయని నెగెటివ్ గా ఆలోచించడం ఎందుకని ప్రశ్నిస్తుండడం గమనార్హం.

### డ్రైవర్లు,కండక్టర్ల సహనానికి పరీక్ష

పరిమితికి మించిన ప్రయాణికుల వల్ల డ్రైవర్లు కండక్టర్లు ఇబ్బందుల పాలవుతున్నారు. మహాలక్ష్మి పథకం అమలు తర్వాత డ్రైవర్లు కండక్టర్ల సహనానికి పరీక్ష ఎదురవుతుంది. చెయ్యెత్తినచోట బస్సులు ఆపలేదని డ్రైవర్లపై ఫిర్యాదులు, దాడులు జరుగుతున్నాయి. స్టాపులు పెరగడంతో డ్రైవర్లకు కష్టాలు తప్పడం లేదు. బస్సులో పరిమితి మించి ప్రయాణికులు ఎక్కడం వల్ల కండక్టర్ల సహనానికి పరీక్షవుతోంది. టికెట్లు ఇవ్వడంలో ఆలస్యం తప్పడం లేదు. గత నెలలో హైదరాబాద్ లక్డికాపూల్ వద్ద ఓ డ్రైవర్ ఓవర్ లోడుతో బస్సు నడపడం తనం వల్ల కాదని కిందకు దిగిన సంగతి తెలిసిందే. ఇలాంటి ఇబ్బందులే చాలామంది డ్రైవర్లు ఎదుర్కొంటున్నారు.

### టైర్లు పగులుతున్నాయి:

**మిట్ట సాయికుమార్, అద్దె బస్సు యజమాని**



మంథని– ఓడేడు రూట్లో ఐదేళ్లుగా బస్సు నడుపుతున్నాం. దారి పొడవున గుంతలే ఉన్నాయి. ఓవైపు ఓవర్ లోడుకు తోడు రహదారి బాగాలేక బస్సు కట్టలు( కమాన్ పట్టీలు ) తరచూ విరిగిపోతున్నాయి. టైర్లు పగిలిపోతున్నాయి. దీనివల్ల బస్సు నిర్వహణ ఖర్చులు అడ్డగోలుగా పెరిగిపోయి నష్టాలు ఎదుర్కొంటున్నాం. ఓవర్ లోడ్ వల్ల జరుగుతున్న నష్టాన్ని ఆర్టీసీ యాజమాన్యమే భరించాలి.

### బరువు మోస్తూ నష్టాలపాలు :

**అబ్బ మధుకర్ రెడ్డి, ప్రైవేటు అద్దె బస్సుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు**



మహాలక్ష్మి పథకం అమల్లోకి వచ్చాక బస్సుల్లో ఓవర్ లోడ్ పెరిగి అనేక విధాలుగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నిర్వహణ ఖర్చులు పెరిగి నష్టాలు భరించాల్సి వస్తోంది.మాకు ఎదురవుతున్న ఐదు ప్రధాన సమస్యలను ఆర్టీసీ ఎం.డి సజ్జనార్ దృష్టికి తీసుకెళ్లాం. ఆరు నెలల్లో కేవలం ఒక్క సమస్యను మాత్రమే కొంతమేరకు పరిష్కరించారు. మిగతా నాలుగు సమస్యలపై ఇప్పటికీ ఎటూ తేల్చలేదు. టైర్లు దెబ్బ తింటున్నాయి. కట్టలు( కమాన్ పట్టీలు) విరుగుతున్నాయి. ఓవర్ లోడ్ వల్ల కొండగట్టు లాంటి ప్రమాదం జరిగితే ఇన్సూరెన్స్ సమస్య వచ్చే అవకాశం ఉంది. గతంలో మేము రీ కండిషన్ టైర్లు వినియోగించినా ఇబ్బంది ఉండేది కాదు. ఇప్పుడు ఓవర్ లోడ్ వల్ల పగిలిపోతున్నాయి. ఆర్టీసీ యాజమాన్యం కొనుగోలు చేసే ధరలకే మాకు టైర్లు ఇవ్వాలని కోరుతున్నాం. ఆర్టీసీ



## భవిష్యత్ బిఆర్ఎస్‌దే.. ఎవరూ తొందరపడకండి

హైదరాబాద్ :

మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి పార్టీ మారడాన్ని పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలిపారు. భవిష్యత్ మనదేనని వారికి భరోసా ఇచ్చారు. సిద్దిపేట జిల్లా ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్‌తో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, కేపీ వివేకానంద గౌడ్, మాగంటి గోపీనాథ్, ముఠా గోపాల్, మాధవరం కృష్ణారావు, అరికెపూడి గాంధీ, ప్రకాశ్‌గౌడ్, ఎమ్మెల్సీలు శేరి సుభాశ్ రెడ్డి, దండె విఠల్, మాజీ ఎమ్మెల్యేలు జోగు రామన్న, నాయకులు క్యామ మల్లేశ్, రావుల శ్రీధర్ రెడ్డి మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారితో కలిసి లంచ్ చేసిన కేసీఆర్.. బీఆర్ఎస్ పార్టీలో జరుగుతున్న పరిణామాలపై చర్చించారు. ఎవరూ తొందరపడొద్దని సూచించారు. ఇలాంటి పరిణామాలు ఆనాటి వైఎస్ హయాంలోనే జరిగాయని.. అయినా మనం భయపడలేదని కేసీఆర్ గుర్తు చేశారు. మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి పార్టీ మారడాన్ని పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదని సూచించారు. కొందరు ఎమ్మెల్యేలు పార్టీ మారినంత మాత్రాన బీఆర్ఎస్‌కు వచ్చే నష్టం ఏమీ లేదని స్పష్టం చేశారు. రేపట్నుంచి వరుసగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో భేటీలు ఉంటాయని స్పష్టం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రేవంత్ రెడ్డి విఫలమయ్యారని ఆరోపించారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా దెబ్బతిన్నదని అన్నారు. భవిష్యత్తులో మనకు మంచి రోజులు వస్తాయని తెలిపారు.

## జీవన్‌రెడ్డికి కాంగ్రెస్ అధినాయకత్వం బుజ్జగింపు

హైదరాబాద్ :
కాంగ్రెస్ సీనియర్ నేత, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి తన రాజీనామాపై వెనక్కి తగ్గినట్లు సమాచారం. జీవన్ రెడ్డితో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మంత్రి శ్రీధర్ బాబు జీవన్‌రెడ్డి నివాసంలో ఏకాంత చర్చలు జరిపారు. సీఎం హైదరాబాద్‌కు వచ్చి మాట్లాడిన తర్వాత మీరు ఏం నిర్ణయం తీసుకున్నా అది మీ ఇష్టం. అప్పటి దాకా మా మాట వినాలని శ్రీధర్ బాబు, భట్టి కోరారు. అనంతరం పార్టీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్‌తో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఫోన్‌లో మాట్లాడిరచారు. కేసీతో ఫోన్లో మాట్లాడిన తర్వాత జీవన్ రెడ్డి తన రాజీనామా విషయంలో వెనక్కి తగ్గారు. అయితే జీవన్ రెడ్డికి కేసీ వేణుగోపాల్ మంత్రి పదవి ఆఫర్ చేసిట్లు తెలిసింది. అందుకే ఆయన రాజీనామా విషయంలో వెనక్కి తగ్గారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. కాగా, జగిత్యాల బిఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవడంపై జీవన్ రెడ్డి ఆగ్రహంగా ఉన్నారు. ఆయన చేరికపై పార్టీ అధిష్ఠానం కనీసం తనకు సమాచారం ఇవ్వకపోవడంతో అసనం వ్యక్తంచేశబూరు. ఈ నేపథ్యంలో తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తానని స్పష్టం చేశారు. 2014లో జీవన్‌రెడ్డి చేతిలో ఓడిపోయిన సంజయ్.. ఆ తర్వాత జరిగిన 2018, 2023 ఎన్నికల్లో ఆయనపై విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో జగిత్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవడంపై అలకబూని.. ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తానంటూ ప్రకటన చేసిన ఎమ్మెల్సీ టీ.జీవన్‌రెడ్డిని బుజ్జగించేందుకు ఏఐసీసీ ఏకంగా మంత్రి పదవి ఇస్తామంటూ ఆఫర్ ఇచ్చింది. ఈ మేరకు కాంగ్రెస్ హైకమాండ్ నుంచి జీవన్ రెడ్డికి ఆఫర్ వచ్చినట్టు తెలుస్తోంది. ఈ విషయంపై స్వయంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు ఇద్దరూ జీవన్ రెడ్డి నివాసానికి వెళ్లి చర్చలు జరిపారని సమాచారం. మ్మెల్సీ పదవికి జీవన్ రెడ్డి రాజీనామా చేయకుండా ఇరువురు నేతలు మంతనాలు కొనసాగించారు. ఇందులో భాగంగానే పార్టీ మంత్రి పదవిని ఆఫర్ చేస్తోంది. ఈ మేరకు ఏఐసీసీ కూడా సుముఖంగా ఉంది. కాగా ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిని బుజ్జగించేందుకు పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జి దీపాదాస్ మున్షీ కూడా రంగంలోకి దిగారు. ఫోన్ చేసి మాట్లాడారు. రాజీనామా నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరినట్లు తెలుస్తోంది. హైదరాబాద్ వచ్చాక అన్ని విషయాలు మాట్లాడుతామని మున్షీ హామీ ఇచ్చినట్టు తెలుస్తోంది.

## నేడు స్కూళ్ల బంద్‌కు ఎబివిపి పిలుపు

హైదరాబాద్ :
ప్రైవేటు బడుల్లో ఫీజులను నియంత్రించాలని, సర్కారు బడుల్లో వసతులు కల్పించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా బుదవారం స్కూళ్ల బంద్‌కు ఎబివిపి విద్యార్థి సంఘం పిలుపునిచ్చింది. ఈ మేరకు ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల రaాన్సీ ఒక ప్రకటనలో తెలిపారు. సర్కారు బడుల్లోని సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాల దృష్టికి అనేక సార్లు తీసుకుపోయినా ఫలితం లేకుండా పోయిందన్నారు. కార్పొరేట్ స్కూళ్లలో రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నా, ఆయా మేనేజ్?మెంట్లపై ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఫీజుల నియంత్రణకు చట్టం తీసుకొస్తామని అనేక హామీలు ఇచ్చినా, ఇప్పటికీ అమలు చేయడం లేదని పేర్కొన్నారు. ఈ నెల 26న జరిగే స్కూళ్ల బంద్?కు మేనేజ్ మెంట్లు సహకరించాలని కోరారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం

### మూడు బాక్సుల్లో ఆధారాలు కోర్టుకు సమర్పణ

హైదరాబాద్ :
తెలుగు రాష్ట్రాల్లో పెనుసంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు తుది దశకు చేరుకుంది. ఇప్పటికే పలు సంచలన విషయాలు ఈ కేసులో బయటకిరాగా.. తాజాగా కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసుకు సంబంధించి ఎవిడెన్స్ మెటీరియల్ మొత్తాన్ని పోలీసు ఉన్నతాధికారులు కోర్టుకు సమర్పించారు. మూడు బాక్సులలో న్యాయస్థానంలో ఆధారాలు సమర్పించడం జరిగింది. ఇందులో హార్డ్ డిస్కులు, సిడీ, పెన్ డ్రైవ్‌లను పోలీసు కోర్టు ముందు ఉంచారు. అన్నిటినీ జత పరుస్తూ పోలీసులు మూడోసారి ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. కాగా.. ఈ ఆధారాలను నిందితులకు తెలీకుండా రహస్యంగా ఉంచాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోరారు. అనంతరం మాజీ అడిషనల్ ఎస్పీల బెయిల్ పిటిషన్ ల పై విచారణ వాయిదా పడిరది. ఇదిలా ఉంటే.. బుధవారం నాడు తిరుపతన్న, భుజంగ రావ్ బెయిల్ పిటిషన్‌లపై న్యాయస్థానంలో విచారణ జరగబోంది.

## ఢిల్లీలో బిజీగా సిఎం రేంవత్ షెడ్యూల్

### నీట్ అవకతవకలపై సిట్టింగ్ జడ్జి విచారణకు డిమాండ్

న్యూ ఢిల్లీ: ఢిల్లీ పర్యటనలో ఉన్న సిఎం రేవంత్ కాంగ్రెస్ పెద్దలతో పాటు, కేంద్ర మంత్రులను కలుస్తున్నారు. వివిధ సమస్యలను ప్రస్తావిస్తూ వాటి కోసం మంత్రులను అర్థిస్తున్నారు. ఈ క్రమంలో నీట్ అవకతవకలపై సిట్టింగ్ జడ్జ్‌తో విచారణ జరిపించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. పరీక్ష నిర్వహణలో కేంద్రం విఫలం అయిందని మండిపడ్డారు. సీబీఐ విచారణ సరిపోదని చెప్పారు. కోట్లాదిమంది విద్యార్థుల భవితవ్యానికి సంబంధించిన అంశం, కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రధాని మోదీ మౌనం వహించడం సరికాదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మరోవైపు ఇటీవలే కాంగ్రెస్‌లో చేరిన మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి అధికారికంగా కాంగ్రెస్‌లో చేరారు. తన రాజకీయ జన్మ మొదలైంది కాంగ్రెస్‌తోనే, చివరకు ముగిసేది కాంగ్రెస్‌లోనే అని ఎమ్మెల్యే పోచారం ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఎన్టీఆర్ పిలుపుతో టీడీపీలో చేరా, పదేళ్లు కేసీఆర్ నాయకత్వంలో పనిచేశానని అన్నారు. కాంగ్రెస్‌లో తిరిగి చేరడం సంతోషంగా ఉందని చెప్పారు. ఆరునెలలుగా పరిపాలనను గమనిస్తున్నా, అంకితభావంతో రేవంత్ నడుపుతున్నారని వివరించారు. రేవంత్ రెడ్డి సమర్థవంతంగా పాలన అందిస్తున్నారని కొనియాడారు. రైతులకు మంచి జరగాలనే రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని బలపరుస్తూ తాను, తన అనుచరులు మొత్తం కాంగ్రెస్‌లో చేరారు అని పోచారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఇకపోతే మంత్రివర్గ విస్తరణలో పోచారంకు స్థానం ఉందంటూ ప్రచారం సాగుతోంది.

## డ్రగ్స్ విషప్రయోగంతో సమానం

### డ్రగ్స్ నిర్మూలకు ప్రభుత్వం కఠిన చర్యలు

### జలవిహార్ వద్ద ర్యాలీని ప్రారంభించిన భట్టి

హైదరాబాద్ : రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలనకు తమ ప్రభుత్వం కఠినంగా వ్యవహరి స్తోందని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఈ విషయంపై ఏ స్థాయిలో అయినా నిర్ణయాలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. హైదరాబాద్ నెక్లెస్‌రోడ్డులో జలవిహార్ వద్ద డ్రగ్స్ నిర్మూలన ర్యాలీని ఆయన ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. డ్రగ్స్ వినియోగం విషప్రయోగం లాంటిది.. ఇది అత్యంత ప్రమాదకరం. కుటుంబ వ్యవస్థలను విచ్ఛిన్నం చేస్తుంద ని అన్నారు. డ్రగ్స్ సరఫరా చేస్తున్న సంఘ విద్రోహశక్తుల చేతిలో యువత జీవితాలు చిన్నాభిన్నం అవుతున్నాయి. తెలిసీ తెలియని వయసులో వాటి బారిన పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. కొందరు కావాలనే తమ అక్రమ సంపాదన కోసం యువతకు డ్రగ్స్ అంటగడుతున్నారు. దేశాన్ని బలహీనపరిచేందుకు దేశద్రోహులు చేస్తున్న ప్రయత్నంగానూ దీన్ని చూడొచ్చని అన్నారు. రాష్ట్రాన్ని కాపాడుకునే బాధ్యత మనపైనే ఉంది. డ్రగ్స్ నిర్మూలనకు నార్కోటిక్ బ్యూరోకు ఎంత బడ్జెట్ అయినా కేటాయిస్తాం. పోలీసులకు సమాచారం ఇచ్చే వ్యవస్థను బలోపేతం చేసుకోవాలని సూచించారు. అన్ని గ్రామాల్లో డ్రగ్స్ నిర్మూలన కమిటీలు వేయాలి. తాత్కాలిక సంతోషాలకు విద్యార్థులు బలి కావొద్దు. వారు అడ్డదారులు తొక్కితే కుటుంబంతో పాటు సమాజం మొత్తం బాధపడాల్సి ఉంటుందని భట్టి విక్రమార్క అన్నారు.

# కష్టాల (వానా)కాలం

**మొదటిపేజీ తరువాయి**

ఇదే సమయంలో భద్రాద్రి ఏజెన్సీలో విద్యుత్ స్తంభాలు నీటమునిగి సప్లై నిలిచిపోయి అంధకారం రాజ్యమేలుతుంది. రాకపోకల స్తంభన వలన వైద్యం కూడా అందని ద్రాక్ష అవుతుంది. నిత్యావసర సరుకులకు రెక్కలు వస్తాయి. వరదదృశ్యాలు హృదయ విదారకరంగా కనిపిస్తాయి వానాకాలంలో వలస బాధలు తప్పేది ఎన్నడని ఏజెన్సీవాసులు మథనపడుతుంటారు. . ఇదేనా పాలక ప్రభుత్వాల 77 ఏళ్ళ స్వతంత్ర దేశంలో సాధించిన అభివృద్ధి అని జనం ఆగ్రహిస్తారు. తమ ప్రాంత అభివృద్ధిని పట్టించుకోండి మహాప్రభూ అని వరద ముంపు గ్రామాల ప్రజలు ఆర్తనాదాలు పెడతారు. ఈ సమయంలో ఎలాంటి నష్టం జరగకుండా, ప్రభుత్వానికి చెడ్డపేరు రాకుండా మంత్రులు, కలెక్టర్లు భద్రాచలం వద్ద మకాం చేసి గోదావరి ప్రవాహాన్ని పరిశీలిస్తూ ఎగువ ప్రాంత వరద పరిస్థితులను అంచనా వేస్తూ తగు జాగ్రత్తలు తీసుకుంటారు.

### ప్రగతి పథంలో రోడ్లపై పడవ ప్రయాణం

ప్రగతి పథంలో పయనిస్తున్నామని పాలకులు చెబుతున్న దానికి భద్రాద్రి ఏజెన్సీలో వాస్తవ పరిస్థితులకు ఏమాత్రం పొంతన లేదనిపిస్తుంది. ఎందుకంటే వరదల సమయంలో నేటికీ రోడ్లపై పడవ ప్రయాణం చేయాల్సిన దుర్భర స్థితులు నెలకొనడమే ఇందుకు సాక్ష్యం. పాలకులు మారినా ప్రభుత్వాలు మారినా భద్రాద్రి ఏజెన్సీ స్థితిగతులు మారడంలేదు. పూర్వ పరిస్థితులతో పోల్చినపుడు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషి, ప్రత్యేక శ్రద్ధల ఫలితంగా భద్రాద్రి ఏజెన్సీలో రవాణా సౌకర్యాలు మెరుగుపడినా ఇంకా వానాకాలం బాధలు మాత్రం తొలగిపోలేదు. భద్రాచలం వద్ద గోదావరి రెండవ ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరుకోగానే భద్రాచలం నుంచి దుమ్ముగూడెం, చర్ల, వెంకటాపురం వెళ్ళే దారిలో పలుచోట్ల రోడ్లపై వరద నీరుచేరి వాహనాల రాకపోకలు నిలిచిపోతాయి. వరద మరింత పెరిగితే రవాణా స్తంభిస్తుంది. అపుడు రోడ్లను ముంచిన నీటిపై అధికారులు పడవలు ఏర్పాటుచేయించి పోలీసు బందోబస్తు నడుమ అత్యవసర ప్రయాణీకులను గమ్యస్థానాలకు చేర్చాల్సివస్తోంది. ఈ సమయంలో ఊహించని ప్రమాదం సంభవిస్తే బాధ్యత అధికారులదా ? పాలక ప్రభుత్వాలదా అనేది అంతుచిక్కని ప్రశ్న మూడవ ప్రమాద హెచ్చరిక వస్తే బూర్గంపాడ్ రూట్‌లో రాకపోకలు నిలిచిపోతాయి. భద్రాద్రి చుట్టూ అనేక గ్రామాలు జలదిగ్బంధనంలో చిక్కుకుంటాయి. పునరావాస కేంద్రాల్లో అష్టకష్టాలు పడుతూ వరద బాధితులు కాలం వెళ్ళదీస్తారు. అపుడు భద్రాచలం పట్టణానికి అన్నివైపుల నుంచి రవాణా సంబంధాలు తెగిపోతాయి. లాంచీలు లేదా హెలికాప్టర్ల ద్వారా వరద బాధితులకు ఫుడ్, ఇతర సరుకులు సప్లై చేస్తారు. వరదల సమయంలో అధికార యంత్రాంగానికి తీసిపోని విధంగా మానవతావాదులు అందించే సేవలు బహు ప్రశంసనీయమని చెప్పవచ్చు.

### శాశ్వత చర్యలతోనే ఏజెన్సీకి రక్షణ

శాశ్వత చర్యలతోనే భద్రాద్రి ఏజెన్సీకి సంపూర్ణ రక్షణ కలుగుతుందని భద్రాద్రి ప్రాంత ప్రజలు అభిప్రాయపడుతున్నారు. వలసల అవసరం లేకుండా వరద ముంపు లోతట్టు ప్రాంతాలను గుర్తించి అక్కడి ప్రజలకు మెరక ప్రాంతాల్లో శాశ్వత గృహాలు నిర్మించడం చాలా అవసరం. ముఖ్యంగా రోడ్లు నీట మునిగే పల్లపు ప్రాంతాలను గుర్తించి రోడ్ల ఎత్తుపెంచి గోదావరి వరదల సమయంలోను రవాణా సౌకర్యాలు స్తంభించకుండా ప్రయాణం సాఫీగా సాగేలా శాశ్వత చర్యలు చేపట్టాలి. అలాగే గోదావరి 70 అడుగులు వచ్చినా విద్యుత్ స్తంభాలు నీట మునగకుండా పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలి. అన్ని వాగులపై వంతెనలు నిర్మించి మారుమూల గ్రామాలకు సైతం రహదారి సౌకర్యం కల్పించి విద్య, వైద్యం అందుబాటులోకి తీసుకరావాలి. ఈ ఏడాది వర్షాకాలంలో ఏజెన్సీ మండలాల ప్రజలు ఇబ్బందులు పడకుండా అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్నిరకాల మందులు, ప్రజలకు లోటురాకుండా నిత్యావసర సరుకులు ప్రణాళిక ప్రకారం నిల్వ ఉంచాలి. తాత్కాలిక మొక్కుబడి చర్యలు కొంతమేరకు ప్రజలకు ఉపయోగపడినా ప్రజల్లో వర్షాకాల బాధల అభద్రతాభావాన్ని మాత్రం పోగొట్టలేవు. శాశ్వత చర్యలతోనే ఏజెన్సీ సమస్యలకు పరిష్కారం. ఆ దిశగా రెవంత్‌రెడ్డి సర్కార్ ఆలోచన చేసి కార్యరూపం చేపట్టాలని భద్రాద్రి ఏజెన్సీ వాసులు ముక్తకంఠంతో కోరుతున్నారు.



గత వర్షాకాలంలో ముంపు గ్రామాన్ని సందర్శించిన భట్టి, పొదెం వీరయ్య

# మా పార్టీలో దొంగ నాయకులు

- ప్రజలకు పంచాల్సిన మనీ నొక్కేశారు
- వివేక్‌కు చెడ్డ పేరు తెస్తున్నారు
- శ్యాం గౌడ్ మెసేజ్‌ల కలకలం

**రామకృష్ణాపూర్, (నినాదం న్యూస్):** చెన్నూరు అసెంబ్లీ నియోజకవర్గం క్యాతనపల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీలో దొంగలు న్నారంటూ ఆ పార్టీ పెద్దపల్లి పార్లమెంట్ యువజన శాఖ అధ్యక్షుడు డీకొండ శ్యామ్ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. వీరి వల్ల ఎన్నో ఏండ్లుగా క్యాతనపల్లి మున్సిపాలిటీలో (గతం లో గ్రామపంచాయతీ) పార్టీ అభివృద్ధి సాధించలేక పోయిం దన్నారు. తాజాగా ప్రజలందరూ కష్టపడి కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి చెడ్డ పేరు తెచ్చేలా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఈ మేరకు రెండు రోజులుగా ఆయన సోషల్ మీడియాలోని కాంగ్రెస్ పార్టీ గ్రూప్ తో పాటు ఇతర గ్రూపులలో కూడా పెద్ద ఎత్తున మెసేజ్ లు పెడుతు న్నారు. రెండుసార్లు ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షునిగా ప్రస్తుతం పెద్దపల్లి పార్లమెంటు యువజన అధ్యక్షునిగా పనిచేస్తున్న శ్యామ్ ఈ విధమైన ఆరోపణలు చేయడంపై భిన్నాభి ప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇక ఏండ్ల తరబడి పార్టీ కోసం కష్టపడే వారిని కాదని కొంతమంది నాయకులు కొత్త వారిని తెరపైకి తీసుకువచ్చి తమను అణగతొక్కుతున్నారంటూ సీనియర్ కార్యకర్తలు సైతం సోషల్ మీడియాలో వాపోతున్నారు. ఇక శ్యామ్ గౌడ్ చేసిన ఆరోపణలలో.., ఉద్యోగాలు పెట్టిస్తా మంటూ డబ్బులు వసూలు చేయడం, ఎమ్మెల్యే ఎంపీ ఎన్నికల సందర్భంగా ప్రజలకు పంచమని ఇచ్చిన డబ్బులు నొక్కేయడం, పైరవీలు చేయడం లాంటి ఆరోపణలు ఉన్నాయి. ఇలా చేస్తున్న వారే తాజాగా ఎమ్మెల్యే వివేక్ , ఎంపీ వంశీల వెంట ఉండి సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని శ్యామ్ ఆరోపిస్తున్నారు. వీరి వ్యవహారాలపై పార్టీ పెద్దలు స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇలాంటి వారిని పక్కకు పెట్టి ప్రజాబలం ఉన్న వారిని, పదేండ్ల పాటు పార్టీ కోసం కష్టపడ్డ వారిని ఎంపీ ఎమ్మెల్యేలు గుర్తించాలని ఆయన కోరారు. లేదంటే స్థానిక ఎన్నికలలో ఈ ప్రాంతంలో పార్టీ పరువు పోతుందని ఆయన అన్నారు.




## చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

Chola Enter a better life

కార్పొరేట్ ఆఫీస్: చోళ క్రెస్ట్, సూపర్ బి, సి54 & సి55, 4, తిరు వి క ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600 032, తమిళనాడు

డిమాండ్ నోటీసు

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ("ది యాక్ట్") మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 ('ది రూల్స్') నిబంధనల క్రింద

సదరు చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద జారీ చేసిన డిమాండ్ నోటీసు(ల)లోని రూల్ 3తో చదువబడు విధంగా చట్టంలోని సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకొనుచూ **చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్** (ది సెక్యూర్డ్ క్రెడిటార్) **అధీకృత అధికారి** అయిన దిగువ సంతకముదారు సదరు నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోగా సంబంధిత నోటీసులలో తెలిపిన మొత్తాన్ని తిరిగి చెల్లించవల్సిందిగా దిగువ తెలిపిన రుణగ్రహీతలను కోరారు. డిమాండ్ నోటీసులను స్వీకరించకుండా రుణగ్రహీతలు తప్పించుకుంటున్నారని క్రింది సంతకముదారు సహేతుకంగా విశ్వసిస్తున్నారు. అందువలన నిబంధనల ప్రకారం అతికించడం మరియు ప్రచురణ ద్వారా నోటీసు అందజేస్తున్నారు. డిమాండ్ నోటీసు(ల) సారాంశం దిగువ పేర్కొనబడినవి.

| క్ర. సం. | రుణగ్రహీత/లు & సహ-రుణగ్రహీత/ల పేరు మరియు చిరునామా | రుణ మొత్తం | డిమాండ్ నోటీసు తేదీ & చెల్లింపవల్సిన బకాయి మొత్తం | ఆస్తి/సెక్యూర్డ్ ఆస్తి వివరణ |
|---|---|---|---|---|
| 1 | రుణ ఖాతా నం.(లు).: X0HLHBD00002729638 1. శ్రీ/శ్రీమతి బత్తుల ఆనంద్‌ప్రసాద్ 2. శ్రీ/శ్రీమతి నీలిమ నాయుడు బత్తుల ఇరువురి నివాసం: ఫ్లాట్ నెం. 302, మమన్ రామ్ రెసిడెన్సీ, సూర్య నగర్, సైనిక్‌పురి-500094, తెలంగాణ మరియు ఫ్లాట్ నెం. 302, మమన్ రామ్ రెసిడెన్సీ, సూర్య నగర్, సైనిక్‌పురి, గణేష్ టెంపుల్, రంగారెడ్డి-500094, తెలంగాణ. | రూ. 24,64,350/- | 21.06.2024 తేది: 17.06.2024 నాటికి రూ. 34,17,693/- (రూపాయలు ముప్పై నాలుగు లక్షల పదిహేడు వేల ఆరు వందల తొంభై మూడు మాత్రమే) | మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, మల్కాజ్‌గిరి మం॥, అల్వాల్ మున్సిపాలిటీ, యాప్రాల్ గ్రా॥, సూర్యానగర్ వద్ద సర్వే నెం॥. 189 & 190లో 892.00 చ॥గ॥ల విస్తీర్ణము కలిగిన ప్లాట్ నెం॥. 26, 27, 28 & 29లలో నిర్మించబడిన "జాకీ క్లాసిక్" (మమన్ రామ్ రెసిడెన్సీ) కాంప్లెక్స్ నందు రెండవ అంతస్తులో 1080 చ॥అ॥ల (కామన్ ఏరియా మరియు కార్ పార్కింగ్‌తో కలుపుకొని) ప్లింత్ ఏరియా కలిగి మొత్తం భూమి నుండి 30.00 చ॥గ॥లు లేదా 25.08 చ॥మీ॥ల భూమి యొక్క అవిభాజ్యవాటాతో పాటు సగం పూర్తైన నివాస ఫ్లాట్ నెం. 302 యావదాస్తి. **సరిహద్దులు: ఫ్లాట్ యొక్క సరిహద్దులు-భూమి యొక్క సరిహద్దులు: ఉత్తరం:** ఖాళీ ప్రదేశం-40'-00' వెడల్పు రోడ్డు, **దక్షిణం:** ఖాళీ ప్రదేశం-ప్లాట్ నెం॥. 25 & 30, **తూర్పు:** కారిడార్-40'-00' వెడల్పు రోడ్డు, **పడమర:** ఖాళీ ప్రదేశం-రోడ్డు. |

**ఈ నోటీసు 18.04.2023 తేదీ గల మునుపటి నోటీసుకు బదులుగా పంపబడినది. దీని ద్వారా 18.04.2023 తేదీన SARFAESI చట్టంలోని యొక్క 13(2) క్రింద జారీ చేయబడిన మునుపటి నోటీసు తక్షణమే ఉపసంహరించబడిందని తెలియజేయడమైనది.**

డిమాండ్ నోటీసులను పాటించవలసిందిగా మరియు చెల్లింపు వసూలయ్యే తేదీ వరకు వర్తించు వడ్డీ, అదనపు వడ్డీ, బౌన్స్ ఛార్జీలు, వ్యయం మరియు ఖర్చులతో పాటు అందులో మరియు ఇకమీదట పేర్కొన్న డిమాండ్ మొత్తాన్ని ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి **60 రోజులలోగా** చెల్లించవల్సిందిగా రుణగ్రహీత(ల)కు ఇందుమూలంగా తెలియజేయడమైనది. **చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్** సెక్యూర్డ్ క్రెడిటార్ అని మరియు రుణగ్రహీత(లు) వినియోగించుకున్న రుణ సదుపాయం రుణగ్రహీత(ల)చే తనఖా పెట్టబడిన సెక్యూర్డ్ ఆస్తి(లు) అయినటువంటి స్థిరాస్తి/ఆస్తులపై సెక్యూర్డ్ రుణమని రుణగ్రహీత(లు) గమనించవలెను. రుణగ్రహీత(లు) నిర్ణీత కాలవ్యవధిలోగా పూర్తిగా, రుణ బాధ్యతలు చెల్లించడంలో విఫలమైతే సదరు రుణ మొత్తమును వసూలు చేసుకొనుటకు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద తనఖా పెట్టిన ఆస్తులను స్వాధీనము చేసుకొనడమే కాకుండా అట్టి సెక్యూర్డ్ ఆస్తులను అమ్మకం ద్వారా బదిలీ చేయుటకు లేదా సదరు చట్టము మరియు రూల్స్ అనుసరించి అన్ని పరిష్కారములు వినియోగించుకొనుటకు హక్కు కలిగియున్నారు. అమ్మకం లేదా బదిలీకి గల హక్కులు వినియోగించుకునే ముందు సెక్యూర్డ్ ఆస్తి(ల) **అటాచ్ చేయుటకు మరియు లేదా సీలు చేయుటకు** కూడా సెక్యూర్డ్ క్రెడిటార్ సాధికారత కలిగియున్నారు. సెక్యూర్డ్ ఆస్తి(ల) అమ్మకం తరువాత సెక్యూర్డ్ క్రెడిటార్‌కు చెల్లించవలసిన బకాయిలను కవర్ చేయుటకు తనఖా పెట్టిన ఆస్తుల విలువ తగినంతగా లేనట్లయితే మిగిలిన బకాయిలను రాబట్టుకొనేందుకు విడి చట్టపరమైన ప్రొసీడింగ్స్ చేపట్టే హక్కు కూడా సెక్యూర్డ్ క్రెడిటార్ కలిగి ఉన్నారు. ఏదేని చట్టం క్రింద సెక్యూర్డ్ క్రెడిటార్‌కు లభించే అన్ని ఇతర పరిష్కారాలకు ఈ పరిష్కారం అదనంగా మరియు ఇండిపెండెంట్‌గా ఉంటుంది.

సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనేందుకు లభించే సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13(8)ని గమనించగలరు మరియు చట్టంలోని తదుపరి సెక్షన్ 13(13) క్రింద సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా పెట్టిన ఆస్తులను వారి యొక్క ముందస్తు వ్రాత పూర్వక సమ్మతి లేకుండా ఏవేని ఆస్తుల అమ్మకం, లీజు లేదా ఇతరత్ర (సాధారణ వ్యాపార కార్యకలాపాలు కాకుండా) బదిలీ చేయుట లేదా సెక్యూర్డ్ ఆస్తి(ల)ను అమ్మకం లేదా వ్యవహారం నుండి రుణగ్రహీత(లు) నిరోధించబడినారు/నిషేధించబడినారు మరియు పైన తెలిపిన వాటిని పాటించకపోతే అది సదరు చట్టంలోని సెక్షన్ 29 క్రింద శిక్షార్హమైన నేరమవుతుంది. డిమాండ్ నోటీసు కాపీ దిగువ సంతకముదారు వద్ద లభిస్తుంది మరియు రుణగ్రహీత(లు) వారు కోరుకుంటే దానిని దిగువ సంతకముదారు నుండి ఏ పని రోజునైన సాధారణ కార్యాలయ పనివేళలో తీసుకోవచ్చును.

ప్రదేశం: మేడ్చల్-మల్కాజ్‌గిరి, తెలంగాణ
తేది: 21.06.2024

సం/- అధీకృత అధికారి
చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ తరఫున


# సీజనల్ వ్యాధులపై దృష్టి సారించండి

- ప్రభుత్వ వైద్యులు సాధారణ ప్రసవాలపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలి
- విధులలో సమయపాలన పాటించాలి - జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి





**నల్గొండ బ్యూరో, జూన్ 25(నినాదం న్యూస్):** వర్షాకాలం ప్రారంభమైనందున ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల డాక్టర్లు సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు.మంగళవారం ఆయన తన ఛాంబర్ నుండి జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామాలలో ఏ ఒక్కరు వ్యాధుల బారిన పడకుండా చూడాలని, ఎక్కడైనా సీజనల్ వ్యాధులు ప్రబలినట్లయితే తక్షణమే ఆయా గ్రామాలకు వెళ్లి చికిత్స అందించాలని, అవసరమైతే వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వర్షా కాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామపంచాయతీ బృందాలతో మెడికల్ బృందాలు సమన్వయం చేసుకొని వెళ్లాలని తెలిపారు. ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాల ద్వారా నిరంతరం అందించే సేవలలో ఎలాంటి ఆటంకం లేకుండా అందించాలని, వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, ఎవరైనా అనధికారికంగా విధులకు గైహాజరైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇకపై ప్రతి ఆరోగ్య కేంద్రానికి ఆయా అంశాలపై లక్ష్యాన్ని నిర్దేశించడం జరుగుతుందని, ముఖ్యంగా మండల బృందాల ద్వారా అవుట్ పేషెంట్ల సంఖ్యను తనిఖీ చేయడం జరుగుతుందని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల డాక్టర్లు తప్పనిసరిగా వైద్యం కోసం వచ్చిన రోగుల నుండి మొబైల్ నెంబర్ను రిజిస్టర్ చేసుకోవాలని, ఓపిని పద్ధతి ప్రకారం నిర్వహించాలని తెలిపారు.ప్రత్యేకించి ప్రభుత్వ ఆసుపత్రులలో సాధారణ ప్రసవాలపై దృష్టి సారించాలని ,సిజేరియన్ తగ్గించాలని అన్నారు. గ్రామ స్థాయి నుండి ఆశ వర్కర్ సరైన విధంగా పనిచేయాలని ,గ్రామ స్థాయి బృందంతో కలిసి పని చేయాలని ఆదేశించారు .ప్రతి గర్భిణి తప్పనిసరిగా వైద్యారోగ్య కేంద్రంలో నమోదు కావాలని, ఎట్టి పరిస్థితులలో పరీక్షలు తప్పిపోరాదని, ఒకవేళ ఏఎన్సీ జరగకుండా నేరుగా కాన్పుకు వచ్చినట్లయితే సంబంధిత ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం డాక్టర్లు బాధ్యత వహించవలసి ఉంటుందని చెప్పారు. జిల్లాలోని ఆయా ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలలో గర్భస్రావాలు నమోదు కావడంపై ఈ అంశాన్ని ప్రత్యేకంగా జిల్లా కలెక్టర్ ప్రస్తావిస్తూ గర్భస్రావాలు కావడానికి గల కారణాలను అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు, ఉప కేంద్రాలు సైతం క్రమ పద్ధతిలో పనిచేయాలని, ఇకపై వైద్య ఆరోగ్యశాఖ సంబంధించి ప్రతి రెండు వారాలకు ఒకసారి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రజలకు సరైన వైద్యం అందించడమే కాకుండా, మెరుగైన వైద్యం అందించడమే ధ్యేయంగా వైద్య ఆరోగ్యశాఖ పనిచేయవలసిన అవసరం ఉందని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి.పూర్ణ చంద్ర, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కళ్యాణ చక్రవర్తి, డి సి హెచ్ ఎస్ మాతృనాయక్ హాజరయ్యారు.

## పొన్నం ప్రభాకర్ ను విమర్శించే స్థాయి కౌశిక్ రెడ్డికి లేదు

### కాంగ్రెస్ పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మాకర్ రెడ్డి



**జమ్మికుంట, జూన్ 25 (నినాదం న్యూస్) :** అవినీతికి కేరాఫ్ అడ్రస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి అని విద్యార్థి సంఘ నాయకుడిగా కిందిస్థాయి నుండి అంచెలంచెలుగా ఎదుగుతూ ఎంపీగా రాష్ట్ర మంత్రిగా సమర్థవంతంగా తన పాలనను అందిస్తున్న గొప్ప వ్యక్తి పొన్నం ప్రభాకర్ గౌడ్ అని కాంగ్రెస్ పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం హుజురాబాద్ మండలం చెల్పూర్ ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కౌశిక్ రెడ్డి ఎమ్మెల్యే కాకముందు నుండి నాకు వాళ్లు తెలుసు వీళ్ళు తెలుసు అని ఎంతో మంది అమాయకుల దగ్గర లక్షల రూపాయలు ఉద్యోగాలు ఇప్పిస్తానని వసూలు చేసిన ఘనత కౌశిక్ రెడ్డి అని ఆయన అన్నారు. పొన్నంను విమర్శించే స్థాయి నీకు లేదని ప్రీతి నిజాయితీకి మారుపేరు పొన్నం ప్రభాకర్ గౌడ్ అని విద్యార్థి సంఘ నాయకుడిగా తన ప్రస్తానాన్ని మొదలుపెట్టి అంచలంచలుగా ఎదుగుతూ ప్రజల విశ్వాసాన్ని పొందిన గొప్ప నాయకుడు పొన్నం ప్రభాకర్ గౌడ్ అని అన్నారు. ఉన్న ప్రభాకర్ ను విమర్శిస్తే సహించేది లేదని ఆధారాలు లేకుండా అడ్డగోలు ఆరోపణలు చేస్తే ప్రజాక్షేత్రంలో సరైన బుద్ధి చెబుతామని ఇకపైన తప్పుడు ఆరోపణలు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ సజ్జు గూడెపు సారంగపాణి సలీం ఎగ్గని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బస్సు ట్రాలీ ఆటో ఢీ ఇద్దరు దుర్మరణం



**ధర్మారం జూన్ 25 (నినాదం న్యూస్):** రాజీవ్ రహదారి పై కరీంనగర్ ధర్మారం మధ్యలో మల్లాపూర్ స్టేజి వద్ద ఆర్టీసీ బస్సు నెంబర్ ఏపీ 29 జెడ్ 26 22., ట్రాలీ ఆటో నెంబర్ ఏపీ 28 ఏ 87 28, ఎదురెదురుగా రెండు బలంగా ఢీకొనడంతో ట్రాలీ ఆటోలో ఉన్న డ్రైవర్ అన్వర్ హైదరాబాద్ కు చెందిన వ్యక్తి, కాగా, పక్కనే ఉన్న అఫ్జల్ గోదావరిఖనికి చెందిన వ్యక్తి ఇద్దరు అక్కడికక్కడే మరణించారు. బస్ డ్రైవర్ పుప్పాల రవీంద్రరావు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

# ఫీ 'జులుం'




- ఇష్టారాజ్యంగా ప్రైవేటు బడుల్లో వసూళ్లు
- పది చదివిన వారితో విద్యాబోధన
- సీబీఎస్ఈ, ఐఐటీ పే అదనం
- ఇరుకు గదులు, కనిపించని క్రీడాస్థలం
- చోద్యం చూస్తున్న విద్యాశాఖ
- ప్రైమరీకే 25000, ఎల్కేజీకి 50,000
- 30 శాతం పెరిగిన నోటుబుక్ ధరలు
- స్కూళ్లలోనే యూనిఫామ్స్ ,బుక్స్ అమ్మకాలు
- పట్టించుకోని అధికారులు
- తల్లిదండ్రులపై ఆర్థిక భారం

**కోదాడ ,జూన్ 25 (నినాదం న్యూస్):** జిల్లాలో ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజులుం పర్వం కొనసాగుతోంది. పాఠశాలలు ప్రారంభం కాగానే ఫీజుల మోతతో తల్లిదండ్రుల హైరానా పడుతున్నారు. తమను యేటా అడిగేవారు లేరు.. మేము అడిగినంత ఇవ్వాల్సిందేనంటూ వేలకు వేల ఫీజులను ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు పెంచుకుంటూపోతున్నాయి. రకరకాల పేర్లతో పుట్టుకొస్తున్న పాఠశాలలు ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. అడ్మిషన్ మొదలు టై, బెల్టుల వరకు యాజమాన్యాలు నిర్ణయించిన ధర చెల్లించి అని కొనుగోలు చేయాల్సిందే. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పేరెంట్స్ కమిటీలు ఏర్పాటు చేసి వారి ఆమోదంతోనే ఫీజులను పెంచాలి. కానీ జిల్లాలో ఎక్కడా కూడాపేరెంట్స్ కమిటీలు ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు. వేలల్లో ఫీజులు వసూలు చేస్తున్నా విద్యార్థులకు ఇరుకు, చీకటి గదుల్లో విద్యాబోధన చేస్తున్నారు. యూ కేజీ స్థాయి పిల్లలు కూడా తమ పాఠశాల మెట్లపై గుండా పుస్తకాల మూటలు వేసుకుని మూడంతస్తులు ఎక్కిస్తున్నారు. ప్రతి పాఠశాలలో విశాలమైన ఆట స్థలం ఉండాలి. కానీ ఎక్కడా నిబంధనలు పట్టించుకున్న పాపాన పోవడం లేదు. విద్యార్థులకు చదువులు తప్ప ఆటలు ఆడించిన దాఖలాలు లేవు. పాఠశాలల్లో కొత్త విద్యాసంవత్సరం ప్రారంభమవుతున్న తరుణంలో పుస్తకాలు, డ్రెస్సుల విక్రయాలు మొదలయ్యాయి. ఈ క్రమంలో ప్రైవేట్ స్కూళ్ల దోపిడీపై అన్ని వర్గాల్లో చర్చ ప్రారంభమైంది.. గత ఏడాది కంటే ఈసారి నోట్ బుక్స్ స్టేషనరీ ధరలు 25 శాతం నుండి 35 శాతం అలాగే ప్రైమరీ యిచదువులకై 25 వేలకు మించి వార్షిక ఫీజు వసూలు చేస్తున్నారు. విద్యాలయాలను వ్యాపారం మారుస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

**బడిలో వ్యాపారం....**

సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా 250 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి విద్యాలయాలు....విద్యాబుద్ధులు బోధించేదిగా ఉండాలే తప్పితే పుస్తకాలు , పెన్నులు దుస్తులు విక్రయించే అంగడీగా ఉండొద్దని ప్రభుత్వ జీవోలు చెబుతున్నాయి . కానీ ఆ జీవోలను ప్రైవేట్ స్కూళ్లు పట్టించుకోవడం లేదు . బడిలోనే కౌంటర్లు పెట్టి మరీ విక్రయిస్తున్నారు . కొన్ని స్కూళ్లల్లో ప్రైవేట్ షాపుల్లో నుంచి కమీషన్లు తీసుకుని విద్యార్థులకు యూనిఫాం , బుక్స్ కొనుగోలు చేయాలని సూచిస్తున్నారు . ఇక్కడే తమ కమీషన్ లాజిక్కు అమలు చేస్తు న్నారు. ఒకే ఒక వస్త్ర దుకాణంలో స్కూల్ యూనిఫామ్స్ లభించేలా ఒప్పందం కుదుర్చుకుని దుస్తులను అధిక ధరలకు అమ్ముతున్నారు . ఒక యూనిఫాంకు రూ .1500 నుంచి 2000 వే వరకు దోచుకుంటున్నారు .

**విద్యా వ్యాపారంగా మారిన "కోదాడ"...** కోదాడ పట్టణం విద్యా పరంగా మారిందంటే అతిశయోక్తి కాదు. జిల్లా వ్యాప్తంగా 250 ప్రైవేట్ పాఠశాలలు ఉంటే ఒక కోదాడ పట్టణంలో సుమారుగా 55 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. దీనిని బట్టి అర్థం చేసుకోవాలి వీధికొక పాఠశాల ఏర్పాటు అయిందని... పాఠశాల పై అధికారుల సరైన పర్యవేక్షణ లేకపోవడంతో, అందిన కాడికి డబ్బులు దోచుకుంటూ మధ్యతరగతి కుటుంబాల నడ్డి విరుస్తున్నారు. పుస్తకాలను పాఠశాలలో విక్రయించకూడదని నిబంధనలు ఉన్నప్పటికీ, పాఠశాలలో కాకుండా ప్రత్యేకంగా అద్దెకు గదులు తీసుకొని పుస్తకాలు విక్రయిస్తూ కొత్త దందాకు తెర తీశారు. ప్రభుత్వ పాఠశాలలో సరైన భోజనం లేకపోవడంతోనే ప్రైవేటు పాఠశాలలకు మొగ్గు చూపుతున్నామని తల్లిదండ్రుల పేర్కొంటున్నారు. కొన్ని పాఠశాలలు పోటీ తత్వం తట్టుకోలేక మధ్యలోనే మూసివేస్తున్నారు. దీంట్లో ఆ పాఠశాలలో చదివిన విద్యార్థులు సర్టిఫికెట్ అవసరమైనప్పుడు చాలా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి.

**ఇరుకు గదులు.. కనిపించని ఆట స్థలాలు..** నిబంధనలు మాత్రం పట్టించుకోవడం లేదు. చాలావరకు పాఠశాలలు ఇరుకు గల్లీలోని భవంతిల్లోఇరుకు గదుల్లో విద్యాబోధన చేస్తున్నారు. చిన్నపిల్లలను కిలోల బరువుండే పుస్తకాల బస్తాలతోరెండు, మూడు అంతస్తులు ఎక్కిస్తున్నారు. అన్నిస్కూళ్లకు ఆట స్థలాలు లేవు. చదువు.. చదువుఅంటూ విద్యార్థులను ఆటలు మరిచిపోయేలా చేస్తున్నారు. స్పెషల్ క్లాస్, స్కూలు ముగిసిన తరువాత స్కూల్లోనే ట్యూషన్లు చెబుతున్నారు.ఎక్కడా విద్యార్థులు ఆటలాడిస్తున్న దాఖాలాలు లేవు. చదువు చెప్పాలి, ఫీజులు వసూలు చేయాలి. ఇప్పుడుఅన్ని ప్రైవేట్ పాఠశాలల్లో ఇదే తంతు కొనసాగుతోంది. స్కూళ్ల పేరున తోకపేర్లు టాలెంట్, టెక్నోలుతొలగించాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నప్పటికీ వాటిని పట్టించుకోవడం లేదు. అనుమతి లేని పాఠశాలలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. దీనికి కొందరు విద్యాశాఖాధికారుల అండదండలు ఉన్నాయని బహిరంగంగానే విమర్శిస్తున్నారు. విద్యార్థులకు బీఈడీ పూర్తి చేసిన వారితో పాఠాలుచెప్పించాలి. కానీ వారికి వేతనాలు ఎక్కువగాఇవ్వాల్సి వస్తుందనే కారణంతో పదో తరగతి వరకు చదువుకున్న వారితోనే చదువులు చెప్పిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రైవేట్ పాఠశాలలఫీజులుంకు అడ్డుకట్టవేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.


**అమలుకు నోచని జీవో నం1..** బడి అంటే ఏదో చదువు చెప్పి పంపిస్తే సరిపోతుంది లే అంటే కుదరదు . ఆది సర్కారు బడైనా , ప్రైవేట్ బడైనా ప్రభుత్వ నియమనిబంధనల ప్రకారమే కొనసాగాలి . ప్రతీది ప్రణాళికాబద్ధంగానే ముందుకు కదలాలి . పాఠశాలలకు సంబంధించిన ఎన్నో ప్రధాన " మైన విషయాలను జీవో ఎంఎస్ నంబర్ .1 లో పొందుపర్చారు . అందులో కొన్ని శానిటేషన్ అగ్ని ప్రమాదాలు జరగకుండా ఫైర్సేఫ్టీ , అద్దె భవనాలైతే నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ , స్కూళ్లకు ప్రభుత్వ గుర్తింపు , గుర్తింపు తేదీ పూర్తయితే రెన్యూవల్ చేసుకోవాలి , స్కూళ్లకు బస్సులు ఉంటే వాటి కండీషన్ సర్టిఫికెట్ పిల్లలకు సౌకర్యాలు ఇలా ఎన్నో అంశాలు ఉన్నాయి . కానీ అమలు మాత్రం జరగడం లేదు.

**నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు: అశోక్, డీఈవో**

ప్రైవేట్ పాఠశాలల యజమాన్యా లు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటాం. జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలలకు సర్కులర్ జారీ చేశాం. నిబంధనను అతిక్రమించి అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటాం. అధిక ఫీజులు వసూలు చేస్తే తల్లిదండ్రుల ఫిర్యాదు చేయాలి . పాఠశాలల్లో బుక్స్ , పుస్తకాలు అమ్మితే సదరు పాఠశాలలపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం

**ఫీజుల పేరిట ప్రైవేట్ పాఠశాలల దోపిడీ...**

**- బిసి విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి, పచ్చిమాల రామకృష్ణ యాదవ్**



ఫీజుల పేరిట దోపిడీ చేస్తున్న యాజ మాన్యాలపై వెంటనే చర్యలు తీసుకోవాలి. ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి. నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలల ఆవరణలో పాఠ్యపు స్తకాలు, యూనిఫామ్, టై, బెల్ట్, ఇతర సామగ్రి విక్రయిస్తు,విద్యను వ్యాపారం చేస్తున్నారన్నారు. పాఠశాలల్లో వసూలు చేస్తున్న ఫీజు లను నోటీసు బోర్డులో ప్రదర్శించాలి. ఇంటర్నేషనల్, ప్లేస్కూల్, డీజీ, సీబీఎస్సీ లీడ్ కరికులం పేరుతో విద్యార్థులతోపాటు తల్లిదండ్రులను మోసం చేస్తు.. సమ్మర్ క్యాంపుల పేరిట అడ్మిషన్లు చేపడుతు, తరగ తులు నిర్వహిస్తున్న పాఠశాలలపై తగిన చర్యలు తీసుకొని, ప్రభుత్వ నిబంధనలను ప్రైవేట్ పాఠశాలలు కచ్చితంగా పాటించేలా చూడాలి.

## ఎస్సై పైనే దౌర్జన్యమా?

### కాంగ్రెస్ కార్యకర్తలను అరెస్టు చేయాలి : ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి

**హుజురాబాద్, జూన్ 25(నినాదం న్యూస్):** జమ్మికుంట పట్టణాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు రౌడీ షీటర్ల మాదిరిగా వ్యవహరించి ఎస్ఐపైనే దాడికి ప్రయత్నించారని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్రంగా ఆరోపించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తనకు సవాల్ విసిరిన నేపథ్యంలో తాను చెల్పూర్ కు వెళ్లేందుకు సిద్ధమయ్యానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు పోలీసులను మోహరించారని, బీ ఆర్ ఎస్ నేతలపై దాడికి ముందస్తు వ్యూహం చేసుకున్నారని అయినప్పటికీ తాము ఎంతో ఓపికగా ఉన్నామని తెలిపారు. పోలీసుల విజ్ఞప్తిని తాను గౌరవించి ఇంటి వద్ద ప్రమాణం చేశానని వివరించారు. జమ్మికుంటలో కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు ఎస్సై రాజకుమార్ పై దాడికి ప్రయత్నం చేశారని ఇందుకు సంబంధించిన వీడియోలు కూడా ఉన్నాయని వెంటనే కాంగ్రెస్ కార్యకర్తలపై కేసులు నమోదు చేసి వారిని రిమాండ్కు పంపించాలని కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ నేతల నైజం బయటపడిందని ఆయన అన్నారు. తాను ఒక్కడినే చెల్పూర్ కు రావడానికి సిద్ధమయ్యానని, ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ చేతిలో ఉందని అయినప్పటికీ తనను ఎందుకు అనుమతించలేదని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ కార్యకర్తలు రౌడీ షీటర్ల మాదిరిగా వ్యవహరిస్తున్నారని కౌశిక్ మండిపడ్డారు.

## స్థాయిని మరిచి మాట్లాడితే ఖబర్దార్

- కనీస పరిజ్ఞానం లేని బిజెపి నాయకుల మాటలు ఖండిస్తున్నాం
- కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ఊసకోయిల ప్రకాష్



**భీమదేవరపల్లి జూన్ 25 (నినాదం న్యూస్) :** మంత్రి పొన్నం ప్రభాకర్ పై బిజెపి మండల అధ్యక్షుడు పృథ్వీరాజ్ చేసిన అనుచిత వాక్యాలను మాజీ మండల అధ్యక్షుడు ఉస కోయిల ప్రకాష్ ఖండించారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... స్థాయిని మరిచి మాట్లాడొద్దని కొత్తకొండ దేవాలయ హుండీ డబ్బులు దేవదాయ శాఖకు వెళ్తాయని కనీస పరిజ్ఞానం లేకుండా మంత్రిపై అబండాలు మోపడం తగదు అని నీ స్థాయికి తగ్గ మాటలు మాట్లాడాలని ఆయన హెచ్చరించారు. గతంలో ఆలయ భూములు అన్య కాంతమైనప్పుడు ఏం చేశారని ఆయన ప్రశ్నించారు. కరీంనగర్ పార్లమెంట్ లో ఉన్న కొత్తకొండ ఆలయానికి బండి సంజయ్ ఎన్ని నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేశారో చూపెట్టాలని ఆయన సవాల్ విసిరారు. సోషల్ మీడియాలో మంత్రిపై అబాండాలు ఆరోపణలు చేస్తే ఖబర్దార్ తగిన బుద్ధి చెప్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పొన్నాల మురళి, చిట్కూరి రామచంద్రం, పూర్ణచందర్, బొల్లంపల్లి షడ్రక్, అంబాల రాజ్ కుమార్, దేవరాజ్ శంకర్, నలివేల దిలీప్, హరికృష్ణ యాదవ్, అమర్, రేణ రాజేందర్, మహేష్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

## సంపాదకీయం

# దేశం ముందు ఎమర్జెన్సీని మించిన సవాళ్లు !

కొత్తగా మూడోసారి ప్రధానిగా అవకాశం దక్కించుకున్న నరేంద్ర దామోదర దాస్ మోడీ..మాట తీరులో మార్పు కనిపించడం లేదు. పనితీరులోనూ మార్పు వస్తుందని అనుకోవడం కూడా భ్రమే అవుతుంది. ఇంకా పాత విషయాలను పట్టుకుని వేలాడుతూ..కాంగ్రెస్ లక్ష్యంగా విమర్శలతో ముందకు సాగాలని అనుకుంటు న్నట్లు తొలిరోజు పార్లమెంట్ సమావేశాల సందర్భంగా ఎమర్జెన్సీపై చేసిన వ్యాఖ్యలతో స్పష్టం అవుతోంది. ఆయన చేపట్టిన కాంగ్రెస్ ముక్త భారత్ నినాదం ఇప్పటికే బెడిసి కొట్టింది. తన పదేళ్ల కాలంలో దెబ్బతిన్న రంగాలను, ప్రజల గురించి ఆలోచించి, వాటిని సరిదిద్దుతానని చెప్పడం లేదు. ప్రధానంగా దేశం ఆర్థికంగా కుదేలయ్యింది. డాలర్ మారకం రేటు పెరుగుతోంది. నిరుద్యోగం పెరుగుతోంది. అగ్నిపథ్ పథకం పై దేశవ్యాప్తంగా అసంతృప్తి ఉంది. జిఎస్టీ భారాలు తట్టుకోలేక పోతున్నారు. వ్యవసాయానికి చేయూత కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. నిత్యావసర ధరలు అమాంతంగా పెరిగాయి. పదేళ్లయినా మోడీ ఇలాంటి సమస్యలపై మాట్లాడడం లేదు. అధికార, విపక్షాలు తమ రాజకీయాల కోసం ప్రజలు బలిపశువులుగా చేసి ఆడుకుంటున్నారు. ఇందిరా గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం దేశంలో ఎమర్జెన్సీని విధించి మంగళవారం తో 50 ఏళ్లు పూర్తవుతుంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎమర్జెన్సీ ఓ మచ్చ అని ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్యలు ఇంకా అవసరమా అన్నది ప్రజలు చర్చించాలి. పదేళ్లుగా మోడీ ఏటా ఇది వల్లె వేస్తూనే ఉన్నారు. ప్రజలు తమ విధానాలను విశ్వసించారని మోడీ చెప్పుకోవడం ఇంకా సిగ్గుచేటు. ఫలితాలను విశ్లేషిస్తే మోడీ పాలనా తీరుపై ప్రజలు అంకుశం దింపారు. ఇది గుర్తెరిగి దేశానికి మూడోసారి సేవ చేసే అదృష్టాన్ని కల్పించారని ఆనందపడాలి. అందుకు ప్రజలకు ధన్యవాదాలు తెలపడం కాదు..ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తానని చెప్పాలి. ఇంకా ఎమర్జెన్సీ, కాంగ్రెస్ పాలన అంటూ సాగితే ప్రజలు క్షమించరని గుర్తించాలి. గత పదేళ్ల పాపాలను కడుక్కుని ప్రజలకు మెరుగైన పాలన అందించాలి. ఇప్పుడు ఉన్నది బిజెపి పాలన కాదని, ఎన్‌డిఎ పాలన అని మోడీ గుర్తిస్తే మరీ మంచిది. సరికొత్త విశ్వాసంతో తాజాగా సమావేశాలను ప్రారంభిస్తున్నామని, ఈ ఐదేళ్లపాటు రాజ్యాంగాన్ని గౌరవిస్తూ నిర్ణయాలు తీసుకుంటామని మోడీ స్పష్టం చేశారు కనుక అందుకు అనుగుణంగగా ముందుకు సాగాలి. స్వాతంత్య్రానంతరం వరుసగా మూడోసారి ప్రజలకు సేవ చేసే అవకాశం దక్కడం గొప్ప విషయంగా భావించాలి. ప్రజలు బాధ్యతాయుతమైన ప్రతిపక్షాన్ని కోరుకుంటున్నారని అంటున్న మోడీ అందుకు తగ్గట్లుగా విపక్షాలను కూడా గౌరవించాలి. వారు ప్రజల పక్షాన పోరాటం చేసినప్పుడు సమస్యలను గుర్తించాలి. గతంలో ప్రతిపక్షాలను బుల్ డోజ్ చేశారు. ఇప్పుడా పరిస్థితి ఉండకపోవచ్చు. ప్రజాస్వామ్య మర్యాదను కాపాడేలా, సామాన్య పౌరుల ఆకాంక్షలకు అనుగుణంగా విపక్షాలు నడుచుకోవాలని అంటున్న మోడీ..తనకూ అదే సూత్రం వర్తిస్తుందని గుర్తించాలి. ప్రధాని మోదీ 50 ఏళ్ల కిందటి ఎమర్జెన్సీ గురించి ఇప్పుడు మాట్లాడు తున్నారని, కానీ, గత పదేళ్లలో అప్రకటిత ఎమర్జెన్సీ గురించి ఆయన మర్చిపోయారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే చేసిన వ్యాఖ్యలు గమనార్హం. నీట్ ఆందోళనలు, పశ్చిమ బెంగాల్లో రైలు ప్రమాదం, మణిపూర్‌లో కొనసాగుతున్న అశాంతిపై ఆయన మాట్లాడాలని దేశం కోరుకుంటోందని వ్యాఖ్యానించారు. మోదీకి వ్యతిరేకంగా ప్రజలు తీర్పు ఇచ్చారని అన్నారు. పార్లమెంటు లోపల, బయట ప్రజల గళాన్ని వినిపిస్తూనే ఉంటామన్నారు. ఇకపోతే పార్లమెంట్ కొత్త భవనంలో 18వ లోక్‌సభ కొలువుదీరింది. ఈ భవనంలో లోక్‌సభ సభ్యుల ప్రమాణ స్వీకారం జరగడం ఇదే తొలిసారి. విపక్ష కూటమి 'ఇండియా' నేతలు తొలిరోజే తమ ఐకమత్యాన్ని చాటుకునే ప్రయత్నం చేశారు. లోక్‌సభలో తమకు కేటాయించిన చోట ముందు వరసలోనూ కూటమి పార్టీల నేతలు కూర్చున్నారు. తొలుత వారంతా పార్లమెంట్ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్దకు చేరుకున్నారు. రాజ్యాంగ ప్రతులను చేతబట్టుకుని, లోక్‌సభకు కలిసి వెళ్లారు. ప్రధాని మోదీ ప్రమాణ స్వీకారం సమయంలో రాహుల్‌గాంధీ సహా.. ఇండియా కూటమి నేతలు రాజ్యాంగ ప్రతులను గాల్లోకి ఊపారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రమాణ స్వీకార సమయంలో.. 'నీట్.. నెట్'.. 'నీట్ షేమ్' అంటూ నినాదాలు చేశారు.నీట్ అక్రమాలపై చర్చించాలని ప్రతిపక్ష సభ్యులు పట్టుపట్టారు. మరోవైపు.. ప్రొటెం స్పీకర్‌గా పార్లమెంట్‌కు ఎక్కువ సార్లు ఎన్నికైన వారికి అవకాశమివ్వాలి. అయితే.. సీనియర్ ఎంపీలున్నా.. బీజేపీ ఉద్దేశపూర్వకంగా భర్తృహరి మెహతాబ్‌ను నియమించడంపై ముందు నుంచి ఇండియా కూటమి అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ఈ క్రమంలో.. ప్రొటెం స్పీకర్ ప్యానెల్ లో నియమితులైన కాంగ్రెస్ సభ్యుడు కొడికున్నిల్ సురేశ్, డీఎంకే సభ్యుడు టీఆర్ బాలు, తృణమూల్ ఎంపీ సుదీప్ బందోపాధ్యాయ్.. భర్తృహరి నియామకాన్ని నిరసిస్తూ వాకౌట్ చేశారు. ఇండియా కూటమి నేతలు ప్రొటెం స్పీకర్ నియామక తీరు రాజ్యాంగ ఉల్లంఘనేనంటూ నిరసన తెలిపారు. భర్తృహరి కంటే.. కాంగ్రెస్ ఎంపీ కె.సురేశ్ సీనియర్ అని వివరించారు. దళితుడైనందువల్లే సురేశ్‌కు అవకాశమివ్వలేదని ఆరోపించారు. ఇలాంటి చిన్న విషయాల్లో కూడా ఉదారంగా ఉండడం అవసరం. ఒకవేళ సురేశ్ సీనియర్ అయివుంటే గౌరవించి ఉండాల్సింది. ఇకపోతే ఇప్పటికే మంత్రివర్గంలో మెజార్టీ పోర్టుఫోలియోలన్నీ బిజెపి నేతలే చేపట్టారు. ఈ క్రమంలో స్పీకర్ విషయంలోనూ మోడీ నిరంకుశం బయటపడిరది. మరోమారు ఓం బిర్లానే ఆయన ఎంపిక చేసుకున్నారు. లోక్‌సభలో బిజెపి బలం తక్కువగా ఉన్నందు వల్ల మోడీ ముందుచూపుతో ఓంబిర్లాకు అవకాశం ఇచ్చివుంటారు. ఎన్‌డిఎ పక్షాలు పట్టుబట్టివుంటే ఇలా జరిగేది కాదు. అలాగే అనేక సమస్యల విషయంలో ఎన్‌డిఎ పక్షాలు కప్పదాటు వైఖరిని వదిలి గట్టిగా నిలబడాలి. దేశం కోసం తమ గొంతు ఎత్తాలి. అప్పుడే మెరుగైన పాలనను చూస్తాం. మోడీ నిరంకుశాన్ని తగ్గించగలుగుతాం. ఇది గుర్తించి విపక్షాలుకూడా ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరించి, ప్రజల సమస్యలపై పోరాడితే మంచిది.

# హామీల అమలులో బిజెపి వెనకడుగు

### ప్రజల దరికి చేరని పలు పథకాలు
### వైఫల్యాలను సమీక్షించుకుంటేనే మేలు

న్యూఢిల్లీ:
ప్రజలు సంపూర్ణ సాధికరాత సాధించేలా దేశంలో పథకాలు అమలు కావడం లేదు. నిరుద్యోగ సమస్య రోజురోజుకు పెరుగుతోంది. ఆరోగ్యం అందని ద్రాక్షగా మారింది. విద్య విలాస వస్తువుగా మారింది. ఇలాంటి అసమనాతలను రూపుమాపేందుకు పాలకులు చిత్తశుద్ధితో కృషి చేయాలి. ఆనాటి పాలకుల దూరదృష్టి లోపం కారణంగా మనకు వారసత్వంగా వచ్చిన సకల అవలక్షణాలు ప్రజలను ఇంకా దరిద్రంలోనే ముంచెత్తుతున్న వేళ పాలకులు గతాన్ని నెమరేసుకుని ముందుకు సాగాల్సిన వేళ ఇది. దేశంలో ఇప్పటికీ సరైన ప్రజారోగ్య వ్యవస్థ లేదు. వ్యవసాయరంగం కుంగి కృషించిపోతోంది. రైతులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఆహార ధాన్యాలకు మద్దతు ధరలు అందడం లేదు. విద్య మిధ్యగా మారింది. ఉద్యోగాల కల్పన అంతంత మాత్రంగానే ఉంది. ఈ అసమానతల తొలగింపునకు రాజకీయ సంకల్పం బలంగా ఉండాలి. ధనరాజకీయాలను మార్చాల్సిన అవసరం ఉంది. రాజకీయాల్లో నిజాయితీపరులు రావాలి. దేశమంటే అంకితభావం ఉన్న వారి చేతుల్లో పాలన ఉండాలి. అప్పుడే మనం మారుతాం. డబ్బుతో ఓట్లు కొనుగోలు చేసే సంస్కృతికి చరమగీతం పాడకపోతే పెనుముప్పు రాగలదని ప్రజలు కూడా గుర్తించాలి. అప్పటి వరకు గణతంత్రాలు ఎన్నయినా మార్పు రాదు. మోడీ అధికారంలోకి వచ్చిన తరవాత ఈ పదేదేళ్లలో ఇచ్చిన హామీలను అమలు చేసే సంకల్పం లోపించింది. ప్రధానంగా ధరల పెరగుదల విషయంలో పట్టింపు లేకుండా పోయాయి. ఆహారధాన్యాలు ఉత్పత్తి అవుతున్నా వాటికి ధరలు దక్కడం లేదు. గోదాముల్లో ధాన్యం మగ్గుతున్నా బయటకు రావడం లేదు. అలాగే దిగుమతులు కూడా తగ్గడం లేదు. కాంగ్రెస్ తరహా రాజకీయాలు చేస్తున్నారే తప్ప ఆదర్శ రాజకీయాలకు పెట్టింది పేరయిన బిజెపి ఇప్పుడా ముసుగు నుంచి బయటపడిరది. ఇటీవలి పరిణామాలు కుటిల రాజకీయాలకు పరాకాష్టగా చెప్పుకోవాలి. బిజెపి లాంటి పార్టీ ఇలాంటి రాజకీయాలు చేయడం వల్ల సహజంగానే దానికున్న ఇమేజ్ కాస్తా కరిగిపోయేలా చేసింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రతిష్ఠ మసకబారినా, ప్రధానంగా బిజెపికి రాజకీయాలకు చెరగని మచ్చని తెచ్చిపెట్టాయి. అవినీతి రహితంగా సాగుతుందన్న ప్రచారం ఊదరగొడుతున్నారు. మూడోసారి పగ్గాలు చేపట్టిన మోడీ క్షేత్రస్థాయిలో ప్రజల ఇక్కట్లను గుర్తించి పాలన సాగించాల్సి ఉంది. అవినీతి లేకున్నా అక్రమ రాజకీయాలు సాగుతూనే ఉన్నాయి. అయితే కాంగ్రెస్ తరహా రాజకీయాలకు పెద్ద ఎత్తున తెరతీసారు. తన వ్యక్తిగత ప్రతిష్టను పెంచుకునేలా చేసుకుంటున్నారు. పాలనలో మాత్రం అంతగా దూసుకుని పోవడం లేదు. జిఎస్టీ భారాలతో ప్రజలకున్న ఆశలు అడియాశలయ్యాయి. అమిత్‌షా, మోడీ ద్వయం తమ కనుసన్నల్లో పార్టీ వ్యవహారాలను నడుపుతున్నారు. కాంగ్రెస్ విముక్త భారత్ లక్ష్యంగా చేస్తున్న రాజకీయాలు ఒక్కోసారి వెగటుగా ఉంటాయనడానికి ఇటీవలి పరిణామాలు,ఫలితాలు ఉదాహరణగా చెప్పుకోవాలి. కాంగ్రెస్ పార్టీని దెబ్బతీసే క్రమంలో చేస్తున్న పనులన్నీ దేశహితం కోసమేనని సరిపెట్టుకోలేం. గవర్నర్ వ్యవస్థ అభాసుపాలవుతోంది. మిగతా నాయకులకు, మిగతా పార్టీలకు, భారతీయ జనతా పార్టీకి చెందిన మోడీ,షాలకు కూడా తేడా లేదని ప్రజలు గుర్తించారు. ఈ క్రమంలోనే తప్పటడుగులు వేస్తున్నారని గుర్తించి ప్రజలు ఒకింత హెచ్చరిక చేశారు. దేశమంతటా అన్ని రాష్ట్రాలలో భారతీయ జనతా పార్టీ పతాకం రెపరెపలాడాలన్నది ఈ ఇరువురి నాయకుల కోరిక! కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు నీతి వాక్యాలు వల్లె వేస్తోంది గానీ దేశ రాజకీయాలు ఇవ్వాళ ఇంతలా భ్రష్టు పట్టిపోవడానికి ఆ పార్టీనే ప్రధాన కారణం. గతంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం కూడా అనేక అడ్డదారులు తొక్కింది. రాష్ట్రాలలో అధికారం నిలబెట్టుకోవడం కోసం లేదా అధికారంలో ఉన్న ఇతర పార్టీల ప్రభుత్వాలను కూల్చడం కోసం కాంగ్రెస్ పార్టీ చేయని అరాచకం లేదు. ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ ఆ తరహా రాజకీయాలనే నడుపుతున్నారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడంలో గానీ, ప్రభుత్వ ఏజెన్సీలను దుర్వినియోగం చేయడంలో గానీ కాంగ్రెస్ ఎప్పుడూ ముందుండేది. ఇప్పుడు అదే పంథాను బిజెపి అనుసరిస్తోంది. మొత్తంగా బిజెపి కాంగ్రెస్‌కన్నా భిన్నం కాదని తేలిపోయింది. ఈ క్రమంలో మోడీ తన పాలనా విధానాలను మార్చుకుని ముందుకు సాగాల్సి ఉంది.



# ఆందోళన కలిగిస్తోన్న అమెరికాలో ఉద్యోగాల కోత

### నెరవేరని మేకిన్ ఇండియా సంకల్పం
### దేశీయ ఉత్పత్తులకు దక్కని ప్రోత్సాహం
### చిన్నతరహా పరిశ్రమలను ఆదుకుంటేనే మేలు




న్యూఢిల్లీ:
అమెరికాలో ఉద్యోగాల కోత ఆందోళన కలిగిస్తున్న వేళ ..నిరుద్యోగులకు భరోసా కల్పించేలా భారత ప్రభుత్వం పథకాలు అమలుచేయాలి. పట్టాలు చేతబట్టుకుని వెళ్లిన వారు మళ్లీ బ్యాగు సర్దుకుని వచ్చే దుస్థితి వచ్చింది. చెప్పాపెట్టకుండా అనేక కంపెనీల్లో ఉద్యోగులను తొలగించేస్తున్నారు. దీంతో ఆశతో అమెరికా లాంటి దేశాకు వెళ్లిన వారు బిక్కమొహం వేసుకుని తిరిగి రావాల్సి వస్తోంది. అలాంటి వారు స్వదేశానికి వస్తే వారికి అండగా నిర్ణయాలు తీసుకోవాలి. ఉక్రెయిన్ యుద్ధం కారణంగా వెనక్కి వచ్చిన వైద్య విద్యార్థులవిషయంలో అన్యాయం జరిగింది. ఇప్పుడు వీరికీ అలాంటి అన్యాయం జరగరాదు. దేశం అండగా నిలిచిందన్న సంకేతాలు ఇవ్వాలి. ఉద్యోగాల కల్పనకు ఎంతయినా వెచ్చించాలి. కొత్తగా పని దొరికే రంగాలను ప్రోత్సహించాలి. వారి కష్టాలను మననం చేసుకుని స్వయం ఉపాధి పెంచగలిగితే అంతకు మించిన ఆనందం ఉండదు. యువతకు ఉపాధి కల్పించే రాంగాలకు ఇతోధికంగా అంటే..వడ్డీ రహిత రుణాలు ఇవ్వగలగాలి. ప్రజల కోసం పరితపించేలా పాలన సాగిస్తామని ప్రతిన చేయాల్సిన సమయ మిది. దేశీయంగా ఉత్పత్తులపై దృష్టి పెట్టి స్వయం సమృద్ధి సాధించకుండా విదేశీ పెట్టుబడులకు వెంపర్లాడుతున్న విధానం పోవాలి. దేశీయంగా ఉన్న సాంకేతికతను ఉపయోగించుకుని యువతను స్వయం ఉపాధి వైపు మళ్లేలా సన్నద్ధం చేయాలి. వ్యవసాయం, అనుబంధ రంగాలను అభివృద్ధి చేస్తే ఈ దేశం ఇతర దేశాలకు ఆహారధాన్యాలను ఎగుమతి చేయగలదు. సింగపూర్, మలేషియా తదితర చిన్నదేశాలను ఆదర్శగా తీసుకుని ఆయా రాష్ట్రాలు స్వయం సమృద్ధి సాధించే ప్రణాళికలతో సాగాల్సిన అవసరాన్ని ఈ గణతంత్రం రోజు ప్రతిన తీసుకోవాలి. మేకిన్ ఇండియాను బలంగా ప్రజల్లోకి తీసుకుని వెళ్లి అందుకు అనుగుణంగా కార్యాచరణ చేయాలి. ఇంతకాలం ఎక్కడ లోపం ఉందో గుర్తించి అవలోకనం చేసుకోవాలి. ఆత్మపరిశీలన చేసుకోవాలి. విద్యావైద్య రంగం ఎందుకు వెనకబడి ఉందో తెలుసుకోవాలి. ఆహారధన్యాలను ఇంకా ఎందుకు దిగుమతి చేసుకుంటున్నామో ఆలోచన చేయాలి. అన్నిరంగాల్లో మనం ముందంజ వేయాల్సిన దశలో ఇంకా దిగుబడులపై ఆధారపడుతూ ఎగుమతుల విషయంలో లక్ష్యం లేకుండా సాగుతున్నాం. మనం చేపట్టిన సంస్కరణలు ఫలితాలు ఇవ్వడం లేదన్న విషయాన్ని గుర్తించడం లేదు. జిఎస్టీని సమర్థించిన ఆయా రాష్ట్రాల సిఎంలే ఇప్పుడు దాని బారినుంచి రక్షించాలని కోరుకుంటున్నారు. వివిధ రంగాలపై అదిచూపిస్తున్న చెడు ప్రభావాన్ని విశ్లేషించుకోవాల్సిన కేంద్రం ప్రభుత్వం మొడిగా వ్యవహరిస్తోందే తప్ప ప్రజల కోణంలో ఆలోచించడం లేదు. బ్యాంకుల్లో దాచుకున్న డబ్బును సొంత అవసరాలకు తీసుకోవడానికి కూడా ఇబ్బంది పడటాన్ని గ్రామాల్లో ఇప్పటికీ చూస్తున్నాం. ఆహారధాన్యాల ధరలు పెరుగుతూనే ఉన్నాయి. ముక్కుపిండి వసూలు చేస్తున్న పన్నులను పాలకుల విలాసాలకు ఖర్చు చేసుకుంటున్నారు. ఎన్నికలలో డబ్బు అవసరం లేకుండా సంస్కరణలు తీసుకురాకుండా ఎన్ని చర్యలు తీసుకున్నా లాభం లేదు. రాజకీయ పార్టీల ప్రధాన లక్ష్యం అధికారమే కనుక, ఆ అధికారం కోసం ఎంతకైనా తెగబడతాయని ఈ 75 ఏళ్లలో నిరూపితం అయ్యింది.

# కృష్ణగిరి ఎంపి గోపీనాథ్ ప్రత్యేకం


### తెలుగులో ప్రమాణం చేసిన తమిళ ఎంపి

న్యూఢిల్లీ:
తమిళనాడులోని కృష్ణగిరికి చెందిన లోక్ సభ ఎంపీ గోపినాథ్ పార్లమెంటులో తెలుగులో ప్రమాణస్వీకారం చేశారు. లోక్ సభలో ఎంపీల ప్రమాణ స్వీకారం రెండో రోజూ కొనసాగుతోంది. ప్రొటెం స్పీకర్ భర్తృహరి మహతాబ్ ఎంపీలతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్నారు. అనేక మంది ఎంపీలు తమ మాతృ భాషలో ప్రమాణం చేశారు. తమిళనాడు, పుదుచ్చేరి కి చెందిన 40 మంది ఎంపీలు లోక్ సభ రెండో మధ్యాహ్నం 2.15 గంటలకు ఒక్కొక్కరుగా ప్రమాణస్వీకారం చేశారు. కాగా కృష్ణగిరి ఎంపీ తెలుగులో ప్రమాణస్వీకారం చేశారు. తమిళనాడులోని కృష్ణగిరి ఆంధ్రప్రదేశ్ ను ఆనుకుని ఉంటుంది. ఇక్కడ తమిళులు ఎక్కువే అయినప్పటికీ, తర్వాతి స్థానాలలో తెలుగు, కన్నడ వారు అధికంగా నివసిస్తుంటారు. తమిళనాడు నుంచి బెంగళూరుకు వెళ్లే దారి మధ్యలో ఉంటుంది ఈ కృష్ణగిరి. ఈ సందర్భంగా పలు ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకున్నాయి. తమిళనాడు నుంచి ఎంపీగా గెలుపొందిన కె.గోపీనాథ్ తెలుగులో ప్రమాణస్వీకారం చేసి అందరి దృష్టిని ఆకర్షించారు. కృష్ణగిరి లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ఎంపీగా విజయం సాధించిన ఆయన.. రాజ్యాంగ ప్రతిని చేతిలో పట్టుకొని తెలుగులో ప్రమాణస్వీకారం చేశారు. చివరలో జై తమిళ నాడు అని నినాదం చేశారు. గతంలో తమిళ నాడు అసెంబ్లీకి ఎన్నికైన సమయంలోనూ ఆయన తెలుగులోనే ప్రమాణస్వీకారం చేశారు. అంతేకాకుండా పలు అంశాలపై తెలుగులోనే అడగ్గా.. అప్పటి ముఖ్యమంత్రి జయలలిత తెలుగులోనే సమాధానాలు ఇచ్చేవారు. మహారాష్ట్రకు చెందిన పలువురు సభ్యులు మంగళవారం ఎంపీలుగా ప్రమాణస్వీకారం చేశారు. ఎన్సీపీ (ఎస్‌పీ) ఎంపీ సుప్రియా సూలే ప్రమాణస్వీకారం అనంతరం ప్రొటెం స్పీకర్ భర్తృహరి

(ఆధ్యాత్మిక చింతన )

# ధ్యానంతో నిత్యనూతనత్వం

మన శరీరంలోకి అధిక మొత్తంలో ప్రాణ శక్తిని చేర్చే ఏకైక మార్గం ధ్యానం, యోగాయే... అందుకే భారతీయ ఋషులు ధ్యానం, యోగ మార్గాన్నే అనుసరించారు.రోజూ కనీసం అర గంట... ధ్యానం, యోగ చెయ్యండి... ఆరోగ్యంగా జీవించండని తెలిపారు. అలాగే నెగెటివ్ థాట్స్‌కు దూరంగా ఉండాలి. అలా ఉంటేనే మన అవయవాలు సరిగా పనిచేస్తాయి. లేకుంటా వాటిపై ప్రభావం పడి అవి పనిచేయకుండా చచ్చుపడతాయి. మన శరీరం లోకి వెళ్లిన ఆహారం 24 గంటల్లో... మలినంగా బయటికి వెళ్లిపోవాలి. లేకపోతే ఆ మలినాలు జబ్బులకు కారణం అవుతాయి. .మన శరీరం లోకి వెళ్లిన నీరు 4 గంటల్లో బయటికి వెళ్లిపోవాలి, లేకపోతే జబ్బులు తప్పవు. మన శరీరంలోకి వెళ్లిన గాలి ఒక నిముషంలోగా బయటికి వెళ్లిపోవాలి లేకపోతే మనం రోగ గ్రస్థులం అవుతాం. మరి మనలోకి చేరిన కోపం, అసూయ, ద్వేషం, మోసం... ఇలాంటివన్నీ సంవత్సరాలుగా మనలోనే ఉంటే... ఏమౌతుందో తెలుసా... మనం నిత్య రోగగ్రస్తులుగా అవుతాం.అందుకే ఋషులు అంటారు... 'మనం రోజూ జీవిస్తున్నాం అని అనుకుంటున్న మూర్ఖులం... నిజానికి మనం రోజూ కొద్దీ కొద్దీగా మరణిస్తున్నాం. మనకు వయసు పెరిగితే... ఆయుష్షు తగ్గినట్టా? పెరిగినట్టా?... మనం ప్రతి రోజూ... నెగెటివ్ ఎనర్జీ లతో కొద్ది కొద్దిగా మరణిస్తున్నామన్న చేదు నిజాన్ని త్వరగా గ్రహించాలి. మనలో చేరి బయటికి వెళ్లిపోకుండా తిష్ట వేసుకొని... మన జీవితాల్ని మృతప్రాయం చేస్తున్న కోపాన్ని, ఒత్తిడిని, ద్వేషాన్ని, బద్ధకాన్ని, అనారోగ్యాన్ని ప్రతి రోజూ ధ్యానం, యోగ చెయ్యడం ద్వారా ప్రాణశక్తిని ఎక్కువగా పొంది నెగెటివ్ ఎనర్జీ



# లోక్‌సభలో తెలుగు ఎంపిల ప్రమాణం

### అసదుద్దీన్ పాలస్తీనా నినాదాలు
### మండిపడ్డ లోక్‌సభ ఎంపిలు
### రికార్డుల్లో తొలగిస్తామన్న ప్యానల్ స్పీకర్

న్యూఢిల్లీ:
పార్లమెంట్‌లో మంగళవారం ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. సోమవారం నాడు కొందరు ఎంపీలు లోక్‌సభలో ప్రమాణం చేశారు. మంగళవారం సైతం ఎంపీల ప్రమాణ స్వీకార కార్యక్రమం కొనసాగించారు. ఈ క్రమంలో ఏఐఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ప్రమాణ స్వీకారం దుమారం రేపింది. అసదుద్దీన్ ఒవైసీ హైదరాబాద్ ఎంపీగా ప్రమాణ స్వీకారం చేశారు. అయితే ప్రమాణ స్వీకారం ముగిసిన వెంటనే అసదుద్దీన్ ఒవైసీ వివాదాస్పద నినాదాలు చేశారు. ప్రమాణం పూర్తి చేస్తూ చివర్లో జై భీమ్, జై మీమ్, జై తెలంగాణ, జై పాలస్తీనా అని అసదుద్దీన్ నినాదాలు చేశారు. అసదుద్దీన్ జై పాలస్తీనా అనడంపై అధికార పక్ష నేతలు సైతం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇజ్రాయెల్ పై యుద్ధంలో హమాస్ తో ఆశ్రయం ఇచ్చిన పాలస్తీనాకు భారత ఎంపీ ఎలా మద్దతు ఇస్తారని బీజేపీ ఎంపీలు తీవ్ర అభ్యంతరం తెలిపారు. దీనిపై స్పందించిన స్పీకర్ ఆ పదాలను రికార్డ్స్ నుంచి తొలగిస్తామని చెప్పారు. ఎవరైనా వివాదాస్పద నినాదాలు చేస్తే వాటిని రికార్డ్స్ నుంచి తొలగిస్తారు. అసదుద్దీన్ వాడిన వివాదాస్పద పదాల్ని లోక్ సభ రికార్డ్స్ లో నుంచి తొలగించే అవకాశం ఉంది. ఆదిలాబాద్ ఎంపీ గోడెం నగేష్ హిందీలో ప్రమాణ స్వీకారం చేశారు. ఎంపీలు గడ్డం వంశీ కృష్ణ, ధర్మపురి అరవింద్, రఘునందనరావు, కొండా విశ్వేశ్వరరెడ్డి, రామసాయం రఘురాం రెడ్డి ఇంగ్లీష్‌లో ప్రమాణం చేశారు. ఇక సురేశ్ షెట్కర్, ఈటల రాజేందర్, డీకే అరుణ, మల్లు రవి, కుందూరు రఘువీర్, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, కడియం కావ్య, బలరాం నాయక్ తెలుగులో ప్రమాణస్వీకారం చేశారు. ఇక హైదరాబాద్ ఎంపీ, ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ ఉర్దూలో ప్రమాణం చేశారు. జై సమ్మక్క సారలమ్మ అని ఈటల రాజేందర్ నినాదం చేసారు. . జై లక్ష్మీ నర్సింహ స్వామి అని నినదించిన కిరణ్‌కుమార్ రెడ్డి. జై భద్రకాళి అని నినాదం చేసిన కడియం కావ్య. . జై తుల్జా భవాని అన్న బలరాం నాయక్,. జై భీం అని నినదించిన ఎంపీలు మల్లురవి, కావ్య, రఘురాంరెడ్డి. కాగా నిబంధనలు పరిశీలించి... రికార్డుల నుంచి తొలగించే విషయాన్ని పరిశీలిస్తానని సభాపతి స్థానంలో రాధామోహన్ సింగ్ సభ్యులకు సర్దిచెప్పారు. నిబంధనల ప్రకారం వ్యవహరిస్తానని ఆయన తెలిపారు.

## స్టడీ మెటీరియల్ పంపిణీ చేసిన ఎమ్మెల్యే బండారి

**కాప్రా, జూన్ 25, (నినాదం న్యూస్) :** హబ్సిగుడా డివిజన్‌లోని జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలలో కాలేరు యమునాబాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో అయన కుమారుడు కాలేరు నవీన్ ఏర్పాటు చేసిన ప్రభుత్వ పాఠశాలలో స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొని 6వ తరవగతి నుండి 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మేటీరియల్‌ను వారి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యమున భాయ్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని అన్నారు. అలాగే పాఠశాలకు సంబంధించిన సమస్యలను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా సమస్యపై సానుకూలంగా స్పందించి ఏటువంటి సమస్యనైనా తప్పకుండ నెరవేరుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పుష్ప ఉపాధ్యాయులు, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు పసుల ప్రభాకర్ రెడ్డి, గంధం నాగేశ్వరావు, కాలేరు సుధాకర్, అజిత్ రెడ్డి, సురం శంకర్, చాంద్ పాషా, బొసాని పవన్, అద్విత్, శ్యామ్, నాని, చందు, లక్ష్మణ్ రావు, మహిళ నాయకురాలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.




## ఫలించిన కార్పొరేటర్ శ్రవణ్ పోరాటం

**నాలా పూడిక తీత పనులను ప్రారంబించిన అధికారులు**

**మల్కాజిగిరి, జూన్ 25(నినాదం న్యూస్) :** మల్కాజిగిరి డివిజన్ లోని ప్రజా సమస్యలపై గత కొన్ని రోజులుగా కార్పొరేటర్ శ్రవణ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం డివిజన్ లోని కొన్ని ఏరియాలలో జిహెచ్ఎంసి అధికారులు పనులను మొదలుపెట్టడంతో తమ శ్రమ ఫలించిందని అన్నారు. మల్కాజిగిరి డివిజన్ బలరాం నగర్ లో దాదాపు 15 లక్షల రూపాయల వ్యయం తో సీసీ రోడ్డు పనులను, కృపా కాంప్లెక్స్ వద్ద నున్న మురుగు నీటి శుద్ధి కేంద్రం వద్ద జరుగుతున్న నాలా పూడిక తీత పనులను కార్పొరేటర్ శ్రవణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ త్వరిత గతిన పనులు పూర్తి చేయాలనీ అధికారులకు, గుత్తే దారునికి సూచించారు. ఈ కార్యక్రమం లో డి. ఈ మహేష్, ఏ. ఈ దీపక్, ప్రధాన కీటక పరిశోధకులు దుర్గ ప్రసాద్, ఏ.ఈ, వర్క్ ఇన్స్పెక్టర్ రమేష్, వనజ బీజేపీ సీనియర్ నాయకులు విజయ్ కుమార్, సూరజ్, అడ్వాయిట్, నాగరాజ్, ప్రశాంత్, గిరి, తదితరులు పాల్గొన్నారు.



## పార్క్ అభివృద్ధి మరచి ఆక్రమణకు ప్రయత్నిస్తే సహించేదిలేదు

**బిఆర్ఎస్ పార్టీ యువనాయకులు సుభాన్ రెడ్డి**

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 25 (నినాదం న్యూస్) :** వికారాబాద్ మున్సిపల్ పార్కు స్థలాన్ని కబ్జా చేస్తే ఊరుకునే ప్రసక్తి లేదని కాలనీ వాస్తవ్యులు సుభాన్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వికారాబాద్ పట్టణంలోని 33 వార్డు బిటిఎస్ కాలనీలో గల ఇంద్రారెడ్డి పార్కు అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉన్నా అభివృద్ధిని మరచి ఆక్రమణకు ప్రయత్నాలు చేస్తున్నారని, పార్కు దగ్గరికి వస్తే ఎంతటి వారినైనా సహించేది లేదని అన్నారు. కాలనీవాసులుకు పార్కు అభివృద్ధి చేసి ప్రజలకు మరింత సౌక్యవంతంగా చేయాలని విలువైన స్థలాన్ని ఆక్రమింస్తే కాలని వాసులు చూస్తూ ఉండరని హెచ్చరిస్తున్నారు. ఆ పార్కు కాలనీవాసుల పిల్లల ఆట స్థలం కోసం కేటాయించబడిందని, అలాంటి పార్కు స్థలం ను ఆక్రమించడానికి ప్రయత్నిస్తే చూస్తూ వార్డు ప్రజలు ఊరుకోరని ఇలాగే వికారాబాద్ మున్సిపాలిటీ లోని చాలా వార్డుల్లో పార్కులు ఆక్రమణలకు గురయ్యాయని కావున మున్సిపల్ అధికారులు వార్డు ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలని బిటిఎస్ కాలనీవాసులు మున్సిపల్ అధికారులకు విన్నవిస్తున్నారని పేర్కొన్నారు.



## అధైర్యపకండి అండగా ఉంటా

**కార్యకర్త కుటుంబానికి కోడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నంనరేందర్ రెడ్డి భరోసా**

**కోడంగల్, జూన్ 25, (నినాదం న్యూస్) :** కోడంగల్ నియోజకవర్గ పరిధిలోని బిఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్ నెహ్రూ నాయక్ భార్య సుమిత్ర ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన సందర్భంగా మంగళవారం కోడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి పరామర్శించారు. 50 వేల రూపాయల చెక్కును నెహ్రూకు అందించారు. అనంతరం దౌల్తాబాద్ మండలం లోని మాజీ జడ్పీటీసీ మోహన్ రెడ్డి ఇటీవల గుండెపోటు తో మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మరణించిన ఇరువురి చిత్రపటాలకు నివాళులర్పించారు. అధైర్యపడవద్దనీ ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని భరోసానిచ్చారు. ఈకార్యక్రమంలో బిఆర్ ఎస్ నాయకులు మధుయాదవ్, కోట్ల యాదగిరి, దేశ్యనాయక్, గూని మల్లేష్ గౌడ్,లక్ష్మణ్ నాయక్, సోమ్ నాథ్, దౌల్తాబాద్ జడ్పీటీసీ కోట్ల మైపాల్, ఎంపీటీసీ లు గుండుగారి తిరుపతయ్య, హీరు నాయక్ తదితరులు పాల్గొన్నారు.




## విద్యార్థులకు నోటు పుస్తకాల అందజేసిన కొలను హనుమంత రెడ్డి

**కుత్బుల్లాపూర్, జూన్ 25 (నినాదం న్యూస్)**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం 125 డివిజన్ గాజులరామారం ప్రభుత్వ పాఠశాలలో, మెట్కాన్ గూడెంకు చెందిన శ్రీశైలం యాదవ్ తమ్ముడు కిట్టు జ్ఞాపకార్థం నోట్ పుస్తకాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని స్కూల్ పిల్లలందరికి నోట్ బుక్స్ పంపిణీ చేశారు. అనంతమైన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు కావలసిన నోటు పుస్తకాలు బ్యాగులు షూ వంటి సామాగ్రిని ఉచితంగా అందచేయుటకు దాతలు ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎస్ సంజీవ్ రెడ్డి, సంతోష్ ముదిరాజ్, జగన్, అమీర్, సురేందర్ రెడ్డి, శ్రీశైలం యాదవ్ వారి కుటుంబ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## కూన శ్రీశైలం గౌడ్‌ను కలిసిన ఐఎన్‌టియుసి నూతన కమిటీ




**కుత్బుల్లాపూర్, జూన్ 25 (నినాదం న్యూస్)**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్, సారెగూడెం లోని ఆల్కాలిక్ మెటల్స్ కంపెనీ ఎంప్లాయిస్ యూనియన్ ఎన్నికల్లో అధ్యక్షులుగా ఘన విజయం సాధించిన ఎం.రాము గౌడ్, అతని ప్యానెల్ సభ్యులు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలం గౌడ్ ను తన నివాసం వద్ద మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కంపెనీ అడ్వైజర్లుగా ఎన్నికైన మాజీ ఎమ్మెల్యే శ్రీ కూన శ్రీశైలం గౌడ్ ను, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ బొంగునూరి ప్రభాకర్ రెడ్డిని కమిటీ సభ్యులు, ఉద్యోగులు ఎం.రాము గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం గౌడ్ శాలువాతో సత్కరించి, అభినందించారు. కంపెనీ అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతూ, ఉద్యోగుల సంక్షేమం కొరకు యూనియన్ పని చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ బొంగునూరి ప్రభాకర్ రెడ్డి యూనియన్ అధ్యక్షుడు, కౌన్సిలర్ ఎం.రాము గౌడ్, సీనియర్ నేతలు శ్రీనివాస్ రెడ్డి, సదానందం, యాదగిరి, ప్రధాన కార్యదర్శి కె.శంకర్, కమిటీ సభ్యులు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలతో అస్తవ్యస్తం

- మండలంలో ఎటు చూసినా ఇదే పరిస్థితి
- ఇంత జరిగినా నిద్రమత్తులో ప్రభుత్వాధికారులు






**కొల్చారం, జూన్ 25, (నినాదంన్యూస్) :** మెదక్ జిల్లా కొల్చారం మండలంలో ఎటు చూసినా అక్రమ నిర్మాణాల జోరు కొనసాగుతోంది. రోజు రోజుకు వ్యవసాయ అసైన్డ్ భూముల్లో అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల వెలుస్తున్నాయి. అన్ని అనుమతులు ఉన్న స్థలాలకే నాలా కన్వర్షన్ అంటూ ఇది అంటూ అదంటూ సవా లక్ష ఆంక్షలు విధించే ప్రభుత్వ అధికారులు అక్రమ నిర్మాణాల పట్ల నోరు మెదపడం లేదు ఎందుకో మరి?. తాజాగా కొల్చారం మండలం దుంపలకుంట చౌరస్తాలో జోగిపేట మెదక్ రహదారి పక్కన ప్రభుత్వ అసైన్డ్ వ్యవసాయ భూమిలో అక్రమ నిర్మాణాలు వెలిశాయి. ఆ భవనాలకు మురుగునీరు పోయే సదుపాయం లేకపోవడంతో వర్షపు నీరు మురుగు నీరు లంబడి కాలనీకి వెళ్లే రోడ్డుపైన మోకాలి వరకు, రావడంతో లంబాడి కాలనీ వాసులు ఈ అక్రమ నిర్మాణ వలన తాము ఇబ్బందులకు గురి అవుతున్నామని ప్రభుత్వ అధికారులు ఇకనైనా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు.

గతంలో వ్యవసాయ పొలం కావడంతో వర్షపు నీరు పల్లం వైపు సాఫీగా పారేది. ఈ భవన నిర్మాణం చేయ డం వలన , డ్రైనేజీ లేకపోవడం వలన, తాము ఎవరికి చెప్పుకోవాలో తెలియని అయోమయ స్థితిలో, ఉన్నామని, పలుమార్లు పంచాయతీ కార్యదర్శి కి తెలియజేసిన ఇలాంటి చర్య తీసుకోవడం లేదని అన్నారు.

**చెరువుకుంటలా రోడ్డు**



అయ్యా మాది దుంపలకుంట లోని లంబాడి కాలనీ మా కాలనీకి వెళ్లడానికి వేసిన రోడ్డు చెరువుకుంటలా మారింది. ప్రభుత్వ అధికారికి విన్నవించిన ఫలితం లేదు. ఇకనైనా దయ చూపాలి.

**- కాలనీవాసి సుభాష్**

## కల్వకుర్తిను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

**ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి**

**మహేశ్వరం, జూన్ 25 ( నినాదం న్యూస్)**

ప్రజల సమస్య పరిష్కారానికి అభివృద్ధి లక్ష్యంగా, సంక్షేమ ఫలాన్ని అందించి కల్వకుర్తి నియోజక వర్గాన్ని తెలంగాణ రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్ది ప్రపంచ దేశాలలో ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని అమ్మ, సోనియమ్మ తోనే సాధ్యమైందన్నారు. కల్వకుర్తి నియోజకవర్గం మాడుగుల్ మండలం కాంగ్రెస్ ఎస్టి సెల్ మండల అధ్యక్షులు నేనావత్ హరిలాల్ నాయక్, పార్టీ సీనియర్ నాయకులు నేనావత్ జగన్ నాయక్ స్థానిక నాయకులతో మర్యాదపూర్వకంగా కలిసి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలుపుతూ, పుష్పగుచ్చం అంద జేస్తూ, శాలువతో ఘనంగా సన్మానించారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు సభ్యులు పెద్దలు పరిసర ప్రాంతాల్లో పాదయాత్రలో భాగంగా ప్రజలందరికి గుర్తుచేస్తూ తెలంగాణ రాష్ట్రం, కల్వ కుర్తి నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చదిద్దడమే లక్ష్యంగా, పలు అభివృద్ధి ప్రతి ఒక్కరూ సహకారంతో తెలంగాణ రాష్ట్రాన్ని ఆదర్శంగా దిద్దడంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధినేత సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ఆదేశ మేరకు ప్రజలందరూ కి ఎమ్మెల్యే కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ప్రజలలో ఉండి ప్రజల సమస్య తలెత్తకుండా ఉండేందుకు ఉంటానని భరోసా కల్పించారు. స్థానిక సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకొస్తామని ఎమ్మెల్యేకు ప్రజలకు కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గం సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సభ్యులు, యువకులు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



## కోడంగల్ పిఎస్‌లో ఎస్పీ తనిఖీ




**కోడంగల్, జూన్ 25, (నినాదం న్యూస్) :** కోడంగల్ పట్టణం లోని పోలీసు స్టేషన్ ను జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా కోడంగల్ ఎస్సై భరత్ రెడ్డి, పోలీసు సిబ్బంది ఆయనకు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం ఎస్పీ నారాయణ రెడ్డి పోలీసు స్టేషన్ పరిసరాలను, రికార్డులను పరిశీలించారు. ఎలాంటి రాజకీయ వత్తిడికి తలొగ్గరాదనీ, శాంతి భద్రలకు భంగం కలిగించరాదనీ, సూచించారు. ప్రజలకు రక్షణ కల్పించడమే పోలీసుల ప్రధాన కర్తవ్యం అన్నారు. అనుక్షణం పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈకార్యక్రమంలో సర్కిల్ ఇనిస్పెక్టర్ శ్రీధర్ రెడ్డి, పరిగి డిఎస్పీ కరుణసాగర్ రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## పోరాటంతోనే ప్రజా సమస్యల పరిష్కారం

**సీపీఐ(ఎంఎల్) చంద్రపుల్లారెడ్డి పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి మల్లెపల్లి ప్రభాకర్**

**జవహర్ నగర్, జూన్ 25, (నినాదం న్యూస్) :** ప్రజా పోరాటం తోనే ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయని అణిచివేతను ఎదిరిస్తేనే ప్రజా సమస్యలకు మోక్షం లభిస్తుందని, భూమి, భుక్తి, విముక్తి కోసం పోరాడిన గోదావరిలోయ విప్లవ ప్రతిఘటనోద్యమ నాయకులు ప్రసాద్, వసంతక్కల పోరాటం ఆదర్శణీయమని సీపీఐ(ఎంఎల్) చంద్రపుల్లారెడ్డి పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి మల్లెపల్లి ప్రభాకర్ అన్నారు. మంగళవారం జవహర్ నగర్ కార్పొరేషన్ లోని మా గృహలక్ష్మి సంఘం ఆవరణలో ఐపీవోడబ్ల్యూ మెరుగు పుణ్యవతి ఆధ్వర్యంలో ప్రసాద్, వసంతక్కల వర్ధంతి కార్యక్రమాని నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లెపల్లి ప్రభాకర్ మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ పేరుతో ఛత్తీస్ ఘడ్ లో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆదివాసి గిరిజన ప్రజలపై అంతిమ యుద్ధాన్ని ఆపాలని అన్నారు. పోరాడితే పోయేదే మున్నది బానిస సంకెళ్ళు తప్ప అన్నచందంగా... ప్రజా సమస్యలకై ఉద్యమిస్తేనే పరిష్కార మార్గం దొరుకుతుందని పేర్కొన్నారు. అంతకుముదు ప్రసాద్, వసంతక్కల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించి, మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో షేక్షావలి, సంపంగి పద్మ, చిట్టిబాబు, సునిత, నర్సన్న, రషీద్, ద్రావిడ, వెంకటేశ్వర్లు, సిద్ధిరాజు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా నారెడ్డి రాజేశ్వర్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు



**కాప్రా, జూన్ 25(నినాదం న్యూస్) :** సైనిక్ పురిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం చర్లపల్లి డివిజన్ మాజీ అధ్యక్షులు, ఉద్యమకారుడు నారెడ్డి రాజేశ్వర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కేక్ కట్ చేయించి, శాలువాతో సత్కరించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## పార్కు లను సుందర వనం ల తీర్చిదిద్దుతాం

**జవహర్ నగర్ మేయర్ శాంతి**

**కాప్రా / జవహర్ నగర్, జూన్ 25, (నినాదం న్యూస్)**

జవహర్ నగర్ ను సుందరమైన నగరంలా తీర్చిదిద్దుతామని మేయర్ శాంతి, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ అన్నారు. జవహర్ నగర్ కార్పొరేషన్ చెన్నాపురంలో హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన పార్కును మంగళవారం మేయర్, డిప్యూటీ మేయర్ సందర్శించారు. ఈ సందర్భంగా మేయర్ శాంతి మాట్లాడుతూ పార్కు నిర్వహణలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించరాదని, మొక్కలు ఎండిపో కుండా చూడాలని అధికారులను ఆదేశించింది. పార్కులో జవహర్ నగర్ ప్రజలు సేదాతీరేందుకు పచ్చటి ఆహ్లాదాన్ని కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రంలో కార్పొరేటర్లు గొడుగు వేణు, నవీన్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, శానిటరీ ఇన్స్పెక్టర్ కృష్ణప్ప, సందీప్ తదితరులు పాల్గొన్నారు.



మొక్కలను పరిశీలిస్తున్న మేయర్ శాంతి, డిప్యూటీ మేయర్

## సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన కార్పొరేటర్



**మల్కాజిగిరి, జూన్ 25(నినాదం న్యూస్) :** వినాయక్ నగర్ డివిజన్ పరిధిలోని కాకతీయ నగర్ సాయిరాం బేకరీ పక్కన లైన్‌లో రూ.22 లక్షల వ్యయంతో జరుగుతున్న నూతన సీసీ రోడ్డు పనులను వినాయక్ నగర్ డివిజన్ కార్పొరేటర్ క్యానం రాజలక్ష్మి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వినాయక్ నగర్ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలు బస్తీలలోని అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. వీలైన త్వరగా నాణ్యత పరిమాణాలు పాటిస్తూ, పనులను పూర్తి చేసేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈ సత్యలక్ష్మి, డివిజన్ బిజెపి అధ్యక్షులు వెంకటేష్, రమేష్, మల్లేష్, మహేష్, కాలనీవాసులు విజయ్, భార్గవ్, తదితరులు పాల్గొన్నారు.

## వాడివేడిగా కళ్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీ

**-అధికారిక కార్యక్రమాల్లో తిరుపతి రెడ్డి పాల్గొనడాన్ని తప్పుపట్టిన కోట్లమైపాల్**

**-కళ్యాణ లక్ష్మీ లో తొలం బంగారం ఏమైందని ఆరోపణ**

**కోడంగల్ జూన్ 25 (నినాదం న్యూస్) :** కోడంగల్ నియోజకవర్గ పరిధిలోని దౌల్తాబాద్ మండలం లో కళ్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో వేడి రాజుకుంది. ఈకార్యక్రమంలో కోడంగల్ కాడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, సిఎం సోదరుడు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్ఛార్జీ తిరుపతి రెడ్డి చేతుల మీద చెక్కులు అందజేస్తున్న క్రమంలో అక్కడే ఉన్న జడ్పీటీసీ సభ్యుడు కోట్లమైపాల్ వాదించారు. తిరుపతి రెడ్డి ఏహోదాలో అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటారనీ నిలదీశారు. తన సోదరుడు రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి పదవిని అడ్డుపెట్టుకుని తనకు ఎలాంటి హోదా లేకున్నా అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటూ అధికారిక దుర్వినియోగానికి పాల్పడుతున్నారనీ నిలదీశారు. అక్కడే ఉన్న మిగతా పెద్దలు సర్దిచెప్పడంతో విషయం సద్దుమణిగింది. అనంతరం చెక్కుల పంపిణీ కార్యక్రమం సజావుగా సాగింది. కళ్యాణ లక్ష్మీ పథకం లో లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఎందుకు ఇస్తలేరనీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా, తమ ప్రభుత్వం అందించిన లక్ష రూపాయలే నేటి ప్రభుత్వం అందిస్తుందని వాపోయారు. చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎంపిపి పటేల్ విజయ్ కుమార్, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే నారాయణరెడ్డికు అభినందనలు

**మహేశ్వరం, జూన్ 25 (నినాదం న్యూస్)**

నిత్యం ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ నిరుపేదలకు అండగా ఉంటూ కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి తోనే అభివృద్ధి సాధ్యమని స్థానిక నాయకుడు జగదీష్ రెడ్డి అన్నారు. స్థానిక నాయకుడు కుటుంబ సభ్యులకు కలిసి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేస్తూ మిఠాయిలు తినిపిస్తూ శాలువ తో ఘనంగా సత్కరిస్తూ అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రతి నిరుపేద కు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని,రూ. 2 లక్షలు రుణమాఫీ తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. అందరి సహకారంతోనే నియోజకవర్గాన్ని అభివృద్ధి పథకంలో సీఎం రేవంత్ రెడ్డి తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు నాయకులు తదితరులు అభిమానులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యేని కలిసిన డబల్ బెడ్ రూమ్ లబ్ధిదారులు

**మల్కాజిగిరి, జూన్ 25(నినాదం న్యూస్)**

మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గం సంబంధించిన డబల్ బెడ్ రూమ్ లబ్ధిదారులు బోయిన్ పల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని మర్యాదగాపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డబల్ బెడ్ రూమ్ లబ్ధిదారులు మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వంలో తమకు డబల్ బెడ్ రూమ్ కేటాయించారని, కానీ ఆ డబల్ బెడ్ రూమ్ లకు డ్రైనేజీ, మంచి నీరు, ఎలక్ట్రికల్ పనులు ఆపేసారని, అక్కడ ఉండలేని పరిస్థితి ఉందని వెంటనే ఆ సమస్యలు పరిష్కరించాలని కోరడం జరిగిందన్నారు. అనంతరం ఎమ్మెల్యే స్పందించి మాట్లాడుతూ సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి ఆగిపోయిన పనులు వెంటనే చెప్పటలని, డబల్ బెడ్ రూమ్స్ ను కేటాయించిన లబ్ధిదారులకు అన్ని వసతులు ఉండేలా, ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు.



## నిజాంపేట్ జడ్పీ హైస్కూల్‌లో మౌలిక సదుపాయాలు కల్పిస్తా

**డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్**

**కుత్బుల్లాపూర్, జూన్ 25 (నినాదం న్యూస్) :** విద్యా సంవత్సరం పాఠశాల పున: ప్రారంభం సందర్భంగా నిజాంపేట్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ సందర్శించారు. పాఠశాలకు కావలసిన మౌలిక వసతులు తరగతి గదులు, క్రీడా మైదానం, బోర్, విద్యార్థులకు కావలసిన బెంచ్ లు,సౌకర్యాలు కల్పించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ ను కోరారు. డిప్యూటీ మేయర్ సానుకూలంగా స్పందించి పాఠశాల అభివృద్ధి కోసం విద్యార్థుల సౌకర్యార్థం కావలసిన మౌలిక సదుపాయాలు కల్పించుటకు పూర్తి సహకారం అందిస్తానని ఆయన భరోసా ఇచ్చారు. అనంతరం డిప్యూటీ మేయర్ పీఎంశ్రీ నిధులు ద్వారా మంజూరు అయినా సైన్స్ ల్యాబ్ పనులును సందర్శించి నాణ్యతతో, త్వరగా పూర్తి చేయాలనీ కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నత స్థానాలకు చేరాలని డిప్యూటీ మేయర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సుజాత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.రఘునాథ్, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.





## సేవాభావంలో బంగారు తెలంగాణ సంకల్ప శక్తి సేవ ట్రస్ట్

**కుత్బుల్లాపూర్, జూన్ 25, (నినాదం న్యూస్) :**
మానవసేవే మాధవసేవ అనే భావాన్ని నమ్ముతూ కుత్బుల్లాపూర్ బంగారు తెలంగాణ సంకల్పశక్తి సేవ ట్రస్ట్ తమ సేవా దృక్పథాన్ని చాటుకున్నది. మంగళవారం నాడు ట్రస్ట్ చైర్మన్ పంబి శ్రీనివాస్ నాయి, అంబి గణేష్ నాయి ఆధ్వర్యంలో కార్తికేయ ఓల్డ్ ఏజ్ హోమ్‌లో 68వ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. వృద్ధులకు కటింగ్, షేవింగ్ వంటి క్షౌర సేవలు ఉచితంగా చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నాయి బ్రాహ్మణ సేవా సంఘం నియోజకవర్గ వ్యవస్థాపక అధినాయకులు ఉప్పల భీంరావు, ఉప్పల హనుమంతరావు, ఎస్ రవిబాబు నాయి, నియోజకవర్గం అధినేతలు రే నయ నాయి, పరమేష్ నాయి, చింతల్ కమిటీ చైర్మన్ నరేందర్ నాయి, వర్కింగ్ ప్రెసిడెంట్ జగన్ నాయి, షాపూర్ నగర్ కమిటీ అధ్యక్షులు బండారి దాసు నాయి, బైరి నాయి , ఇతర నాయి సోదరులు పాల్గొని తమ వంతు సేవలను అందించారు.

## నేటి నుండి 29 వరకు ఉచిత వినికిడి పరీక్షలు

**హెలెన్ కెల్లర్స్ ఫౌండర్, చైర్మన్ పి ఉమర్ ఖాన్**

**మల్కాజిగిరి, జూన్ 25, (నినాదం న్యూస్) :** నేరేడ్ మెట్ ఎక్స్ రోడ్డు వద్ద గల రామకృష్ణాపురం శ్రీ కాలనీలోని హెలెన్ కెల్లర్స్ ఇన్స్టిట్యూట్స్ లో జూన్ 26 నుండి 29వ తేదీ వరకు ఉచిత వినికిడి పరీక్షలను నిర్వహించడం జరుగుతుందని హెలెన్ కెల్లర్స్ ఫౌండర్, చైర్మన్ పి ఉమర్ ఖాన్ తెలియజేశారు. మంగళవారం నాడు ఆయన మాట్లాడుతూ పుట్టిన పదిహేను రోజుల శిశువునకు కూడా ఉచిత వినికిడి పరీక్షలు చేయడం జరుగుతుందని, పిల్లవాడు ఐదు సంవత్సరాలు దాటిన, ఎన్నిసార్లు పిలిచిన సరిగ్గా స్పందించడం లేదు, తన వయస్సు సమానమైన పిల్లలవలే చురుకుగా లేదని అనిపించిన వెంటనే సంప్రదించాలన్నారు. ఉచిత పరీక్షలే కాకుండా, ఉచిత కౌన్సిలింగ్ తో పాటు, మీ బాబుని ఎలా అభివృద్ధి చేయగలరు అనే తెలియజేయడం జరుగుతుం దన్నారు. పేద బీదర పిల్లలకు 1వ తరగతి నుండి 12వ తరగతి వరకు ఉచిత విద్యా, హాస్టల్ వస్తువులు కూడా కలిగించదమని, 29వ తేదీ లోపు మీ బధిర పిల్లలను చేర్పించగలరన్నారు. ఈ అవకాశాన్ని వినికిడి లోపము గల పెద్దలు, ఈ సదుపాయాన్ని వినియోగించుకోగలరని తెలియజేశారు.

## రైతు వేదికలో టెలీ కాన్ఫరెన్స్

**రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమావేశం**

**కోడంగల్, జూన్ 25 (నినాదం న్యూస్) :** కోడంగల్ నియోజకవర్గ పధిలోని బొంరాస్ పేట్ రైతువేదికలో రైతునేస్తం (విడియో కాన్ఫరెన్స్) సమావేశం నిర్వహించారు. టెలీకాన్ఫారెన్స్‌లో వానాకాలంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి శాస్త్రవేత్తలు వివరించారు. రైతుభరోసాను సరియైన పద్ధతిలో అమలుపరచుటకై రైతుల నుండి అభిప్రాయ సేకరణ చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు టెలీకాన్ఫరెన్స్‌లో సూచించినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. 10 ఎకరాలకు మించి భూమి ఉంటే రైతుభరోసా ఇవ్వరాదని,రియల్ఎస్టేట్ భూములకు ఇవ్వరాదని, పంట సాగుచేసే భూములకే రైతు భరోసా ఇవ్వాలని, సకాలంలో ఇవ్వాలని రైతులు సూచనలు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొడంగల్ ఏడిఏ శంకర్ రాథోడ్, బొంరాస్ పేట్ ఎఓ అనురాధ, కొడంగల్ ఎఓ లావణ్య ,వివిధ క్లస్టర్ ల ఎఇఓలు, రైతులు పాల్గొన్నారు.

## పేకాటరాయుళ్లపై కేసు

**కారేపల్లి, జూన్ 25 (నినాదం న్యూస్):** పేకాటరాయుళ్లపై మంగళవారం కారేపల్లి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయింది. ఖమ్మం కు చెందిన కొంతమంది గేటు కారేపల్లి దగ్గరలో ఇంట్లో పేకాట ఆడుతున్నారు. ఈ పేకాట విషయమై ఖమ్మం టాస్క్ ఫోర్స్ పోలీసులకు స్థానికులు కొంతమంది సమాచారం అందించారు. కారేపల్లి, ఖమ్మం పోలీసులు ఇంటిపై దాడి చేశారు. ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. మూడు కార్లు, రూ.12,360 నగదు, మూడు సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకున్నారు.

## బోనాలకు నిధుల కోసం అప్లై చేసుకోండి

**ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**కాప్రా, జూన్ 25(నినాదం న్యూస్)**
ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్ లలో బోనాలకు సంబంధించిన నిధుల కేటాయింపు కోసం నిర్వహణ కమిటీలు హబ్సి గూడ లోని ఆంజనేయ స్వామి దేవాలయంలో అప్లికేషన్ పత్రాలు ఈవో కి అందజేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. గత సంవత్సరం దరఖాస్తు చేసుకున్న వారు కూడా మరల దరఖాస్తు చేసుకోవాలని, ఆశాడ బోనాల ఉత్సవాల కు అన్ని ఏర్పాటు చేస్తున్నట్లు త్వరలోనే రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు.

## నాగర్ కుంట గ్రామంలోని తాజ్ పౌల్ట్రీ ఫార్మ్ ను తొలగించాలి

**-సిపిఎం చేవెళ్ల డివిజన్ కన్వీనర్ అల్లి దేవేందర్**

**చేవెళ్ల జూన్ 25( నినాదం న్యూస్ ):-**
షాబాద్ మండల పరిధిలోని నాగర్కుంట గ్రామంలోని తాజ్ పౌల్ట్రీ ఫార్మ్ నుంచి తీవ్రమైన దుర్వాసన దోమలు ఈగలు నుంచి గ్రామ ప్రజలు అనారోగ్యాల పాలవుతుంటే దానిని తొలగించాలని, షాబాద్ ఎమ్మార్వో ఎండి అన్వర్ గారికి, సిపిఎం చేవెళ్ల డివిజన్ కన్వీనర్ అల్లి దేవేందర్ తాజ్ పౌల్ట్రీ ఫామ్ యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గం షాబాద్ మండలం నాగర్ కుంట రెవెన్యూ పరిధిలోని తాజ్ పౌల్ట్రీ ఫార్మ్ గ్రామానికి అతి సమీపంలో ఉండడం వల్ల దాని నుంచి వచ్చే దుర్వాసన ఈగలు దోమల వల్ల చిన్న పిల్లలు వృద్దులు గ్రామ ప్రజలు వాంతులు విరేచనాలకు గురవుతున్నారని ఆసుపత్రుల పాలవుతున్నారని కాబట్టి పౌల్ట్రీ ఫార్మ్ యాజమాన్యంపై చర్యలు తీసుకొని దానిని అక్కడి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో పౌల్ట్రీ ఫార్మ్ ముందు ఆందోళన చేపడుతామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో నాగర్కుంట గ్రామ ప్రజలు నరసింహ మురళి రఘురాం శ్రీధర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## గత సంవత్సరం పంటలు వేయని భూముల వివరాలువు సేకరించండి

**- అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్**

**ఖమ్మం, జూన్ 25, ( నినాదం న్యూస్)**
జిల్లాలో గత సంవత్సరంలో పంటలు వేయని భూములకు సంబంధించి, ప్రస్తుత పరిస్థితులు తెలుసుకోవడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ అప్లికేషన్ యాప్ ద్వారా క్షేత్ర స్థాయి సర్వే ను మంగళవారం నుండి ప్రారంభించినట్లు అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్ తెలిపారు. మంగళవారం అదనపు కలెక్టర్, జిల్లా వ్యవసాయ అధికారిణి విజయనిర్మల తో కలిసి, కూసుమంచి మండల కేంద్రం, కూసుమంచి క్లస్టర్ లో చేపడుతున్న సర్వే ని క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వ్యవసాయ భూముల సర్వే ను వ్యవసాయ విస్తరణ అధికారులు, పంచాయతీ, గ్రామీణాభివృద్ధి సంస్థ కు చెందిన అధికారులచే చేపట్టి , ప్రభుత్వానికి నివేదికను సమర్పిస్తామని అన్నారు. జిల్లాలో ఎంపిక చేయబడిన సర్వే నెంబర్లతో ఇట్టి సర్వే ప్రక్రియ చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు విజయ్ చందర్, కూసుమంచి మండల వ్యవసాయ అధికారిణి వాణి, అధికారులు, రైతులు తదితరులు ఉన్నారు.

## సీజనల్ వ్యాధులతో జర జాగ్రత్త

**ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు విజ్ఞప్తి**

**ఖమ్మం జిల్లా ప్రతినిధి జూన్ 25 (నినాదం న్యూస్)**
వర్షాకాలం వ్యాధులు ముసిరే సీజన్ కావడంతో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉంటూ కనీస జాగ్రత్తలు తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఖమ్మం మాజీ పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నిత్యం అప్రమత్తంగా ఉండాలని ప్రజలను కోరారు. వర్షాల నేపథ్యంలో వాతావరణ మార్పులు సంభవించి, సీజనల్ వ్యాధులు వేగంగా ముసురు తాయని పేర్కొన్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు అనే తేడా లేకుండా అన్ని వయసుల వారు అశ్రద్ధ చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చేతులు శుభ్రంగా కడుక్కొని, తీసుకునే ఆహారం, తాగునీటి విషయంలో జాగ్రత్తగా ఉండా లన్నారు. దోమలు కుట్టకుండా దోమ తెరలు ఉపయోగించా లన్నారు. నివశిస్తున్న ప్రాంతా లను పరిశుభ్రంగా ఉంచు కుంటూ చుట్టుపక్కల ఎక్కడా మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని కోరారు. బాక్టీరియా, వైరస్ లు, ఫంగస్ , దోమలు వృద్ధి చెందే అవకాశం ఉన్నందున తగు జాగ్రత్తలు తీసుకుంటూ వీలైనంత వరకు తాజా ఆహారాన్ని తీసుకోవడంతో పాటు కాచి చల్లార్చిన నీటినే తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని నామ నాగేశ్వరరావు ప్రజలను కోరారు.

# నర్సింగ్ విద్యార్థులకు ఫుడ్ పాయిజన్

**50 మందికి అస్వస్థత - ప్రైవేట్ హాస్పిటల్‌కి తరలింపు**



**శేరిలింగంపల్లి, జూన్ 25, (నినాదం న్యూస్):** రంగారెడ్డి జిల్లా చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మహిళా దక్షిత సమితి బన్సీలాల్ మలానీ కాలేజ్ ఆఫ్ నర్సింగ్, సుమన్ హాస్టల్ విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత ఆదివారం హాస్టల్‌లో ఆహారం తీసుకున్న విద్యార్థుల్లో 50 మంది విద్యార్థులు వాంతులు, విరేచనాలతో బాధపడ్డారు. వారిని హాస్టల్ యాజమాన్యం వెంటనే సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. 50 మందిలో ప్రస్తుతం ఆరుగురు పరిస్థితి సీరియస్‌గా ఉన్నట్లు తెలుస్తుంది. ఇదే విషయంపై కాలేజీ యాజమాన్యాన్ని వివరణ కోరగా.. మా దగ్గర ఎవరికీ ఫుడ్ పాయిజన్ కాలేదని, మంజీరా నీటి సరఫరాలో కల్తీ నీరు సరఫరా కావడం వల్ల విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని మహిళా దక్షిత సమితి బన్సీలాల్ మలానీ కాలేజ్ ఆఫ్ నర్సింగ్, సుమన్ హాస్టల్ యాజమాన్యం తెలిపింది. కలుషిత నీటి సరఫరాపై మియాపూర్ ఏరియా వాటర్ వర్క్స్ అధికారి నాగప్రియను వివరణ కోరగా మంజీరా నీటి సరఫరాలో ఎలాంటి కలుషితం జరగలేదని, నీరు కలుషితం అయితే మియాపూర్ డివిజన్ పరిధిలో అంతటా జరుగుతుందని, కేవలం ఒకే చోట ఎలా జరుగుతుందన్నారు. ఇదే అంశంపై ఫుడ్ సేఫ్టీ అధికారులను వివరణ కోరగా తమ పరిధిలో కాలేదంటూ చేతులు తీస్తున్నారు. ప్రధానంగా విద్యాశాఖ అధికారులు, ఫుడ్ సేఫ్టీ, శానిటేషన్ అధికారం నిర్లక్ష్యం కనబడుతుందని విద్యార్థి సంఘం అన్నారు. కాలేజీ యాజమాన్యం పై కట్టిన చెరువు తీసుకోవాలి నాణ్యత ప్రమాణాలు లేకుండా నిర్వహిస్తున్న కాలేజీ పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి శంకర్ అన్నారు. సేవ పేరుతో ట్రస్టులు ఏర్పాటు చేసి ప్రజల నుంచి పెద్ద ఎత్తున డబ్బులు తీసుకుంటున్నారని గుర్తు చేశారు ఇలాంటి విద్యా సంస్థలపై ప్రభుత్వం కఠినంగా ఉండాలని ఆయన డిమాండ్ చేశారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తరగతుల పరిశీలన

**- కళాశాలకు చేరుకున్న పాఠ్యపుస్తకాలు**
**- త్వరలోనే తరగతులు ప్రారంభిస్తాం**
**- ఇంటర్మీడియట్ విద్యాధికారి శంకర్ నాయక్**

**కోడంగల్ జూన్ 25, (నినాదం న్యూస్) :** కోడంగల్ నియోజకవర్గ పరిధిలోని బొంరాస్ పేట్ మండలంలో నూతనంగా మంజూరైన ప్రభుత్వ జూనియర్ కళాశాల తరగతుల నిర్వాహణకై జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో తరగతులను మంగళవారం ఇంటర్మీడియట్ విద్యాధికారి, బొంరాస్ పేట్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ విజయ్ కుమార్‌లు పరిశీలించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యా యులతో మాట్లాడుతూ కొత్తగా మంజూరైన ప్రభుత్వ జూనియర్ కళాశాల తరగతులు నిర్వహించుటకు పాఠశాల లోని అదనపు గదులు కేటాయించాలని కోరారు. అనంతరం స్థానిక రెవెన్యూ కార్యాలయానికి వెళ్లి కళాశాల నిర్మాణానికి కేటాయించిన స్థలం రికార్డులను రెవెన్యూ అధికారుల ద్వారా అందుకున్నారు. బొంరాస్ పేట్ గ్రామంలో సర్వే నెంబర్ 253లో 2 ఎకరాల భూమి ని ప్రభుత్వ జూనియర్ కళాశాల కు కేటాయించినట్లు రికార్డులను అందుకున్నారు. అనంతరం ఇంటర్మీడియట్ అధికారి శంకర్ నాయక్ మాట్లాడుతూ, ప్రభుత్వ జూనియర్ కళాశాల కు ప్రభుత్వం ద్వారా పాఠ్య పుస్తకాలు అందాయని త్వరలోనే తరగతులు ప్రారంభిస్తామని ఆయన చెప్పారు. కళాశాలలో ఎంపిసీ, బైపిసి, సిఇసి, హెచ్ ఈసి,గ్రూపుల తో పాటు నూతనంగా ఒకేషనల్ కోర్సులైన ఎంపిహెచ్ డబ్ల్యు, ఎంఎల్ టి గ్రూపులు విద్యా ర్థులకు అందుబాటులో ఉన్నాయని, ఆసక్తి గల విద్యార్థులు అడ్మిన్ పొందాలని ఆయన తెలిపారు.

## చిన్నారి చదువుకు బొబ్బా ప్రసాద్ ఆర్థిక సాయం

**కుత్బుల్లాపూర్, జూన్ 25 (నినాదం న్యూస్)**
చిన్న వయస్సులోనే తండ్రిని కోల్పోయిన నిరుపేద చిన్నారి చదువుకు బొబ్బా ప్రసాద్ ఆర్థిక సాయం అందజేశారు. కుత్బుల్లాపూర్ నియోజక వర్గం సుభాష్ నగర్ డివిజన్ ఎస్ ఆర్ నాయక్ నగర్ కాలనీలో కడిమి దుర్గాప్రసాద్ టీవీలు రిపేర్ చేస్తూ ఆయన భార్య ఏకైక కుమార్తె కడిమి శరణ్యతో ప్రశాంతమైన మర్యాదపూర్వకమైన జీవనాన్ని కాలనీవాసులు అందరితో కలిసి మెలిసి జీవనం సాగించేవాడు. అనుకోని పరిస్థితుల్లో దుర్గాప్రసాద్ కు రెండు కిడ్నీలు చెడిపోయి సరేన వైద్యం ఉందిక మృతి చెందాడు. మృతుడు దుర్గాప్రసాద్ కుమార్తె అపురూప కాలనీలోని టీవీఆర్ మోడల్ స్కూల్లో పదో తరగతి చదువుతోంది. ఈ అమ్మాయి చదివిన పాఠశాలలో గత సంవత్సరం 9వ తరగతి ఫీజును చెల్లించలేదు. ప్రస్తుతం చదువుతున్న పదవ తరగతి క్లాసులకు గాను ఫీజులు కట్టవలసి ఉన్నది. ఈ విషయము గుబ్బల లక్ష్మీనారాయణ తెలుసుకొని తన స్నేహితుడు బొబ్బ ప్రసాద్ దృష్టికి తెచ్చాడు. విషయం తెలుసుకున్న బొబ్బ ప్రసాద్ తన అల్లుడు వాసిరెడ్డి గౌతం, తన కుమార్తె శశికి నిరుపేద విద్యార్థి చదువుకు కావలసిన ఆర్థిక సహాయం అందించి చదువు కొనసాగేలా చూడాలని సూచించాడు. స్పందించిన గౌతమ్, శశి దంపతులు దుర్గాప్రసాద్ కుమార్తె శరణ్య కు రెండు సంవత్సరాల ఫీజులు కట్టడం కోసం తమ తండ్రి బొబ్బ ప్రసాద్ కు డబ్బులు పంపించారు. ఆ డబ్బులను మంగళవారం టీవీఆర్ మోడల్ స్కూల్ కి వెళ్లి రెండు శరణ్యకు చెల్లించవలసిన సంవత్సరాలకు ఫీజు డబ్బులను టివిఆర్ మోడల్ హై స్కూల్ యాజమాన్యం కు అందజేశారు. ఈ కార్యక్రమంలో గుబ్బల లక్ష్మీనారాయణ, పితాని ప్రసాద్ పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం ఆధ్వర్యంలో సాయం

**ఖమ్మం జూన్ 25, ( నినాదం న్యూస్):**
లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం వారి ఆధ్వర్యంలో లక్ష రూపాయలు ఆర్థిక సహాయం తో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మంగళవార జిల్లా గవర్నరు చేతుల మీదుగా లయన్ సభ్యుల ఆర్థిక సహకారంతో మహ్మదాపురం గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థికి హాస్టల్ ఖర్చుల నిమిత్తం రు 10000/- లు ఖమ్మం లయన్స్ భవనములో అంద చేయడం జరిగినది. అదేవిధంగా కొణిజర్ల గ్రామ పంచాయతీ ఆఫీసులో జిల్లా గవర్నరు చేతుల మీదుగా పంచాయతీ కార్యదర్శి కి రు 80000/- లు విలువ గల ఫ్రీజరు( శవాలను భద్రపరచు బాక్సు ) లయన్ సభ్యుల సహకారంతో అందించారు.కొణిజర్ల గ్రామానికి చెందిన భర్త లేని నిరుపేదరాలైన కళావతి కి రు 9500/- లు విలువ గల కుట్టు మిషన్ లయన్ సభ్యుల సహకారంతో అందజేయనైనది. పల్లిపాడు సర్కిల్ లోని అంగన్ వాడి స్కూల్ పిల్లలికి రు 10000/- లు విలువగల బౌల్స్ మరియు స్పూన్స్ లయన్ సభ్యుల సహకారంతో అందించడమైనది. ఈ సందర్భంగా జిల్లా గవర్నరు శ్రీ %జప్ర. ఎ%. శివప్రసాదు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఖమ్మం వారి ఆధ్వర్యంలో ఇటువంటి సేవా కార్యక్రమాలు చేయుట చాలా ఆనందంగా ఉంది అని అన్నారు. ప్రెసిడెంటు క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ ఆర్థిక సహాయం చేయడం ఆనందంగా ఉందని అన్నారు. ఇంకా రాబోవు రోజులలో ఇటువంటి మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమములో జిల్లా గవర్నరు శ్రీ %జప్ర. ఎ%. శివప్రసాదు, రీజినల్ ఛైర్మన్ లగడపాటి ప్రభాకర్, అధ్యక్షులు తల్లపురెడ్డి క్రిష్ణారెడ్డి, కార్యదర్శి వేముల హనుమంతరావు, కోశాధికారి జనార్ధన్ రావు, జోన్ ఛైర్మన్ డాక్టరు డి.సి.సి. రావు, కాకర్ల మల్లిఖార్జున్, పాయల నాగేశ్వరరావు, కె. విశ్వేశ్వరావు మరియు లయన్ సభ్యులు కమర్తపు కిరణ్, అత్తలూరి గోవర్ధన్, అబ్దుల్ అలీం, వంగవీటి నవీన్ మరియు యంపిడివో రోజారమణి, సెక్రటరీ రాజేశ్వరి మరియు ప్రజాప్రతినిధులు సూరంపల్లి రామారావు,మాజీ జడ్పిటిసి దొండపాటి రమేష్ , రవి, పోగుల శ్రీను, పొసంగి శ్రీను , సిడిపివో ఉషారాణి, సూపర్వైజర్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

## నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు

**- నెంబర్ ప్లేట్ లేని 26 బైకులు పట్టివేత..**
**- వాహనదారులకు కౌన్సిలింగ్ చేసిన డీఎస్పీ చంద్రభాను..**

**ఇల్లందు,జూన్25(నినాదం న్యూస్):** నంబరు ప్లేట్లు లేకుండా,నంబర్ ప్లేట్స్ వంచినా,అడ్డుగా స్టిక్కర్స్ వేసి వాహనదారులు తమ వాహనాలు నడిపితే సీజ్ చేసి,క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఇల్లందు డీఎస్పీ చంద్రభాను,సీఐ బత్తుల సత్యనారాయణ వాహనదారులకు హెచ్చరించారు.మంగళవారం పట్టణంలోని ప్రధాన కూడళ్ల వద్ద సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో,ఎస్సైలతో వాహనాల తనిఖీ చేపట్టారు.నంబరు ప్లేట్లు లేని పలు వాహనాలను పోలీస్ స్టేషన్ కు తరలించి వాహనదారుల కౌన్సిలింగ్ నిర్వహించి తక్షణమే నెంబర్ ప్లేట్ లను అమర్చి ఫైన్ వేశారు.అనంతరం వారు మాట్లాడుతూ..వాహనదారులు తమ వాహానాలకు ముందు,వెనక తప్పనిసరిగా నెంబర్ ప్లేట్లు అమర్చుకోవాలన్నారు.నంబర్ ప్లేట్స్ లేకుండా వాహనాలు నడపడం,స్టిక్కర్స్ వేయడం,వంచడం,ట్రిపుల్ రైడింగ్,సౌండ్ పొల్యూషన్ వంటివి చేయడం చట్టరీత్యా నేరమన్నారు.అలాంటి వాహనాలను గుర్తించి సీజ్ చేయడం జరిగుతుందన్నారు.ట్రాఫిక్ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని,లేకపోతే జరిమానాలు తప్పవన్నారు.ఈ తనిఖీల్లో ఎస్సై సందీప్ కుమార్,సిబ్బంది పాల్గొన్నారు.



## దళిత బాలుడుపై దాడిని ఖండించిన ప్రజా సంఘాలు

**-బాధితుడికి న్యాయం చేయాలనీ దళిత బిసి సంఘాల రాస్తారోకో**
**-షాబాద్ చౌరస్తాల్లో రాస్తారోకో దాదాపు గంటసేపు వాహనాల నిలుపువేత**
**-జగన్మోహన్ రెడ్డి పై ఎస్సీ ఎస్టి అట్రాక్ సిటీ నమోదు చేశామన్న సీఐ బి కాంతారెడ్డి**

**చేవెళ్ల జూన్ 25( నినాదంన్యూస్):** దొంగతనం నేపథంతో శనివారం దళిత బాలుడిపై జరిగిన దాడి ఘటనపై ప్రజా సంఘాలు ఖండించాయి. న్యాయం చేయాలని రాస్తారోకో నిర్వహించారు. స్పందించిన దళిత, బీసీ, యువజన సంఘాలు సోమవారం బాలుడి తల్లిదండ్రులను కలిసి దానికి సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. అనంతరం బాలుడిపై దాడి చేసిన మధుసూదన్ రెడ్డి అతని కుమారుడు జగన్మోహన్ రెడ్డి పై వెంటనే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి బాధితులకు న్యాయం చేయాలంటూ అంబేద్కర్ వాదులు, యువజన సంఘాల ఆధ్వర్యంలో షాబాద్ మండలం కేంద్రంలో రోడ్డుపై ధర్నా చేసి రాస్తారోకో చేశారు. న్యాయం జరిగే వరకు పోరాడుతామని, గ్రామాలలో దళితులపై ఇలాగే దాడులు జరిగితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాల సంక్షేమ సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు చుక్కంపేట ఆంజనేయులు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు విశ్వం మాదిగ, మాలమహానాడు రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మాల మహేష్ సిపిఎం పార్టీ చేవెళ్ల నియోజకవర్గం అధ్యక్షులు దేవేందర్, సమతా సైనిక రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏర్పుల మల్లేష్, అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర మీడియా కార్యదర్శి పాన్నాగారి యాదగిరి, అంబేద్కర్ యువజన సంఘము రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బేగరి ప్రభాకర్, ఎమ్మార్పీఎస్ నాయకులు కర్రె శ్రీశైలం,ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం షాబాద్ మండల అధ్యక్షులు దేశముళ్ల శ్రీనివాస్,మాలమహానాడు నాయకులు పెంద్యాల చందు షాబాద్ మండల కొంతని యాదయ్య, షాబాద్ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు చేవెళ్ల మల్లికార్జున్, మొయినాబాద్ మండల అధ్యక్షుడు కొందిగారి మహేందర్ బాధితులు బేగరి రాములు యాదగిరి నవీన్,నరసిములు, రాజు కంకంటి బందీశ్వర్,మహేందర్, తదితరులు పాల్గొన్నారు.



## నాయి బ్రాహ్మణుల సంక్షేమానికి ముందుంటం

**: పుప్పాల భాస్కర్**

**కుత్బుల్లాపూర్, జూన్ 25 (నినాదం న్యూస్) :**
నాయి బ్రాహ్మణ సంక్షేమం కోసం ఎల్లప్పుడూ అండగా ఉండి ఆదుకుంటానని సూరారం డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పుప్పాల భాస్కర్ తెలిపారు. మంగళవారం129 సూరారం డివిజన్ నాయి బ్రాహ్మణుల సంక్షేమ సంఘం అధ్యక్షులు పల్నాటి శివకుమార్ నాయి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు స్థానిక బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పుప్పాల భాస్కర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. డివిజన్ లోని స్మశాన వాటికలో స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద ప్రత్యేక దృష్టి తో దశదినకర్మ, క్షవరాలు చేసుకోవడానికి వీలుగా ఏర్పాటు చేసిన షెడ్ నిర్మాణం గురించి చర్చించారు. ఈ సందర్భంగా పుప్పాల భాస్కర్ మాట్లడుతూ స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద సహకారంతో నాయి బ్రాహ్మణుల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ ముందుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నరేష్ నాయి, బాలవీర్ నాయి, మధునాయి, చంద్రనాయి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పెన్షనర్ల సమస్యల సాధనకై చలో ఢిల్లీ

**టి ఏ పి ఆర్ పి ఏ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పి నారాయణ రెడ్డి**

**మల్కాజిగిరి, జూన్ 25(నినాదం న్యూస్) :** ఇపియస్ పెన్షనర్ల ఆలిండియా కమిటీ నిర్ణయం మేరకు, కనీస పెన్షన్ 9 వేలు, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కరువు భత్యం పెంచాలని, వైద్య వసతులు కల్పించాలని తదితర సమస్యలపై పార్లమెంట్ సమావేశాల సందర్భంగా ఢిల్లీలో జరిగే ఆందోళన కార్యక్రమాలను జయప్రదం చేయాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ (టి ఏ పి ఆర్ పి ఏ) అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పి.నారాయణరెడ్డి అన్నారు. దానిలో భాగంగా జూలై 24 నుండి ఆగస్టు 9 వరకు ఢిల్లీలో జరుగనున్న పార్లమెంట్ సమావేశాల సందర్భంగా ఆగష్టు 6 నుండి 8 వరకు (3రోజులు) జంతర్ మంతర్ వద్ద ధర్నా కార్యక్రమం చేపట్టాలని, ఈ లోపు రాష్ట్రం నుండి ఎన్నికైన పార్లమెంటు సభ్యులందరికీ ఆయా జిల్లా బాధ్యులు వినతి పత్రాలు ఇవ్వడం, మన సమస్యలను పార్లమెంటు సమావేశాల్లో ప్రస్తావించాలని కోరాలన్నారు. కేంద్ర సంఘం నుండి ప్రధాన మంత్రి, కేంద్ర ఆర్థిక, కార్మిక శాఖా మంత్రులు, సిబిటి సభ్యులు, ప్రతిపక్ష నాయకులందరికీ వినతిపత్రాలు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాలను మల్కాజిగిరిలోని ఇపిఎస్ పెన్షనర్స్ పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కార్యదర్శి బాలగంగాధర్, మల్కాజిగిరి ఏరియా కమిటీ అధ్యక్షుడు అశోక్, కార్యదర్శి విజయ్ కుమార్, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా కృషి చేస్తా

**: శంభీపూర్ రాజు**

**కుత్బుల్లాపూర్, జూన్ 25 (నినాదం న్యూస్)**
ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నామని ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు శంభీపూర్ రాజు తెలిపారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు శంభీపూర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరగా వారు సానుకూలంగా స్పందించి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు.

## పార్లమెంట్ ఎన్నికలలో బిజెపికి దేశ ప్రజలు తగిన గుణపాఠం చెప్పారు

**సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు**

**ఖమ్మం జిల్లా ప్రతినిధి చింతకాని జూన్ 25(నినాదం న్యూస్)**
ఇటీవల జరిగిన పార్లమెంటు ఎన్నికలలో బిజెపికి దేశ ప్రజలు చెంప చెల్లుమనే విధంగా తగిన గుణపాఠం చెప్పారని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో రెండవ రోజు రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అయోధ్య రాముడు పేరుతో మూడవసారి అత్యధిక మెజార్టీతో అధికారంలోకి వస్తామని బిజెపి నాయకుల కలల కన్నారని ఆ కలలు కలలగానే మిగిలిపోయాయి అని ఎద్దేవా చేశారు. ఈ శిక్షణ తరగతులలో సిపిఎం మండల కార్యదర్శి మడిపల్లి గోపాలరావు నాయకులు వత్సవాయి జానకిరాములు, తోటకూరి వెంకట నరసయ్య, మద్దిన్ని బసవయ్య నన్నక కృష్ణమూర్తిపులి యజ్ఞ నారాయణ ఆలస్యం రవి కాటబత్తిన వీరబాబు రాచబంటి రాము వాక సీతారాం రెడ్డి దేశభైన ఉపేందర్ లింగం కోటేశ్వరరావు మడిపల్లి కిరణ్ బాబుతదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ స్కూల్ ఆగడాలను అరికట్టాలి : మణుగూరు జేఏసీ

**మణుగూరు జూన్ 25( నినాదం న్యూస్) :** మణుగూరు సబ్ డివిజన్ పరిధిలో ప్రైవేట్ స్కూల్లో ఆగడాలను అరికట్టాలని మణుగూరు జెఏసి నేతలు అన్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఎమ్మార్వోకి ఎంఈఓకి వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మణుగూరు సబ్ డివిజన్ పరిధిలో ప్రైవేట్ స్కూల్లో ఆగడాలకు ఎంతో మంది అమాయక విద్యార్థులు బలైపోతున్నారని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ ఫీజులు నియంత్రణలో చట్టబద్ధతను పాత్ర వేసి ఇష్టానుసారంగా అధిక ఫీజులు దండుకుంటున్నారని వారు ఆరోపించారు.

## ప్రభుత్వ పాఠశాలలకు సర్వీస్ పర్సన్స్ నియమించాలి

**ఆళ్లపల్లి జూన్ 25 (నినాదం న్యూస్) :** ప్రభుత్వ పాఠశాలలకు సర్వీస్ పర్సనల్స్ ను నియమించాలని టిపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు జోగ రాంబాబు మీడియా మిత్రులతో ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నేటికి నూతన విద్యా సంవత్సరం ప్రారంభమై పద్నాగు రోజులు కావాస్తున్న పాఠశాలలకు సర్వీస్ పర్సన్స్ లేక ఉపాధ్యాయులు, విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురి అవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇక నైనా రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేసి పాఠశాలల కు సర్వీస్ పర్సన్స్ నియమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ నియామక ప్రక్రియ వేగవంతం చేయాలని నియామకాలు పూర్తయ్యే దాకా విద్యావాలంటీర్లను నియమించాలని మధ్యాహ్నభోజనకార్మికులకు పెండింగ్ గౌరవవేతనాలను, మధ్యాహ్నభోజనపథకం పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ల్లో విద్యనభ్యసిస్తున్న బాలబాలికలకు ఉచిత నోట్ బుక్స్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. స్కూల్ మేనేజి మెంట్ గ్రాంట్ ముందు గానే మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

## విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి : పిడిఎస్‌యు

**ఖమ్మం జూన్ 25, (నినాదం న్యూస్):**
విద్యా రంగ సమస్యలు పరిస్కరించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడియుఎస్) ఖమ్మం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం నాడు ఖమ్మం నగరంలోని న్యూడెమోక్రసీ పార్టీ ఆఫీసులో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా పిడియుఎస్ రాష్ట్ర అధ్యక్షులు పి.మహేష్ ముఖ్యఅతిథిగాలి హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని రేవంత్ రెడ్డి సర్కార్ అధికారంలోకి వచ్చి ఏడు నెలలుగా వస్తున్న విద్యారంగం మీద దృష్టి పెట్టకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటివరకు కనీసం విద్యాశాఖకు మంత్రిని నియమించకపోవడం తీవ్రమైన నిర్లక్ష్యం అన్నారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. పిడిఎస్‌యు ఖమ్మం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆర్ క్రాంతి జి మస్తాన్ సాగర్ రామకృష్ణ శ్రీకాంత్ సంపత్ కిరణ్ ఉమేష్ గోపి భాను తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా కాంగ్రెస్ నాయకుడు నల్లు శ్రీకాంత్ రెడ్డి జన్మదిన వేడుకలు

**డోర్నకల్ జూన్ 25(నినాదం న్యూస్):**



ఆలోచనపరుడు, అభ్యుదయ వాది, నిస్వార్థపరుడు, నిరాడం బరుడు, ఆపద వస్తే సహాయం చేసే గుణం కలిగిన మంచి మనసున్న మరిపెడ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు నల్లు శ్రీకాంత్ రెడ్డి జన్మదిన వేడుక లను మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రభుత్వ అతిథి గృహంలో కాంగ్రెస్ పార్టీ నాయకుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారు కాంగ్రెస్ పార్టీ నాయకులు తేజవత్ నెహ్రూ నాయక్, ఎంపీటీసీ రమేష్, సురేష్, విలేకరులు ఆంబోతు మహేందర్, బోడ పట్ల సతీష్, మూడవత్ రవి, దేవరశెట్టి శ్రీశైలం, రమేష్, శ్రేయోభి లాషులు, స్నేహితులు తదితరులు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు...

## వైభవంగా వెంకన్న స్వామి బ్రహ్మోత్సవాలు

**కేసముద్రం జూన్ 25 (నినాదం న్యూస్):**



కేసముద్రం మండలం అమీనా పురం గ్రామం లోని శ్రీ భూ నీలా సమేత వేంకటేశ్వర స్వామి దేవస్థానం లో శ్రీమాన్ కిడాంబి నరసింహన్ దేశికన్ కృష్ణకిషోర్ త్రిపాఠి స్వామి వారి బృందం ఆధ్వర్యంలో సప్తమ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా నేడు బాల భోగము ,వేద విన్నపము, చతుస్థానార్చనలు,నిత్య విధి హోమము పూర్ణాహుతి, బలిహ రణము,విశ్వక్సేన ఆరాధన పుణ్యహవచనము,శ్రవణా నక్షత్ర యుక్త వార్షిక కళ్యాణ వత్సము,మాలమార్పణం, యాజమాన్యము కళ్యాణంలో పాల్గొన్న దంపతులకు ఆశీర్వచ నము, తీర్థ ప్రసాద గోష్ఠి అనంతరం కళ్యాణానికి వచ్చిన భక్తులకు దేవాలయంలో మహాఅన్న ధానము, సాయంత్రం యాగశాలలో హోమము శ్రీవారి అశ్వ వాహన సేవ దేవాలయం నుండి మోహన్ టాకీస్ వరకు ఊరేగింపు కోళాటాలతో వైభవంగా నిర్వహించడం జరిగింది.ఆలయ అర్చకులు వినయ్ మిశ్రా ఆలయ ధర్మకర్తలు వోలం రాజేశ్వర రావు, బచ్చు పరమేశ్వర్, చల్లా శ్రీనివాస్ రెడ్డి వద్దిరాజు దేవేందర్ అంబటి మహేందర్ రెడ్డి ,వోలం చంద్రమోహన్, బాణాల నాగరాజు,లక్కాకుల నర్సయ్య ,వొలం శ్రీనివాస రావు, శ్రీ రాం సంతోష్, తదితరులు పాల్గొన్నారు

## నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలి

### -ఢిల్లీలో ధర్నా చేసిన ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు పెరుమాండ్ల చరణ్ గౌడ్

**కేసముద్రం జూన్ 25 (నినాదం న్యూస్):**



నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలి. అని ఎన్ ఎస్ యు ఐ. కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.. నీట్ స్కాం 2024 కి వ్యతిరేకంగా నిరసనల్లో భాగంగా ఢిల్లీ లోని పార్లమెంట్ ముట్టడికి ఎన్ ఎస్ యు ఐ) నాయకులు ప్రయత్నించాడు. జాతీయ స్థాయిలో అత్యున్నతమైన నీట్ పరీక్ష నిర్వహణలో విఫలమైన ఎన్ డి ఏ ప్రభుత్వానికి అసమర్థమైన ఎన్ టి ఏ ఏజెన్సీ కి వ్యతిరేకంగా (ఎన్ ఎస్ యు ఐ)(నేషనల్ స్టూడెంట్ యూనియన్ ఆఫ్ ఇండియా) జాతీయ అధ్యక్షుడు వరుణ్ చౌదరి పిలుపు మేరకు ఢిల్లీలోని పార్లమెంట్ ముట్టడిలో (ఎన్ ఎస్ యు ఐ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్మెల్సీ డా..బల్మూరి వెంకట్, మహబూబాబాద్ జిల్లాఎన్ ఎస్ యు ఐ అధ్యక్షుడు పెరుమాండ్ల చరణ్ గౌడ్ పాల్గొన్నారు. నిరసనల్లో భాగంగా జంతర్ మంతర్ వద్ద ఎన్ ఎస్ యు ఐ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఏకమై పార్లమెంట్ ముట్టడికి యత్నించారు. నీట్ పరీక్షలలో అవకతవకలు జరిగాయని మళ్ళీ నీట్ పరీక్షను నిష్పక్షపాతంగా నిర్వహించాలనిఎన్ ఎస్ యు ఐ నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.నీట్ స్కాం 2024 లో నష్టపోయిన విద్యార్థులకు న్యాయం జరిగే అంత వరకు నిరసనలు కొనసాగిస్తాం అని ఎన్ ఎస్ యు ఐ నాయకులు తెలుపారు. ఈ నిరసన కార్యక్రమం లో ఎన్ ఎస్ యు ఐ. వివిధ రాష్ట్రాల నాయకులు పాల్గొన్నారు

**మా క్లిక్ మీ లుక్ నినాదం**

## ఆరుద్ర కార్తిలో ఆరుద్ర పురుగులు ప్రత్యక్షం



తొలకరి జల్లులు పడిన తరువాత ఆరుద్ర కార్తిలో ఆరుద్ర పురుగులు దర్శనమిస్తుంటాయి. ఈ పురుగులు దుక్కులు దున్నిన చెలకల్లో పచ్చిక బయళ్లతో కనువిందు చేస్తుంటాయి. ఆరుద్ర పురుగులు దర్శనమిచ్చాయంటే వర్షాలు బాగా కురుస్తాయని రైతుల నమ్మకం.పంట పొలాల్లో క్రిమిసంహారక మందుల వాడకం పెరిగిపోవడంతో భూముల్లో విషవాయువులతో పంటలకు మేలు చేసే పురుగులు క్రమంగా అంతరించి పోతున్నాయి. ఆరుద్ర పురుగులు కాటారం మండలంలో ప్రత్యక్షం కావడంతో రైతుల్లో ఆనందం కలుగుతుంది .

**-తోట కోటేశ్వర్ పటేల్ జిల్లా ప్రతినిధి
జయశంకర్ భూపాలపల్లి
-నినాదం న్యూస్**

## గుడుంబా స్థావరాలపై రైడ్స్ నిర్వహించిన పోలీసులు

### -10 లీటర్ల గుడుంబా సీజ్, 200 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం

**కేసముద్రం జూన్ 25 (నినాదం న్యూస్):**



కేసముద్రం ఎస్సై రాజయ్య తన సిబ్బందితో కలిసి మంగళవారం కట్టుకాలువ తండాలో ఎక్సైజ్ రైడ్ చేశారు. 200 లీటర్ల బెల్లం పానకం, 10 లీటర్ల నాటుసారా స్వాధీన పరచుకొని, నాటుసారా కాస్తున్న సదర్ వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై రాజయ్య మాట్లాడుతూ ఎస్ఐ వంశీదర్ ఆదేశాలతో గ్రామాల్లో బెల్లం రవాణా చేయకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటామని,అదే విధంగా గుడుంబా కాసే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని నాటు సారా కాసే వారిపై పిడి యాక్ట్ అమలు చేస్తామని అన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ %××% తో పాటు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొని గ్రామంలో గుడుంబా నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు.

## కలెక్టర్ రాహుల్ శర్మను మర్యాదపూర్వకంగా కలిసిన ఏఈఓలు

**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి జూన్ 25 నినాదం న్యూస్:**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా నూతన కలెక్టర్ రాహుల్ శర్మను జిల్లా వ్యవసాయ విస్తరణ అధికారులు సంఘం నాయకులు కలెక్టర్ కార్యాలయంలో మర్యాపూ ర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, పుష్ప గుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు సునీల్ కుమార్, ప్రధాన కార్యదర్శి శివకృష్ణ. గౌరవ అధ్యక్షులు ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షులు సుమలత, మనిషా, కోశాధికారి నాగరాజు, సంయుక్త కార్యదర్శులు అరుణ్, ప్రణయ్, భరత్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

# చిన్న కాళేశ్వరం పనులు త్వరగా పూర్తి చెయ్యాలి

**-చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా మూడు చెరువుల నింపి**

**-10 వేల అదనపు ఆయకట్టుకు సాగు నీరు అందించాలి**

**-కాళేశ్వరం అంతర్ రాష్ట్ర వంతెనను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**





**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి జూన్ 25 (నినాదం న్యూస్) :**
జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిన్న కాళేశ్వరం పంప్ హౌస్ మరమ్మత్తు పనులను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మంగళవారం ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ రాహుల్ శర్మ మహదేవ్ పూర్, మండలంలో సుడిగాలి పర్యటన చేశారు ముందుగా కాళేశ్వరం లోని స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం గోదావరి, తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న అంతర్ రాష్ట్ర వంతెనను పరిశీలించారు. బీరసాగర్ వద్ద జరుగుతున్న చిన్న కాళేశ్వరం పంప్ హౌస్ మరమ్మతు పనులను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మూడు పంప్ హౌస్ లు ఏర్పాటు చేయాల్సి ఉండగా రెండు పూర్తి కావచ్చాయని మిగత ఒకటి వచ్చే నెలలో పూర్తి చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. మరమ్మతు పనులతో పాటు ప్రత్యామ్నయంగా విద్యుత్ సరఫరా పురుద్దరణ పనులు చేపట్టాలని సూచించారు.చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా ఎర్ర చెరువు, మందిరం చెరువు, కొత్త చెరువు పరిధిలోని దాదాపు 10 వేల అదనపు ఆయకట్టుకు సాగు నీరు అందించనున్నట్లు తెలిపారు. ఎర్ర చెరువు, మందిరం చెరువులను పరిశీలించి చెరువు అభివృద్ధి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. కాళేశ్వరం రెండో దశ ఎత్తిపోతల పథకం పనులను కలెక్టర్ రాహుల్ శర్మ పరిశీలించి చిన్న కాళేశ్వరం పంప్ హౌస్ ద్వారా మహాదేవపూర్, కాటారం, మహా ముత్తారం, పలిమెల మండలాలలో దాదాపు 45 వేల్ ఎకరాలకు అదనంగా సాగునీరు అందించేందుకు అవకాశం ఉన్నట్లు తెలిపారు . గారెపల్లి పంప్ హౌస్ 2 నుండి 13 చెరువులకు నీటిని అందించనున్నట్లు తెలిపారు. పంటలకు సాగు నీరు అందించాలన్న ప్రభుత్వ లక్ష్యం మేరకు పనులు జరుగుతున్నాయని తెలిపారు. చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా దాదాపు 63 గ్రామాల రైతుల పంట పొలాలలకు సాగునీరు అందుతుందని అన్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ, నిధులు కొరకు ప్రతిపాదనలు అందచేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. నీళు వస్తే రైతులు సాగు చేయడానికి ధైర్యం వస్తుందని జాప్యానికి తావు లేకుండా నిరంతరాయంగా పనులు జరగాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ ఈ ఈలు యాదగిరి, తిరుపతిరావు, మహాదేవపూర్ డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ, కాటారం తహసీల్దార్ నాగరాజు, ఇరిగేషన్ ఏఈ విజయ్ కుమార్, మెగా ప్రాజెక్టు సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

### శ్రీ చైతన్య పేరుతో నడుస్తున్న

# ఎస్వివి స్కూల్ గుర్తింపును రద్దు చేయాలి

**-శ్రీ చైతన్య పేరుతో ఫీజుల నిలువు దోపిడీ**

**-విద్యాహక్కు చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నా స్పందించని డీఈఓ**

**-అధిక ఫీజులతో నష్టపోతున్న విద్యాధికారులు**

**-డెమొక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ శ్రావణ్**



**కేసముద్రం జూన్ 25 (నినాదం న్యూస్):**
స్థానిక కేసముద్రం మండల కేంద్రంలో ఉన్న శ్రీ వివేకానంద హైస్కూల్ లో ప్రభుత్వ నియమా నిబంధనలకు వ్యతిరేకంగా శ్రీ చైతన్య పేరును వాడుకుంటూ, శ్రీ చైతన్య కరికులం పేరుతో అక్రమంగా పాఠశాలలను నడిపిస్తున్న శ్రీ వివేకానంద హై స్కూల్ పర్మిషన్ ను రద్దు చేయాలని ఈరోజు డెమోక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గం ఆధ్వర్యంలో ఆందోళన చేయడం జరిగింది. ఈ సందర్భంగా డిఎస్ఎ రాష్ట్ర కన్వీనర్ కామగోని శ్రావణ్ మాట్లాడుతూ శ్రీ చైతన్య పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుండి పుస్తకాలు, అడ్మిషన్ల పేరుతో అలాగే స్కూల్ ఫీజుల పేరుతో వేలాది రూపాయలు వసూలు చేస్తూ విద్యను సంతలో వ్యాపార సరుకుగా మార్చి తల్లిదండ్రుల రక్తాన్ని తాగుతున్న (శ్రీ చైతన్య) శ్రీ వివేకానంద పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని వారు డిమాండ్ చేసారు. ఇదే విషయంపై స్థానిక ఎంఈఓ ని చరవాణిలో వివరణ అడగగా ఎంఈఓ దాటావేసే ధోరణిలో సమాధానం ఇచ్చారు. అలాగే ఇట్టి వ్యవహారం పై డీఈఓను ఫోన్ లో స్పందించగా ఒక్కసారి కూడా ఫోన్లో స్పందించకపోవడం వెనుక అనేక అనుమానాలకు తావిస్తుందని వారన్నారు. ఇట్టి శ్రీ చైతన్య వ్యవహారంపై గత విద్యా సంవత్సరంలో కూడా ఆరోపణలు వచ్చాయి, ఐన కుక్క తోక వంకర అన్న చందముగా మరల ఈ విద్యా సంవత్సరం కూడా అలానే శ్రీ చైతన్య పేరుతో అడ్మిషన్స్ తీసుకుంటు, వేల రూపాయల ఫీజులతో తల్లిదండ్రుల నడ్డివిరుస్తున్న శ్రీ చైతన్య యాజమాన్యం వెనుక మండల, జిల్లా విద్యాధికారుల హస్తం ఎంతైన ఉన్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయని వారన్నారు. ఇప్పటికైన వెంటనే మండల, జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి శ్రీ వివేకానంద స్కూల్ పేరుతో సాటుగా నడుస్తున్న శ్రీ చైతన్య హై స్కూల్ పర్మిషన్ ను వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేసారు. లేని యెడల రానున్న రోజుల్లో డీఈఓ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. డెమొక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర కోకన్వీనర్లు మున్నా గణేష్, జిగర అనిల్, ఉప్పుల శివ, నాయకులు అనిల్, నవీన్, ఉమంత్, రాజు, మజిత్, రవి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రఘు వీరా రెడ్డి జన్మదిన వేడుకలు

### - జన్మదినోత్సవ సందర్భంగా రక్తదానం



**డోర్నకల్ జూన్ 25(నినాదం న్యూస్):**
కాంగ్రెస్ పార్టీ మరిపెడ మండల అధ్యక్షుడు రఘువీర్ రెడ్డి జన్మదిన వేడుకలను ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు వివిధ గ్రామాల నుండి తరలి వచ్చి కేక్ కట్ చేసి సాల్వలతో సత్కరించి మిఠాయిలు తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.రఘు వీర్ రెడ్డి జన్మదిన సందర్భంగా 50 మంది కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు రక్తదానం చేశారు.స్వయంగా జన్మదినోత్సవం జరుపుకుంటున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రఘువీరారెడ్డి కూడా రక్తదానం చేశారు. శ్రేయోభిలాషులు,నాయకులు, కార్యకర్తలు,అభిమానులు అధిక మొత్తంలో పాల్గొని జన్మదినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ రవి నాయక్,కాంగ్రెస్ పార్టీ నాయకులు నల్లు శ్రీకాంత్ రెడ్డి,తేజవత్ నెహ్రూ నాయక్, విజయ్ నాయక్, వీరాభద్రం, సాయి, శ్రీను నాయక్, సిరాజ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా ఏఐఎస్‌బి 74వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**వరంగల్ జిల్లా ప్రతినిధి జూన్ 25 (నినాదం న్యూస్):**
అఖిల భారత విద్యార్థి బ్లాక్ ఏ ఐ ఎస్ బి 74 వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్ జిల్లా కేంద్రం లో జరిగిన ఆవిర్భావ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొని జెండా ఆవిష్కరించిన ఏ ఐ ఎస్ బి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హకీమ్ నవీద్. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ఐ ఎస్ బి 1951 కొలకత్తా పశ్చిమ బెంగాల్ రాష్ట్రం లో ఏర్పడి నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయాల సాధనకై విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం 74వ సంవత్సరాలుగా సమరశీల పోరాటాలు నిర్వహిస్తూ దేశవ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహిస్తున్నామని, ఆయన అన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని పూర్తి గా నిర్లక్ష్యం వహిస్తూ కార్పొరేట్ విద్యాసంస్థలకు వత్తాసు పలుకుతున్నారని ఆయన విమర్శించారు. ప్రభుత్వాలు యొక్క అసమర్థత విధానాల వల్ల దేశం లో పేద, మధ్యతరగతి, విద్యార్థులకు విద్య అందని ద్రాక్షగా మారిందని, ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రం లో ప్రభుత్వ యూనివర్సిటీలలో ఖాళీ ఉన్నటువంటి బీసీల పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, పెండింగ్ లో ఉన్నటువంటి ఏడు వేల కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలని, ప్రభుత్వ పాఠశాలలో, కళాశాలలో ఖాళీ ఉన్నటువంటి ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అంతేకాకుండా రాష్ట్రం లో ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు చేస్తున్న ఫీజుల దోపిడీని అరికట్టడం కై ఫీజు నియంత్రణ చట్టాన్ని రూపొందించాలని, ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏ ఐ ఎస్ బి జిల్లా కన్వీనర్ రోహిత్, నాయకులు జి ప్రవీణ్, అఖిల్, ఫురా?న్, యాకూబ్, రవి, కిషోర్ పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు ఎరువులను విక్రయించకుండా అరికట్టాలి

**తొర్రూరు జూన్ 25 (నినాదం న్యూస్):**
ఫర్టిలైజర్ షాపులలో నకిలీ విత్తనాలు ఎరువులను విక్రయించకుండా అరికట్టాలని ఏఐకేఎంఎస్ తోరూరు డివిజన్ అధ్యక్షులు ఊడుగుల లింగన్న అన్నారు. తొర్రురు మండల తహసిల్దార్ వినోద్ కుమార్ కు ఏఐకేఎంఎస్ తొర్రురు మండల కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఊడుగుల లింగన్న మాట్లాడుతూ ఈ సంవత్సరం వర్షాలు ముందుగా పడటం చేత రైతులు ముందుగానే వ్యవసాయ పనులు మొదలు పెట్టారు కానీ కొన్ని నకిలీ విత్తనాలు ఎరువుల కంపెనీలు ఇదే అదునుగా భావించి రైతులకు నకిలీ విత్తనాలు విక్రయించటం జరుగుతుందని.... ఇందుమూలంగా విత్తనాలు మొలకెత్తక పోవడం మొలకెత్తిన విత్తనాలు పంట పండక పోవడం చేత లక్షల్లో అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టిన రైతులు నష్టాల పాలై ఆత్మహత్యలకు పాల్పడడం జరుగుతుంది.అందుచేత ఈ సంవత్సరం అయినా ప్రభుత్వం నకిలీ విత్తనాలు ఎరువులను అరికట్టి ప్రభుత్వమే సబ్సిడీతో విత్తనాలు ఎరువులు అందజేయాలని వారు డిమాండ్ చేశారు. అంతే కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం తక్షణమే 2 లక్షల రుణమాఫీ చేసి కొత్త రుణాలను మంజూరు చేయాలని పంటల బీమా పథకాన్ని అమలు చేయాలి, సన్న, దొడ్డు రకం వడ్లకు 500 బోనస్ ఇవ్వాలి,కనీస మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్యు జిల్లా నాయకులు గౌడిశాల మనోజ్, పసినార వినయ్ నాయకులు ఎల్లయ్య, రాములు, దర్గయ్య, కొమరయ్య, తదితరులు పాల్గొన్నారు.



## స్వామి వారిని దర్శించుకున్న నూతన కలెక్టర్

**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి జూన్ 25 (నినాదం న్యూస్):**
జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరం భూపాలపల్లి జిల్లా కలెక్టర్ గా నూతనంగా ఇటీవలే బాధ్యతలు చేపట్టిన రాహుల్ శర్మ మొదటిసారి కాళేశ్వరం విచ్చేసి దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామివారిని మంగళవారం రోజున దర్శించుకున్నారు వారికి ఆలయ అధికారులు అర్చకులు రాజగోపురం నుండి పూర్ణకుంభ స్వాగతం పలికారు అనంతరం స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన చేసి ఆలయ మర్యాదలతో అర్చకులు స్వామి వారి శేష వస్త్రములతో ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు వారి వెంట అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆలయ కార్య నిర్వహణాధికారి మారుతి వివిధ శాఖల అధికారులు కాళేశ్వరం ఎంపిటిసి మమత నాగరాజు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



## సామాన్యుడికి న్యాయం జరిగేలా పోలీసింగ్ ఉండాలి

**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి జూన్ 25 నినాదం న్యూస్ :**
జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిధిలో సామాన్యుడిని దృష్టిలో పెట్టుకొని వారికి భరోసా కలిగించే విధంగా పోలీసింగ్ ఉండాలని, ప్రజలకు మార్గదర్శకంగా ఉండాల్సిన పోలీసులు, అనైతిక చర్యలకు పాల్పడితే, క్రమశిక్షణ చర్యలతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని, జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ శ్రీ కిరణ్ ఖరే హెచ్చరించారు. జిల్లా పోలీసు అధికారులు శాంతి భద్రతల విషయంలో కఠినంగా వ్యవరించాలని, నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, పోలీసుస్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించాలని ఎస్పి ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన నేర సమీక్షా సమావేశంలో ఎస్పి పాల్గొని, మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న కేసుల్లో క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్‌ను పెంపొందించి, కేసుల దర్యాప్తును పూర్తి చేయాలన్నారు. పోక్సో, ఎస్సీ, ఎస్టీ, తీవ్రమైన నేరాలకు సంబంధించిన కేసుల్లో విచారణను త్వరగా పూర్తిచేసి చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. ప్రతీ కేసుకు సంబంధించి ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలని, లక్ష్యం నిర్దేశించుకుని విధులు నిర్వహించాలన్నారు. చోరీ కేసుల్లో అన్ని కోణాల్లో విచారణ చేసి చోరీలకు పాల్పడిన వారిని గుర్తించి సొత్తును రాబట్టాలన్నారు. ప్రతీ రోజు వాహనాల తనిఖీలు నిర్వహించాలని ఎస్పి పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై కేసులు నమోదు చేయాలని, జిల్లా పరిధిలో గంజాయి రవాణా దారులు, వినియోగదారులపై పటిష్ట నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని, సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని, చెడు పనులను ఎవరూ ప్రోత్సహించిన ఉపేక్షించేదిలేదని ఎస్పీ కిరణ్ ఖరే హెచ్చరించారు. భూపాలపల్లి, కాటారం, సైబర్ క్రైమ్ డిఎస్పీ లు సంపత్ రావు, రామ్మోహన్ రెడ్డి, సుభాష్ బాబు, జిల్లా పరిధిలోని సిఐలు ఎస్సైలు పాల్గొన్నారు.



## జిల్లాలో వృద్ధాశ్రమం ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

### -కలెక్టర్ రాహుల్ శర్మ

**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి జూన్ 25 నినాదం న్యూస్:**
హైదరాబాద్ నుండి మహిళా, శిశు సంక్షేమ, వయోవృద్ధుల, దివ్యాంగుల సంక్షేమ శాఖ కార్యదర్శి వాకాటి కరుణ అంగన్వాడీలు బలోపేతం, దివ్యాంగుల, వృద్ధులు, ట్రాన్స్ జండర్లు నమోదు తదితర అంశాలపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ ఐడిఓసి కార్యాలయం నుండి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో వయోవృద్ధుల సంక్షేమం కోసం జిల్లాలో వృద్ధాశ్రమం ఏర్పాటుకు ప్రతిపాదనలు అందచేయాలని సంక్షేమ శాఖ అధికారిని ఆదేశించారు. వృద్ధాశ్రమాలు అందుబాటులో లేని జిలాలలో వృద్ధాశ్రమ భవన నిర్మాణానికి భూమిని గుర్తించాలని ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ప్రతిపాదనలు అందచేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, మహిళా శిశు వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# అవయవ దాతకు సన్మానం




**వరంగల్ జిల్లా ప్రతినిధి జూన్ 25 (నినాదం న్యూస్):**
గ్రేటర్ వరంగల్ మున్సిపాలిటీ కార్పొరేషన్ పరిధిలోని వరంగల్ 29వ డివిజన్ రామన్నపేటలోని డాక్టర్ ఏ రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మట్టేవాడ బొమ్మల గుడి దగ్గర నివాసం ఉంటున్న శామంతుల విజయ తన కొడుకైన రాజేందర్ కు ఒక కిడ్నీ దానం చేయడం జరిగినది. ఈ సందర్భంగా సామంతుల విజయకు ట్రస్టుచే ఘనంగా సన్మానించడం జరిగినది. ఈ సందర్భంగా ట్రస్టు మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఏ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రతి మనిషికి రెండు కిడ్నీలు ఉంటాయి అందులో ఒకటి దానం చేసినను ఇంకొక కిడ్నీతో జీవించవచ్చు అవయవదానం చేయడంవల్ల అవయదానం చేసిన వ్యక్తి, అవయదానం పొందిన వ్యక్తి ఇద్దరు సురక్షితంగా ఆరోగ్యంగా ఉన్నారు. దీన్ని స్ఫూర్తిగా తీసుకొని అవయదానంపై ఉన్న అపోహలను తొలగించుకొని యువత, మనమందరము ముందుకు రావాలని, జీవం ఉండగా రక్తదానం, కొంత భాగం కాలేయం, ఒక కిడ్నీ దానం, తల వెంట్రుకలు దానం చేయవచ్చు. మరణానంతరం మాత్రమే నేత్ర, అవయవ, శరీర దానం చేయవచ్చు అన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్ శ్రవణ్, కోఆర్డినేటర్ మోహన్ వారణాసి, మిట్టపల్లి సమ్మయ్య, నరేంద్ర చారి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు

**- ఆపదలో ఆదుకునే ఆపన్న హస్తుడు**



**డోర్నకల్ జూన్ 25(నినాదం న్యూస్ ):**
మహబూబాద్ జిల్లా మరిపెడ మండలం కోట్యా తండా గ్రామ పంచాయతీలోని జాల్ తండాలో నిన్న జరిగిన కరెంటు షార్ట్ సర్క్యూట్ తో పూర్తిగా కాలిపోయిన ఇంటిని పరిశీలించి వారి కుటుంబానికి మనోధైర్యాన్నిస్తూ ఆర్థిక సహాయం చేశారు.రెవెన్యూ డిపార్ట్మెంట్ తాహసీల్దార్ తో మాట్లాడి తక్షణమే ఆ కుటుంబానికి సహాయ సహకారాలు అందించే విధంగా చూడాలి అని చెప్పారు..ఇప్పుడున్న సమాజంలో ఆపదలో ఉన్న వారిని వచ్చి పలకరించడమే మరిచిపోయిన తరుణంలో,సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూప్ లలో పెట్టిన పోస్టులను చూసి నేను ఉన్నానంటూ వచ్చి వారి కుటుంబానికి మనోధైర్యాన్నిచ్చి మానవత్వాన్ని చాటుకున్నారు.

**ఆపదలో ఆదుకునే నాయకుడు గుడిపూడి**

**-కోట్య తండా గ్రామస్తులు**

మీకు ఆ భగవంతుని ఆశీస్సులతో ఎన్నో ఉన్నతమైన శిఖరాలను అధిరోహించాలని నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా కోట్యా తండా గ్రామపంచాయతీ గ్రామ పెద్దలు
మంగళపల్లి బూడిద శీను సేవలు ఎనలేనివి.

## మున్సిపల్ చైర్మన్ రామచంద్రయ్య సేవలు ఎనలేనివి



**తొర్రూరు జూన్ 25 (నినాదం న్యూస్):**
మంగళపల్లి బూడిద శీను సేవలు ఎన్ని లేనివని తొర్రూరు మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య అన్నారు. సోమవారం సాయంత్రం మున్సిపల్ వర్కర్ బూడిద శీను అనారోగ్య కారణాలతో మృతి చెందడంపై మున్సిపల్ వైస్ చైర్మన్ జినుగా సురేందర్ రెడ్డి. కలిసి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ కరోనాకాలంలో ప్రాణాలకు ఎదురెడ్డి సేవలు చేసిన బూడిద శీను సేవలు మరువలేనివని అన్నారు. మున్సిపాలిటీ నుండి దహన సంస్కారాల ఖర్చు రూపాయలు పదివేలు ఇవ్వడం జరిగిందన్న. మృతుని కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్లు భూసాని రాము, కోలుపుల శంకర్, దొంగరి రేవతి శంకర్, ధారావత్ సునీత జై సింగ్ నాయక్, పేర్ల యమునా జంపా, బిల్ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

**చింతపల్లి, జూన్ 25(నినాదం న్యూస్):**
ఫీజులను అధికంగా వసూలు చేస్తున్న ప్రైవేటు పాఠశాలలపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ఎన్ ఎస్ యు ఐ. నియోజకవర్గ అధ్యక్షుడు నేనావత్ కుమార్ నాయక్ డిమాండ్ చేశారు.మండల కేంద్రంలో మంగళవారం విలేకరులతో



ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా పాఠ్య పుస్తకాలను విక్రహిస్తున్న ప్రైవేటు పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని అన్నారు.దేవరకొండ నియోజకవవర్గం లోని అన్ని మండలాల్లోని ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజు వసూళ్లను నిరోధించి నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్,లను విక్రయిస్తున్న యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన కోరారు.ప్రైవేట్ పాఠశాలలు యాజమాన్యం తమ ఇష్టానుసారంగా గుర్తింపు లేని పాఠశాలలు నడిపి స్తున్నారని ఆయన చెప్పారు. చట్ట విరుద్ధంగా పాఠశాల బస్సులను నడిపిస్తున్న యాజమాన్యంపై ప్రభుత్వం కట్టెలు తీసుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కార్తీక్ పమర్,మండల అధ్యక్షులు రాజేష్,బన్నీ,సాయి,శివ, సాత్విక్,గౌస్,సోను, తదితరులు పాల్గొన్నారు.

## చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న మసనం శ్రీను

**చౌటుప్పల్ జూన్ 25(నినాదం న్యూస్):**
చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని 10, 11వ వార్డు చెందిన మసనం లక్ష్మయ్య ఫౌండేషన్ చైర్మన్ మసనం శ్రీను కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఢిల్లీలో ప్రమాణస్వీకారం శ్రీకారం కార్యక్రమంలో పాల్గొని వారిని ఘనంగా సన్మానించారు. అనంతరం ఏఐసీసీ రాష్ట్ర నాయకులు, జాతీయ, నాయకులు,అజయ్ కుమార్, మహేందర్ జోషి, రోహిత్ చౌదరి, హరిహర వేణుగోపాల్, ను కలిసి వారికి కూడా శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

# నల్గొండ జిల్లా నుంచి ఇసుక, ఒండ్రు మట్టి అక్రమ రవాణాను అరికట్టాలి

**-ప్రభుత్వ ఆస్తుల ఆక్రమణ సహించేది లేదు**

**- కలెక్టర్ సి.నారాయణరెడ్డి**




**నల్గొండ, నినాదం న్యూస్ :** జిల్లాలో ఇసుక అక్రమ రవాణా ఎట్టి పరిస్థితులలో జరగకూడదని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళ వారం అయన రెవెన్యూ, పోలీస్,ఇరిగేషన్, ఇతర సంబంధిత శాఖల అధికారులతో ఇసుక ,ఒండ్రు మట్టి ,మొరం అక్రమ రవాణా, అదేవిధంగా ప్రభుత్వ ఆస్తుల ఆక్రమణలు, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ కార్యాల యం నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.జిల్లాలో పెద్ద ఎత్తున ఇసుక అక్రమ రవాణా చేస్తున్నట్లు ,అలాగే ఒండ్రు మట్టి సైతం రవాణా చేస్తున్నట్టు తన దృష్టికి వచ్చిందని ,దీనిని అరికట్టేందుకు జిల్లా ,డివిజన్, మండల స్థాయిలోని బృందాలు ఏర్పాటు చేస్తామని,ఈ బృందాలు పకడ్బందీగా పనిచేయాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇసుక అందాల్సిన అవసరం ఉందని, మండల స్థాయి బృందాలు, గ్రామస్థాయి బృందాలు బాగా పనిచేసినట్లయితే ఇసుక అక్రమ రవాణాను అరికట్టవచ్చని అన్నారు. ఇందుకుగాను డివిజన్ స్థాయిలో ఆర్డీవో, డిఎస్పి ,డివిజనల్ పంచాయతీ అధికారి ,ఇరిగేషన్ అధికారులు ,మున్సిపల్ కమిషనర్ ఉన్నచోట మున్సిపల్ కమిషనర్లతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేస్తామని, అదేవిధంగా మండల స్థాయిలో తహసిల్దార్, ఎంపీడీవో, స్థానిక సబ్ ఇన్స్పెక్టర్, ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులు ఈ బృందంలో ఉంటారని తెలిపారు. జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్ తో పాటు ,జిల్లా ఎస్పీ, అడిషనల్ ఎస్పీలు, అడిషనల్ కలెక్టర్లతో కమిటీగా ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. జిల్లా నుండి ఎలాంటి అక్రమ రవాణా జరగకుండా చూడాల్సిన బాధ్యత ఈ బృందాలపై ఉందని కలెక్టర్ అన్నారు. అనుమతించిన ప్రదేశాలలో ఇసుక తవ్వకాలు జరిగే చోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని, ప్రభుత్వం జిల్లాస్థాయిలో చిన్నచిన్న వాగులు ,పెద్ద వాగులలో , అలాగే గుర్తించిన ప్రదేశాలలో మాత్రమే ట్రాక్టర్లలో ఇసుక తరలించేందుకు మాత్రమే అనుమతిస్తుందని, టిప్పర్లలో ఎలాంటి పరిస్థితుల్లో అనుమతించదని, నదులు వద్ద ఇసుక తవ్వకానికి రాష్ట్ర స్థాయిలో అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. జిల్లా స్థాయిలో "మన ఇసుక వాహనం" ద్వారా అనుమతి తీసుకుని ఇసుకను పొందవచ్చని, ఇసుక అవసరమయ్యేవారు "మన ఇసుక వాహనం" ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు .ఎక్కడైనా ఇసుక ఉందంటే అక్కడ మన ఇసుక వాహనం ఏర్పాటు చేసేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని, ప్రభుత్వ ఇసుక రీచులు ఉన్నచోట అక్రమ రవాణా అరికట్టేందుకు సీసీ కెమెరాలుతో పాటు, ఇసుక వాహనాలకు జిపిఎస్ ట్రాకింగ్ ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రజలకు సరిపోయినంతగా ఇసుక దొరికే విధంగా చూడాల్సిన బాధ్యత జిల్లా యంత్రాంగం పైన ఉందని, అయినప్పటికీ ఒకవేళ ఇసుక అక్రమ రవాణా జరిగినట్లయితే సంబంధిత బృందాల పైన ,బాధ్యుల పైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.అదేవిధంగా జిల్లాలోని చెరువుల నుండి అక్రమంగా ఒండ్రు మట్టిని తరలిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఈ అక్రమ ఒండ్రుమట్టి రవాణా సైతం తక్షణమే నిలిపివేయాలని ,లేనట్లయితే అక్రమ ఇసుక రవాణా, ఒండ్రు మట్టి తరలించే వాహనాలను సీజ్ చేసి నేరుగా కోర్టులో అప్పగించడం జరుగుతుందని, ఎలాంటి పెనాల్టీ విధించకుండా కోర్టు ద్వారానే వాటిని విడుదల చేసుకోవాల్సిన పరిస్థితి ఉంటుందని హెచ్చరించారు.ప్రభుత్వ ఆస్తుల ఆక్రమణల విషయంలో సైతం గట్టిగా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. అక్రమంగా ఇసుక రవాణా, వండ్రు మట్టి జరిగే చోట ఎలా అరికట్టాలో ప్రణాళిక రూపొందించుకోవాలని, జిల్లా నుండి ఒక్క వాహనం సైతం అక్రమంగా ఇసుక ,ఒండ్రు మట్టితో వెళ్లడానికి వీలులేదని తెలిపారు.ప్రభుత్వ "మన ఇసుక వాహనానికి " సెలవు రోజుల్లో ఎలాంటి అనుమతులు ఇవ్వడం జరగదని, తక్కిన రోజుల్లో ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు అనుమతులు ఇవ్వడం జరుగుతుందని వెల్లడించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇసుక దొరకాలన్నదే తమ తాపత్రయం అని అన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆయా డివిజన్ల వారిగా, మండలాల వారిగా ఇసుక అక్రమ రవాణాకు అవకాశాలు ఉన్నచోట తీసుకుంటున్న చర్యలపై ఆర్డీవోలు ,తహసిల్దారులను అడిగి తెలుసుకున్నారు. మన ఇసుక వాహనం ద్వారా అనుమతి తీసుకునేందుకు మండల స్థాయిలో అవగాహనను ఏర్పాటు చేస్తామని, అలాగే మండల స్థాయిలో మన ఇసుక వాహనాన్ని ప్రారంభించాలని ఆయన సూచించారు. ఇకపై జిల్లాలో అక్రమ ఇసుక ,,ఒండ్రు మట్టి,మొరం రవాణాల పై ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని కలెక్టర్ కోరారు.జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవార్ మాట్లాడుతూ ఇసుక ,వండ్రు మట్టి అనేవి అభివృద్ధికి చాలా ముఖ్యమైనవని, వీటిని అక్రమ రవాణా చేస్తే అభివృద్ధి ఆగిపోతుందని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అనుమతి పొందిన వారు మాత్రమే వీటిని తీసుకోవాల్సి ఉంటుందని, అలా కాదని ఎవరైనా అక్రమంగా వీటిని తరించినట్లయితే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, ఎఫ్ఐఆర్ నమోదు చేసి కోర్టుకి పంపించడం జరుగుతుందని, అందువల్ల ప్రతి ఒక్కరు చట్ట పరంగా మాత్రమే ఇసుక , ఒండ్రు మట్టి వంటివి పొందాలని అన్నారు. ఇసుక అక్రమ రవాణా ,ఒండ్రు మట్టి అక్రమ రవాణాలపై పోలీసు అధికారులు పూర్తి కఠినంగా ఉండాలని, జిల్లాలో ఎక్కడ ఇసుక నిల్వలు ఉండకుండా చూసుకోవాలని ఆదేశించారు. మండల, డివిజన్ కేంద్రాలలో పోలీస్ అధికారులు పూర్తి అప్రమత్తంగా ఉండి ఎలాంటి పరిస్థితులలో అక్రమ రవాణా జరగకుండా రెవెన్యూ, ఇతర యంత్రంగాలకు సహకరించాలని కోరారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ కు నల్గొండ జిల్లా కేంద్రం నుండి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి. పూర్ణచంద్ర, రెవెన్యూ అదనపు కలెక్టర్ జై .శ్రీనివాస్, ఆర్డీవోలు, తహసిల్దారులు, తదితరులు హాజరయ్యారు.

# సర్వీస్ రోడ్డు కల్పించాలంటూ రైతుల ఆందోళన

**అస్తవ్యస్తంగా రోడ్డు నిర్మాణంతో రైతులకు ఇబ్బందులు**



**కోదాడ,జూన్ 25 (నినాదం న్యూస్):**
కోదాడ నుంచి ఖమ్మం వరకు నిర్మిస్తున్న నాలుగు వరుసల రహదారిలో కోదాడ పరిధిలోని దుర్గాపురం క్రాస్ రోడ్డు వద్ద నిర్మిస్తున్న రింగ్ రోడ్డు వద్ద తమ వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు సర్వీస్ రోడ్డు నిర్మించాలంటూ పలువురు రైతులు మంగళవారం గుత్తేదారు వద్ద ఆందోళన వ్యక్తం చేస్తూ కొద్దిసేపు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రింగ్ రోడ్డు చుట్టూ సర్వీస్ రోడ్డు లేకపోవడంతో సుమారు రెండున్నర కిలోమీటర్లు తిరిగి తమ వ్యవసాయ పొలాలకు వెళ్ళవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.అదేవిధంగా గతంలో వ్యవసాయ కనెక్షన్లకు విద్యుత్ లైన్లు, ట్రాన్స్ ఫార్మర్లు ఉండేవని రోడ్డు విస్తరణలో వాటన్నింటినీ తొలగించి మరలా కొత్త స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ సౌకర్యం కల్పించకుండా సదారు గుత్తేదారు రైతులను ఇబ్బందులు గురి చేస్తున్నారని అన్నారు. అదేవిధంగా ఎన్ఎస్పి కెనాల్ పై కల్వర్టు నిర్మించకుండా అస్తవ్యస్తంగా రోడ్డు నిర్మాణం చేపట్టి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే అన్ని నేషనల్ హైవే,ఇరిగేషన్, విద్యుత్ అధికారులు,గుత్తేదారులు కల్పించుకొని సర్వే చేసి రైతులకు న్యాయం చేసి సమస్యలను పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో ఆందోళన లు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు తూములూరి. సీతారామరాజు, భూలోకరావు, వనపర్తి. నరసయ్య, తిరపయ్య,పుల్లయ్య, వెంకటేశ్వర్లు,వీరబాబు బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కమిషనర్‌కు వినతి



**చౌటుప్పల్ జూన్ 25(నినాదం న్యూస్):**
చౌటుప్పల్ మున్సిపాలిటీ లోని చౌటుప్పల్ పెద్ద పీర్ల కొట్టం ముందు ఉన్నటువంటి స్థలాన్ని మలిగే గంగయ్య మలిగె లక్ష్మమ్మ అనే ఇద్దరు వ్యక్తులు సాయమను నిర్మాణం చేశారు ఆక్రమించారు అలాగే సలేవా ఫాతిమా అనే వ్యక్తులు కూడా మెట్ల నిర్మాణం చేసి ఆక్రమించారు కాబట్టి ఇట్టి విషయాన్ని చౌటుప్పల్ మున్సిపల్ కమిషన్ కి వినతి పత్రం ఇచ్చి ఆక్రమణ జరిగిన పీర్ల కొట్టం భూమినీ కాపాడాలి అని తెలపడం జరిగింది.ఈ కార్యక్రమంలో పిర్లకొట్టం ముజావర్ ఎండీ బాబా, చింతకింది అన్నయ్య, మారుపాక శంకరయ్య, కృష్ణయ్య,పల్చం సత్యం,శ్రీను, రామాంజనేయులు,చెవగోని మహేష్,ఎండీ మున్న,ఎండీ చాంద్,ఎండీ షౌకత్, ఎస్.కె. జాని,చెరకు రాకేష్, శ్రావణ్ ఖాదర్ పాషా,ఎండీ అబ్బాస్ ఎండీ గౌస్,ఎండ్ అమీద్,ఎండీ అమీర్,ఎండీ అర్షాద్,డి.అజయ్ ఎండీ.జానీ ఎండీ సోహెల్ ఎండీ రఫిక్ పాల్గొన్నారు.

## ప్రాజెక్టులు, పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పనులను వెంటనే ప్రారంభించాలి

**-కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశం**



**నల్గొండ బ్యూరో, జూన్ 25(నినాదం న్యూస్):**
ప్రాజెక్టులు, వివిధ ప్రభుత్వ పథకాలకు సంబంధించి పెండింగ్ లో ఉన్న భూసేకరణ పనులను వెంటనే ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి రెవెన్యూ, ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.మంగళవారం అయన జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో భూసేకరణ, పునరావాస కేంద్రాలపై రెవెన్యూ ,ఇరిగేషన్,ఇతర సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు.ప్రత్యేకించి నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించి భూ సేకరణ ఎక్కడా పెండింగ్ లో ఉండకుండా చూసుకోవాలని, ప్రభుత్వ ప్రాధాన్యత ప్రకారం వాటిని పూర్తి చేయాలని, మొదటి ప్రాధాన్యత తో వాటిని పూర్తి చేయాలని అన్నారు. ఎన్నికల కోడ్ కారణంగా ఆగిపోయిన పనులన్నీటిని తక్షణమే మొదలుపెట్టి పూర్తి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, ముఖ్యంగా ఆర్డీవోలది ముఖ్యపాత్ర అని అన్నారు .పెండింగ్ లో ఉన్న ప్రతి పనిని ప్రారంభించి ముందుకెళ్లాల్సిందిగా ఆయన కోరారు. పనులు ఆషామాషీగా కాకుండా, ఫలితం లభించే విధంగా చేయాలని అన్నారు. జిల్లాలో ఇసుక అక్రమ రవాణా ,ఒండ్రు మట్టి వంటివి ఆపాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులతో పాటు, ఇరిగేషన్ అధికారులపై సైతం ఉందని అన్నారు. అలాగే ఎవరైనా ప్రభుత్వ స్థలాలు, చెరువులు, ఆస్తులను ఆక్రమించినట్లయితే వాటిని తొలగించడమే కాకుండా, పోలీసులకు సమాచారం అందించి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రత్యేకించి చెరువులను కాపాడుకునే బాధ్యత ఇరిగేషన్ శాఖ పై ఉందని, ఇందుకు రెవెన్యూ పోలీస్ సహకారం తీసుకోవాలని సూచించారు. అలాగే ఇసుక విషయంలో నిబంధనల ప్రకారం నడుచుకోవాలని, అనుమతించిన వారు మాత్రమే ఇసుకను సరఫరా చేయాలని ,ఎట్టి పరిస్థితులలో ఇసుక అక్రమ రవాణా జరగడానికి వీలులేదని, ఈ విషయంలో నల్గొండ టీం చురుకుగా పని చేయాలని అన్నారు. జిల్లాలో ఉన్న ప్రభుత్వ ఆస్తులన్నింటిని సంరక్షించాల్సిన బాధ్యత సంబంధిత శాఖల అధికారులు, సిబ్బందిపై ఉందని తెలిపారు.అంతకుముందు రెవెన్యూ అదనపు కలెక్టర్ జె .శ్రీనివాస్ జిల్లాలో చేపట్టిన ప్రాజెక్టులు, పనులవారీగా భూసేకరణ , ఆర్ అండ్ ఆర్ పనులపై సమీక్షించారు. ఈ సమావేశానికి నల్గొండ ఆర్డిఓ రవి, దేవరకొండ ఆర్డిఓ శ్రీరాములు, మిర్యాలగూడ ఆర్డీవో శ్రీనివాసరావు, చండూరు ఆర్డీవో సుబ్రహ్మణ్యం, స్పెషల్ కలెక్టర్ నటరాజ్ ,స్పెషల్ డిప్యూటీ శ్రీదేవి, తహసిల్దారులు, ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులు తదితరులు హాజరయ్యారు.

## దాతలు అందించిన సదుపాయాలు సద్వినియోగం చేసుకోవాలి

**కోదాడ, జూన్ 25(నినాదం న్యూస్):**
విద్యార్థులు దాతలు అందించిన సదుపాయాలు సద్వినియోగం చేసుకోవాలని అనంతగిరి మండలం గొండ్రియా ల ప్రాథమిక పాఠశాల ఎల్.ఎఫ్. ఎల్ హెచ్.ఎమ్ నంది పాటి సుధాకర్ అన్నారు. మంగళవారం పాఠశాల లో దాత అందే వసుంధర తన తండ్రి శ్రీనివాస్



జ్ఞాపకార్థం సుమారు ఐదు వేల రూ.ల విలువ చేసే రాత పుస్తకాలు విరాళం గా అందజేసిన సందర్భంగా దాత ను అభినందిస్తూ మాట్లాడారు. దాత ల సహకారం తో విద్యాభివృద్ధి జరుగుతుందన్నారు.విద్యార్థులు బాల్యం నుంచే ఉన్నత లక్ష్యాల సాధనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు హమీద్,మల్లి కార్జున్ రావు,ఆర్ శ్రీనివాసరావు, రమా,ఐఈఆర్టీ ఓంకారం విద్యార్థులు ఉన్నారు.

## మీలా సత్యనారాయణ సేవలు మరువలేనివి

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి జూన్ 25 (నినాదం న్యూస్ ):**
సుధాకర్ పీవీసీ అధినేత సర్గీయ మీలా సత్యనారాయణ సేవలు మరువలేనివని మాజీ శాసన సభ్యులు దోసపాటి గోపాల్ అన్నారు. మంగళ వారం జిల్లా కేంద్రంలోని మారుతీ విజ్ఞానికేతన్, సుధా



బ్యాంకులో మీలా సత్యనారాయణ ఐదవ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజకీయ వేత్తగా, వ్యాపారవేత్తగా మచ్చలేని నాయకునిగా పేరు తెచ్చుకున్నారని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధునిగా, ఉపాధ్యాయునిగా, సామాజిక వేత్తగా ఆయన అనేక సేవలు చేశారని కొనియాడారు. సుధాకర్ పీవీసీ స్థాపించి దేశ వ్యాప్తంగా పేరొందిన గొప్ప వ్యక్తి గా ఆయన జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. ముందు గా మీలా కుటుంబ సభ్యులు గాంధీనగర్ తోటలో ఆయన విగ్రహానికి, సుధాకర్ పీవీసీ కార్యాలయంలో మీలా చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెద్దిరెడ్డి రాజా, పెద్దిరెడ్డి గణ?ష్, పీవీసీ అధినేతలు మీలా మహదేవ్, మీలా జయదేవ్, మీలా వాసు దేవ్, సుధాబ్యాంకు డైరెక్టర్లు బోనగిరి భాస్కర్, శంకర్ లాల్, శ్రవణ్ కుమార్, రాచర్ల కమలాకర్, శర్మ, శ్రీధర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బీఎస్ఎన్ఎల్ ట్యాక్సీ స్టాండ్ యూనియన్ అధ్యక్షుడిగా గరిడేపల్లి రమేష్



**కోదాడ, జూన్ 25(నినాదం న్యూస్):**
కోదాడ పట్టణంలోని బిఎస్ఎన్ఎల్ టాక్స్ స్టాండ్ యూ నియన్ అధ్యక్షుడిగా గరిడేపల్లి రమేష్ గెలుపొం దారు.మంగళవారం నిర్వహించిన ఎన్నికలలో మొత్తం పోలింగ్ అయిన ఓట్లు 131 కాగా ప్రత్యర్థి పై 102 ఓట్ల మెజారిటీతో రమేష్ గెలుపొందారు.ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించిన ప్రతి సభ్యుడికి రుణపడి ఉంటానని అన్నారు.యూనియన్ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.అనంతరం అధ్యక్షుడిగా గెలుపొందిన గరిడేపల్లి రమేష్ కు యూనియన్ సభ్యులు శు భాకాంక్షలు తెలిపి సంబరాలు జరుపుకున్నారు.

## మహా అన్నదాన కార్యక్రమం



**కోదాడ,జూన్ 25 (నినాదం న్యూస్):**
మండల పరిధిలోని నల్లబండగూడెం సాయిబాబా దేవాలయంలో చిమిరియాల గ్రామానికి చెందిన రావూరి రాకేష్ లక్ష్మీ దంపతుల కుమార్తె ఆరాధ్య అన్నప్రాసన్న కార్యక్రమం సందర్భంగా దేవాలయంలో మహా అన్నదాన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ నల్లపాటి నరసింహారావు, రావూరి పూర్ణయ్య, నల్లూరి అప్పారావు, అల్సగాని బ్రహ్మయ్య, చిమిరియాల పిఎసిఎస్ చైర్మన్ రఘుపతి, శరభయ్య,మాజీ చైర్మన్ ముత్తవరపు రమేష్, కొత్త బ్రహ్మయ్య, మాజీ సర్పంచ్ రమావత్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

## మహిళా ప్రయాణికులకు బహుమతుల ప్రధానం

**-డిపో అసిస్టెంట్ మేనేజర్, పడాల సైదులు**

**చింతపల్లి, జూన్ 25 ( నినాదం న్యూస్):**
దేవరకొండ ఆర్టీసీ డిపో పరిధిలో నడుస్తున్న డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే మహిళా ప్రయాణికులకు బహుమతులను అందజేయనున్నట్లు అసిస్టెంట్ మేనేజర్ పడాల సైదులు తెలిపారు. దేవరకొండ డిపో కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేవర కొండ నుంచి హైదరాబాద్- మాచర్ల



కు వెళ్ళే 4 డీలక్స్ బస్సుల్లో గిఫ్ట్ బాక్స్ లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే మహిళా ప్రయాణికులు తమ గమ్యం చేరగానే, బస్సు దిగేముందు తాము తీసుకున్న టికెట్ వెనకాల వారి పేరు,ఫోన్ నెంబర్ రాసి గిఫ్ట్ బాక్స్ లో వేయాలని ఆయన తెలిపారు. ఈ బుస్సుల్లోని గిఫ్ట్ బాక్స్ లను15 రోజులకొకసారి డ్రా తీయడం జరుగుతుందని ఆయన చెప్పారు. డ్రా లో గెలుపొందిన ముగ్గురు మహిళా ప్రయాణికులకు బహుమతులు అందజేస్తామని ఆయన తెలిపారు.దేవరకొండలోని విశ్వేశ్వర క్లాత్ షోరూం వారి సహకారంతో బహుమతులను అందిస్తామని ఆయన పేర్కొన్నారు. మహిళా ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## బోళ్ల వెంకట్ రెడ్డిని సన్మానించిన బీమిడి ప్రదీప్ జీ

**చౌటుప్పల్ జూన్ 25(నినాదం న్యూస్ ):**
ది నల్లగొండ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్మన్ గా ఎన్నికైన బోళ్ల వెంకట్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు బీమిడి ప్రదీప్ జీ కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియ జేసారు. కాంగ్రెస్ పార్టీ పాలనలోనే రైతులకు సరైన న్యాయం జరుగుతుందని, త్వరలో రైతులకు రెండులక్షల రుణమాఫీ కూడా చేస్తున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలి యజేసారు.స్వాములవారి లింగోటం దేవాలయ కమిటీ చైర్మన్ కుర్నాల వెంకటేష్, చౌటుప్పల్ మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కా ర్యదర్శి ఎర్ర విక్రమ్ గౌడ్, స్వాములవారి లింగోటం పాల్గొన్నారు.

## బయో మైనింగ్ పరిశీలన

**కోరుట్ల, జూన్ 25(నినాదం న్యూస్):**
పట్టణంలోని డంపింగ్ యార్డ్ లో జరుగుతున్న బయో మైనింగ్ ను కోరుట్ల మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి మంగళవారం పరిశీలించాడు. బయో మైనింగ్ జరుగు తున్న విధానాన్ని తెలుసుకొని వారికి సలహాలు,సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డంపింగ్ యార్డు బయో మైనింగ్ ద్వారా చెత్తను ప్రాసెసింగ్ చేస్తారని అన్నారు.ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ గజానంద్, హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్ కుమార్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ మహేష్ పాల్గొన్నారు.



## కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆర్డీవోకు వినతి

**కోరుట్ల, జూన్ 25 (నినాదం న్యూస్):**
భారత కార్మిక సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో ఆర్డీవో కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1995 ప్రకారం బీడీ కార్మికుల కు 1000 రూపాయల పెన్షన్ ఇస్తున్నారని వారి ఆర్థిక స్తితి గతులు అనుసరించి 10000 వేలు చేయాలని, లేబర్ కోడ్ లను అమలు చేయబోమని ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయాలని, 73 షెడ్యూల్ ఎంప్లాయిమెంట్ కార్మికులకు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు 27 వేల వరకు జీతం పెంచాలని, భవన నిర్మాణ కార్మికులకు ప్రమదవ సాత్తు చనిపోతే 20 లక్షలు ఎక్షగ్రేసియ, సహజ మరణానికి 10 లక్షలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.




## మీ పిల్లల బంగారు భవిష్యత్తు కొరకు ప్రభుత్వ పాఠశాలకు పంపించండి

**జమ్మికుంట, జూన్ 25 (నినాదం న్యూస్):**
జమ్మికుంట మండలం కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యా యులు కొత్తపల్లి గ్రామంలో ఇంటింటా ప్రచార నిర్వహించి పాఠశాలకు రాని తల్లిదండ్రులను కలిసి వారి పిల్లలను పాఠశాలకు పంపించమని కోరినారు. ప్రభుత్వము విద్యార్థులకు మధ్యాహ్న భోజనము, ఉచిత రెండు జతల దుస్తులుమరియు ఉచిత పాఠ్యపుస్తకాలు అందిస్తుందని నాణ్యమైన విద్యను అందించే ఉపాయునీ,ఉపాధ్యాయులు పాఠశాలలో పనిచేస్తున్నారని మీ పిల్లల ఉజ్వల భవిష్యత్తు కొరకు ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులకు విన్నవిస్తూ ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జరీనా అంజుమా ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు రాజేందర్, రమేష్, ఐలయ్య, అవినాష్ మరియు స్వామి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.



## జాతీయ స్థాయి కరాటే పోటీలలో అల్ఫోర్స్ విద్యార్థులకు బంగారు పతకాలు

**-ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేకమైన గుర్తింపు పొందినది కరాటే విద్య**


**-ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా వి. నరేందర్ రెడ్డి**

**కరీంనగర్, జూన్ 25(నినాదం న్యూస్ ):**
కరాటే ఆత్మరక్షణ క్రీడగా ఖ్యాతి గడించినదని ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేకమైన గుర్తింపు పొందినదని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా వి. నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ పాఠశాలకు చెందిన 2 విద్యార్థులు తెలంగాణ రాష్ట్ర స్థాయి కరాటే కుంగ్స్ చాంపియన్షిప్ పోటీలలో బంగారు పతకాలు సాధించడంపట్ల ఏర్పాటు చేసినటువంటి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, క్రీడలలో ఎన్నో విషయాలు నేర్చుకునేవి ఉంటాయని ప్రత్యేకంగా విజయాలను సాధించే విధానాలను తెలుసు కుంటామని చెప్పారు. క్రీడల ద్వారా కలిగే విశిష్ట లాభాలవలన పాఠశాల విద్యా ప్రణాళికలో భాగంగా విద్యార్థులను వివిధ పోటలకు ఎంపిక చేయడమే కాకుండా అందులో విజయాన్ని సునాయాసంగా అందుకోవడానికై ప్రోత్సాహాన్ని అందిస్తున్నామని చెప్పారు.ప్రాథమికంగా విద్యార్థులకు పాఠశాలలో ఎంపిక పరీక్ష నిర్వహిస్తామని అందులో ప్రతిభను కనబరచిన వారికి పోటీలకు ఎంపిక చేస్తామని వారు చెప్పారు. ఈ క్రమంలో ఇటీవల కాలంలో జూన్ 9 కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించినటువంటి తెలంగాణ రాష్ట్ర స్థాయి కరాటే కుంగ్ఫూ చాంపియన్షిప్ పోటీలలో పాఠశాలకు చెందినటువంటి ఎ.రితిక, 5వ తరగతి, అండర్ 12, కటా విభాగంలో బంగారు పతకం వెపన్ విభాగంలో రజత పతకం సాధించినదని చెప్పారు. అదేవిధంగా ఎ. సిరిసహస్ర, 8వ తరగతి, అండర్ 14 బాలికల విభాగంలో, వెపన్ అంశంలో కాంస్య పతకం కటా విభాగంలో బంగారు పతకం సాధించడం కరీంనగర్ జిల్లాకే గర్వకరాణమని ఇతర క్రీడాకారులకు గొప్ప స్ఫూర్తి అని చెప్పారు.బంగారు పతకాలు సాధించడంపట్ల సంతోషాన్ని వ్యక్తం చేస్తూ విజేతలకు పుష్పగుచ్ఛాలతో పాటు ప్రశంస పత్రాలను అందజేసి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.



## స్పోర్ట్స్ స్కూల్లో జిల్లా స్థాయి ఎంపికలు

**కరీంనగర్, జూన్ 25(నినాదం న్యూస్ ):**
జిల్లా స్థాయి స్పోర్ట్స్ స్కూల్ సెలెక్షన్స్.మండల స్థాయిలో నిర్వహించినటువంటి సెలక్షన్స్ లో అర్హత సాధించిన విద్యార్థిని విద్యార్థుల కి జిల్లా స్థాయి ఎంపిక పోటీలు ఈ నెల 27 వ తేది న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్టేడియంలో జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి ,బి .శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుంది. ఈ ఎంపిక పోటీలలో పాల్గొనే విద్యార్థిని విద్యార్థులు జనన ధ్రువకరణ పత్రం నాలుగో తరగతి చదువుతున్న స్టడీ సర్టిఫికేట్ తీసుకొని ఉదయం 8:00 గంటలకి అంబేద్కర్ స్టేడియం లో రిపోర్ట్ చేయాలని డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి తెలియజేశారు.



## మేడిపల్లి సత్యంను పరామర్శించిన వెలిచాల రాజేందర్ రావు

**కరీంనగర్, జూన్ 25(నినాదం న్యూస్ ) :**
చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వెలిచాల రాజేందర్ రావు మంగళవారం మధ్యాహ్నం పరామర్శించారు. సత్యం సతీమణి రూపాదేవి ఐదు రోజుల కిందట మరణించిన నేపథ్యంలో ఆయన్ను వెలిచాల రాజేందర్ రావు ఓదార్చారు. రూపాదేవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



# రైతుల అభిప్రాయం మేరకే రైతు భరోసా అందిస్తాం

**-వారి సూచనలు పరిగణనలోకి తీసుకుంటాం**

**-అందరితో చర్చించే తగిన నిర్ణయం**

**-ఫేక్ న్యూస్ ను నమ్మవద్దు**

**-వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వీడియో కాన్ఫరెన్స్**



**కరీంనగర్, జూన్ 25(నినాదం న్యూస్):**
రైతుల సూచనలను పరిగణనలోకి తీసుకొని, వారి అభిప్రాయం మేరకే రైతు భరోసా పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. మంగళవారం వ్యవసాయ శాఖ మంత్రి హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతు భరోసా పథకంపై రైతుల నుంచి అభిప్రాయాలను సేకరించారు. తిమ్మాపూర్ మండల కేంద్రంలోని రైతు వేదిక నుంచి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులు, రైతు సంఘాలు, ప్రతినిధులు అందరితో చర్చించే రైతు భరోసాను అర్థవంతంగా అమలు చేస్తామని పేర్కొన్నారు. ప్రస్తుతానికి దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, సోషల్ మీడియాలో వచ్చే ఫేక్ న్యూస్ ను రైతులు నమ్మవద్దని సూచించారు. అందరితో చర్చించి మంత్రివర్గ ఉపసంఘానికి రైతు భరోసా పథకం అమలుపై నివేదిక సమర్పిస్తామని పేర్కొన్నారు. గ్రామాల్లో రైతులు రాతపూర్వకంగా కూడా అభిప్రాయాలు చెప్పవచ్చని తెలిపారు. అభిప్రాయ సేకరణ వల్ల ఈసారి రైతు భరోసా కొంత ఆలస్యం అయ్యే అవకాశం ఉందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రైతు సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతు న్నామని చెప్పారు. ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా కష్టమైన రైతులకు రెండు లక్షల రుణ రుణమాఫీ చేసి తీరుతామని స్పష్టం చేశారు. రైతులు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. రైతును రాజు చేయడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం రైతుబంధును ఇష్టాసారంగా అమలు చేసిందని తెలిపారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, బడా నేతలు, పడవు బడ్డ భూములు, గ్రామాల్లో భూమి ఉండి హైదరాబాద్ లో నివసించే వారికి సైతం పెట్టుబడి సాయం అందించిందని పేర్కొన్నారు. మా ప్రభుత్వం రైతు భరోసా దుర్వినియోగం కాకుండా అసలైన రైతుకు అందేలా చూస్తామని పేర్కొన్నారు. పది ఎకరాల వరకు రైతు భరోసా అందించాలి..మోరపెల్లి రమణారెడ్డి రైతు, మొగిలిపాలెం.పది ఎకరాల వరకు వ్యవసాయ భూమి ఉన్న రైతులందరికీ ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని అమలు చేయాలని మొగిలిపాలెం గ్రామానికి చెందిన మోరపల్లి రమణారెడ్డి అనే రైతు కోరారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. బీఆర్ఎస్ సర్కారు అందించిన తీరు లాగా కాకుండా నిజమైన రైతులకు న్యాయం జరిగేలా పెట్టుబడి సాయం అందించాలని పేర్కొన్నారు. పంటల సాగుకు ఉపయోగపడేలా ఎప్పటికప్పుడు సీజన్ ముందు 7500 రైతు భరోసా అందించాలని కోరారు. రెండు లక్షల రుణమాఫీ అమలు చేస్తున్నందుకు సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. ఐటీతో సంబంధం లేకుండా రైతులందరికీ పెట్టుబడి సాయం అందించాలని సూచించారు. రైతులకు నిరంతరం కాంగ్రెస్ ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తున్నదని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, జిల్లా వ్యవసాయ అధికారి బత్తిని శ్రీనివాస్, రైతు శిక్షణ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ చత్రు నాయక్, ఏడిఏ అంజని, తిమ్మాపూర్ తహసిల్దార్ కనుకయ్య, ఏవో సురేందర్ రెడ్డి, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### గ్రామ పంచాయతీ

## అధికారులు సమన్వయంతో పనిచేయాలి

**-జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్**

**-హరిత హారంలో భాగంగా నర్సరీ మొక్కల పరిశీలన**

**-కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రి, ముంపు ప్రాంతాల ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్**



**కోరుట్ల, జూన్ 25 (నినాదం న్యూస్):**
గ్రామ పంచాయతీ అధికారులు సమన్వయంతో పనిచేయాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ అన్నారు. మంగళవారం కోరుట్ల మండలంలోని మోహన్ రావు పేట, పైడి మడుగు గ్రామ పంచాయతీలను కోరుట్ల పట్టణంలోని ముంపు ప్రాంతలను, ప్రభుత్వ ఆసువత్రిని జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీలలో రికార్డులను, మిషన్ భగీరథ సర్వే సరళిని, నర్సరీ మొక్కలను పరిశీలించారు. గ్రామాలలో మురుగు నీరు నిల్వ ఉండకుండా శానిటేషన్ ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని, ఇంటింటికి త్రాగునీరు నీరు సరఫరా అవుతున్నాయో లేదో తెలుసుకొని ఖచ్చితమైన సర్వే చేయాలని అధికారులకు సూచించారు. కోరుట్ల మండలం మాదాపూర్ గ్రామ శివారులోని విఘ్నేశ్వర రైస్ మిల్ ను కలెక్టర్ తనిఖీ చేసి, ఇచ్చిన గడువులో పాట బియ్యాన్ని ప్రభుత్వానికి అందజేయాలని రైస్ మిల్ యజమానులను ఆదేశించారు.

**కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రి, ముంపు ప్రాంతాలను ఆకస్మిక తనిఖీ**

కోరుట్ల పట్టణంలోని సివిల్ సప్లై ఆధ్వర్యంలో ఉన్న మండల స్థాయి గోదాంను, కోరుట్ల మున్సిపాలిటీలోని డ్రైనేజి వ్యవస్థను, చెరువులను, ప్రకాశం రోడ్డులో గల ముంపు ప్రాంతాలను కలెక్టర్ పరిశీలించారు. వర్షాకాలంను దృష్టిలో ఉంచుకుని నీటి నిల్వలు ఉండకుండా, ఇండ్లలోకి నీరు వెళ్ళకుండా నీటిని దారి మళ్లించి పెద్ద డ్రైనేజిని నిర్మించడానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం కోరుట్ల ప్రభుత్వ నిర్మించిన డయాలసిస్ సెంటర్ ను, నిర్మాణంలో ఉన్న హాస్పిటల్ కొత్త బిల్డింగ్ ను కలెక్టర్ బి. సత్య ప్రసాద్ పరిశీలించారు. ఆసుపత్రిలో రోగులకు సరైన వసతులు, మందులు అందుబాటులో ఉన్నాయా, సిబ్బంది అందుబాటులో ఉంటున్నారా అని పేషెంట్లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట డిపిఓ సంపత్ రావు, కోరుట్ల ఆర్ డిఓఆనంద్ కుమార్, ఎమ్మార్వో వెంకట కిషన్, ఎంపీడీఓ, సివిల్ సప్లై సంబంధిత అధికారులు, మున్సిపాలిటీ సిబ్బంది, వివిధ శాఖ అధికారులు ఉన్నారు

## కన్నుల పండువగ సాగిన గణపతి హెూమం, అభిషేక పూజలు అశేష సంఖ్యలో తరలివచ్చిన భక్తులు



**కరీంనగర్, జూన్ 25(నినాదం న్యూస్ ):**
కరీంనగర్ పట్టణంలోని శ్రీ మహాదుర్గ, శ్రీ మహాలక్ష్మి, శ్రీ మహాసరస్వతి అమ్మవార్ల మహిమాన్విత దివ్య క్షేత్రం శ్రీ మహాశక్తి దేవాలయంలో మంగళవారం రోజున అంగారక సంకటహర చతుర్థి వేడుకను అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య స్వామి వారి దివ్య ఆశీస్సులతో వేద పండితుల ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం చేపట్టిన గణపతి హెూమం, సాయంత్రం సంకటహరచతుర్థి వ్రతం, అభిషేక పూజలు, భజన కార్యక్రమాలు కన్నుల పండుగ సాగాయి. ఎంతో విశిష్టత కలిగిన అంగారక సంకటహర చతుర్థి వేడుక మహెూత్సవాన్ని దేవాలయ నిర్వాహకులు ఘనంగా నిర్వహించడంతో అశేష సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటికీలాడింది. ఈ సందర్భంగా వేదపండితులు అంగారక సంకటహర చతుర్థి విశిష్టతను భక్తులకు తెలియజేశారు. దేవుళ్ళ అందరిలో వినాయకుడే ప్రథమ పూజలు అందుకుంటారని, ఏ శుభకార్యం మొదలు పెట్టాలన్న, ఏదైనా మంచి పని చేయాలన్నా ముందుగా గణేశుడినే పూజిస్తామని చెప్పారు. విఘ్నలన్ని తొలగించి మనం చేసే పనులన్నీ విజయవంతంగా పూర్తయ్యేలా వినాయకుడు ఆశీర్వదిస్తాడని చాలామంది విశ్వాసమన్నారు. ముఖ్యంగా సంకష్టహర చతుర్థికి ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. సంకట చతుర్థి అనేది ప్రతి చంద్ర మాసంలో వచ్చే వినాయకుడి ఉత్సమని, తెలుగు పంచాంగం ప్రకారం ప్రతి నెలలో పౌర్ణమి తిథి తర్వాత వచ్చే చవితి రోజున చతుర్థి వస్తుందని, ఈ చతుర్థి మంగళవారం నాడు వస్తే దానిని అంగారక సంకటహర చతుర్థి అంటారని తెలిపారు. అంగారకి సంకటహర చతుర్థి అన్ని సంకటహర చతుర్థి రోజుల్లో అత్యంత ముఖ్యమైందన్నారు. సంకష్టహర చతుర్థి వంటి పవిత్రమైన రోజున ఉపవాసం ఉండటంవల్ల వినాయకుని అనుగ్రహం లభిస్తుందని చాలామంది నమ్ముతారని, అంతేకాకుండా తమ జీవితంలో ఎదురయ్యే అడ్డంకులన్నీ తొలగిస్తాడని, కోరిన కోరికలన్నీ నెరవేరుస్తాడని చాలామంది విశ్వాసం, అందుకే ఈ రోజున ఉపవాసం ఈ సందర్భంగా భక్తులకు సంకష్ట విశిష్టతను వేద పండితులు వివరించారు. అనంతరం రాత్రి చంద్రోదయం తరువాత భక్తులకు ఆలయ నిర్వాహకులు దేవాలయం వద్ద అన్నప్రసాద వితరణ చేశారు.

## దొంగ ప్రమాణాలు చేసి ఎంతమంది ప్రాణాలు తీస్తావు

**-నీ సొంత డబ్బులతో కాదు నిరుద్యోగుల డబ్బులతో రాజకీయం చేస్తున్నావు**

**-నీవు మోసం చేసిన బాధితుల ఉసురు నీకు తాకుతుంది**

**-ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి పై విరుచుకుపడ్డ కాంగ్రెస్ నేత పత్తి కృష్ణారెడ్డి**



**జమ్మికుంట, జూన్ 25 (నినాదం న్యూస్) :**
హుజురాబాద్ శాసనసభ్యుడిగా గెలిచిన ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి తన సొంత డబ్బులతో రాజకీయం చేయడం లేదని నిరుద్యోగులను మోసం చేసి కుటుంబాన్ని మోసం చేసి తీసుకునే డబ్బులతో రాజకీయం చేస్తున్నాడని దొంగ ప్రమాణాలు చేసి ఇంకా ఎంతమంది ప్రాణాలు తీస్తావు అని కౌశిక్ రెడ్డి పై విరుచుకుపడ్డ టిపిసిసి మెంబర్ పత్తి కృష్ణారెడ్డి. మంగళవారం ఆయన హుజరాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ, ఎమ్మెల్యే కాకముందే ఎంతో మంది నిరుద్యోగుల దగ్గర ఉద్యోగాలు ఇప్పిస్తానని లక్షలాది రూపాయలు వసూలు చేసి వారు డబ్బులు అడుగుతే అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపిన చరిత్ర నీదని ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి పై విరుచుకుపడ్డ కాంగ్రెస్ నేత టిపిసిసి మెంబర్ పత్తి కృష్ణారెడ్డి. రాజకీయం చేస్తానంటే ఈ కుటుంబం నుండి నీకు ఒక్క రూపాయి కూడా మీ తండ్రి ఇవ్వలేదని ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి ఎంతోమంది దగ్గర తీసుకున్నావో వారి డబ్బులతోనే రాజకీయం చేస్తున్నామని మీ సొంత డబ్బులతో ప్రజలకు సేవ చేసే నైజం నీది కాదని ఆయన అన్నారు. ఓట్లేసి గెలిపించకపోతే కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకుంటానని దొంగ ఏడుపులు ఏడ్చి ప్రజలను మోసం చేసి గెలిచిన చరిత్ర పాడి కౌశిక్ రెడ్డిది అని పత్తి కృష్ణ రెడ్డి అన్నారు. ఇప్పుడు కూడా డబ్బులు తీసుకుని తీసుకోలేదు అంటూ మీ ఇంట్లోనే తడిబట్టలతో స్నానం చేసి ప్రమాణం చేస్తున్నావ్ అలా చేయకు ఆ పాపం నీ పిల్లలకు నీ కుటుంబానికి తాకుతుంది నీ స్వార్థం కోసం మీ కుటుంబాన్ని బలి చేయకు అంటూ కృష్ణారెడ్డి హితువు పలికారు. మీ స్వార్థం కోసం నీ కుటుంబాన్ని సైతం బలి చేయడానికి నువ్వు వెనకాడవని తెలంగాణ ప్రజలు తెలంగాణ సాధన కొరకు పోరాటం చేస్తుంటే తెలంగాణ వాదులపై రాళ్లు విసిరిన చరిత్ర నీదని ఆయన అన్నారు. ఇకపై తప్పుడు ప్రమాణాలు చేసి ఇటు ప్రజలను వాటి కుటుంబాన్ని మోసం చేయకని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేశిని కోటి పొనగంటి మల్లయ్య పూదరి రేణుక శివకుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పై నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ మోడీ దిష్టిబొమ్మ దహనం

**జమ్మికుంట, జూన్ 25 (నినాదం న్యూస్) :**
కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల 24 లక్షల మంది నీట్ విద్యార్థుల జీవితాలు అన్యాయమైపోయాయని అయినప్పటికీ కేంద్రం ఏ మాత్రం విద్యార్థులకు జరిగిన అన్యాయంపై స్పందించకపోవడం సిగ్గుచేటని ఎన్ ఎస్ యు ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండి ఇమ్రాన్ అన్నారు. మంగళవారం జమ్మికుంట పట్టణంలోని గాంధీ చౌరస్తాలో నీట్ లో జరిగిన అక్రమాలకు నిరసనగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను ఆయన దాహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నీట్ పరీక్ష లీకేజీ జరిగి నెల రోజులు కావస్తున్నా దానిపై కేంద్రం స్పందించకపోవడం బాధాకరమని 24 లక్షల మంది విద్యార్థుల జీవితాలను నాశనం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమని ఆ యన అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితోటి విచారణ జరిపించాలని నీ పరీక్షలు రద్దు చేసి మళ్లీ పరీక్షను నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష నిర్వహించడంలో ఎన్ టి ఏ విఫలమైందని వెంటనే ఎన్ టి ఏ ను బ్రాంచ్ చేయాలని ఆయన అన్నారు. ఎంతో కష్టపడి చదివి తమ భవిష్యత్తు కొరకు ఎన్నో కలలు కన్నా నీట్ విద్యార్థుల తల్లిదండ్రులకు మోడీ క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. పరీక్షను సమర్థవంతంగా నిర్వహించ లేని కేంద్ర విద్యా శాఖ మంత్రిని వెంటనే బర్తరఫ్ చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్యుఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఇమ్రాన్ కరీంనగర్ జిల్లా కార్యదర్శి పల్నాటి అభిలాష్ జమ్మికుంట టౌన్ అధ్యక్షులు వంశీ జమ్మికుంట మండల అధ్యక్షుడు అవినాష్ నాగరాజు జియా ఉల్లా శివ సమీర్ నరేష్ గణేష్ అజయ్ తదితరులు పాల్గొన్నారు.




# మెడికల్ పరీక్షలు రాష్ట్రాల పరిధిలోనే జరగాలి

**-ప్రజామిత్ర రాష్ట్ర అధ్యక్షులు కొరివి వేణుగోపాల్**



**కరీంనగర్, జూన్ 25(నినాదం న్యూస్):**
ఎంబిబిఎస్,మెడికల్ పరీక్షలు ఏ రాష్ట్రం కు ఆ రాష్ట్రానికి ఉండాలని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు కొరివి వేణుగోపాల్ అన్నారు. మంగళవారం ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఇదే విధానం ఉండే అప్పుడు పేపర్ లీకేజీ లాంటి అవకతవకలు జరిగితే ఒక్క రాష్ట్రం మీదనే దాని ప్రభావం పడుతుండేది కానీ ఇప్పుడు దేశవ్యాప్తంగా పరీక్షలు రాస్తున్న దాదాపు 25 లక్షల మంది విద్యార్థులపై దీని ప్రభావం పడుతుందన్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఎన్టిఏ జరుపుతున్న నేషనల్ ఎలిజిబిలిటీ ఎంట్రెన్స్ టెస్ట్ విధానాన్ని మార్చడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరపాలని అన్నారు. ఇప్పుడున్న నీట్ విధానం వల్ల దక్షిణ భారతదేశంలో ఉన్న రాష్ట్రాలకు ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర విద్యార్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. ఎందుకంటే 15% సీట్లు ఇతర రాష్ట్రాలకు కేటాయిస్తారు, గతంలో నుంచి ఇప్పటివరకు పేపర్ లీకేజీలు ఉత్తర భారత దేశంలోనే జరిగాయన్నారు.ఎస్సీ ఎస్టీ బీసీ రిజర్వేషన్ వల్ల ఎవరి వాటా వాళ్లకు దొరుకుతుందన్నారు. పేపర్ లీకేజీ వల్ల, డొనేషన్ విధానం వల్ల ప్రతిభ దెబ్బతింటుందన్నారు. ఇంజనీరింగ్ లో ఇప్పటికి కూడా పాత విధానమైన ఎంసెట్, జేఈఈ మెయిన్స్, జేఈఈ అడ్వాన్సు డు పరీక్షల వల్ల అవకతవకలకు అవకాశం లేదన్నారు. ఎందుకంటే లోకల్ ఇంజనీరింగ్ కాలేజీలు, ఎన్ఐటి, ఐఐటి. లు సపరేట్ పరీక్షలు జరుగుతున్నాయి కాబట్టి ఇలాంటి అవకతవకలు జరిగే అవకాశం లేదన్నారు. మెడికల్ పరీక్షలు కూడా ఇదే విధానంలో జరగాలన్నారు.కాళేశ్వరం ప్రాజెక్టును రక్షిద్దామని డాక్టర్ బి ఎన్ రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ లో సభ పెట్టారు కానీ దానివల్ల వేల కోట్ల నష్టమని అంతర్జాతీయ స్థాయి నిపుణులు అయినటువంటి రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ బిక్షం , రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ లక్ష్మీనారాయణ లు చెప్పిన విషయాలు మీకు తెలువదా!. ఎందుకు ప్రజలను గోల్ మాల్ చేస్తారని ప్రశ్నించారు. ఏ పార్టీ నుంచి పోటీ చేసిన ఎమ్మెల్యేలు ఆ పార్టీలనే ఉండాలన్నారు. కానీ గత పది సంవత్సరాల టిఆర్ఎస్ పాలనలో అన్ని పార్టీలకు సంబంధించిన ఎమ్మెల్యేలను కెసిఆర్ టిఆర్ఎస్ లో చేర్చుకున్నా రన్నారు. కాబట్టి ఈ పరిణామాలు అన్నింటికీ కారణం కేసీఆర్ అన్నారు. కాబట్టి ఏ పార్టీ అధికారంలో ఉంటే అక్కడికి ఎమ్మెల్యేలు , నాయకులు పోతారనీ అన్నారు.ఈ మీడియా సమావేశంలో బోయినపల్లి చంద్రయ్య, సిగిరి శ్రీదర్, బాపురెడ్డి, రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మారక ద్రవ్యాల వినియోగానికి

# అడ్డుకట్ట అనివార్యం

### అంతర్జాతీయ మారక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం







ప్రపంచాన్ని మాదక ద్రవ్యాల ముక్తం చేయాలన్న లక్ష్యాన్ని సాధించేందుకు సహకారాన్ని, చర్యలను బలోపేతం చేసేందుకు ప్రతి ఏడాది 26 జూన్‌న అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమరవాణా వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ డిసెంబర్ 7, 1987న చేసిన తీర్మానం 42/112 ద్వారా ప్రతి సంవత్సరం జూన్ 26వ తేదీని అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవంగా జరపాలని నిర్ణయించింది. ఈ తీర్మానం 1987 ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ డ్రగ్ అబ్యూస్ అండ్ ఇల్లిసిట్ ట్రాఫికింగ్ నివేదిక ఇతర అంశాల పై మరికొన్ని చర్యల కోసం సిఫార్సు చేసింది. ప్రపంచ వ్యాప్తంగా ది యునైటెడ్ నేషన్స్ ఆఫీస్ ఆన్ డ్రగ్స్ అండ్ క్రైమ్ (యూఎన్ఓడిసి) ఈ రోజున మత్తు పదార్థాల వల్ల ఏర్పడే సమస్యల పట్ల చైతన్యం కోసం అనేక అవగాహన కార్యక్రమాలను చేపట్టింది. ప్రతి ఏటా జూన్26న ప్రపంచ వ్యాప్తంగా మాదక ద్రవ్యాలను స్వాధీన పర్చుకుని దేశ దేశాల్లో బహిరంగంగా వాటిని తగులబెట్టడం, బహిరంగ సభలు, ప్రదర్శనల ద్వారా ప్రజలను చైతన్యపర్చడం మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను నిరోధించడం వంటి చర్యలను పెద్ద ఎత్తున ఐరాస ప్రోత్సహిస్తోంది. మాదకద్రవ్యాలు మానసికస్థితిపై ప్రభావం చూపడమే కాకుండా శరీరంలోని అన్ని అవయవాలను అస్తవ్యస్తం చేస్తాయి. వాటికి బానిసలై ఒక్కసారిగా దూరమైన వారి ప్రవర్తన చాలా భిన్నంగా ఉంటుంది. వీటికి అలవాటు పడి ప్రాణాలు కోల్పోతున్న వారెందరో. ఇంతకుముందు ఇరవై అయిదేళ్ల వయస్సులో వ్యసనాలకు లోనైన వారు ఇప్పుడు పదహారేళ్లకే ఈ పదార్థాలను వాడుతున్నారని నివేదికలు చెబుతున్నాయి. మత్తు పదార్థాల వాడకం వల్ల మెదడులో కొన్ని రసాయనాలు విడుదలవుతాయి. వాటిని ఎండార్ఫిన్స్ అంటారు. 'మత్తు' ఉంటేనే ఎండార్ఫిన్స్ విడుదలవుతాయి. అవి దొరకని సమయంలో వారు నీరసంగా కనిపిస్తారు. కుటుంబ విలువలు విచ్ఛిన్నం కావడం, కుతూహలం, పిచ్చెక్కిస్తున్న పోటీ, భావోద్వేగ సమస్యలు, నిత్య జీవిత సమస్యల ఒత్తిడులు, చేతిలో డబ్బు బాగా ఆడడం యువకులలో, పెద్దలలో, వృత్తి నిపుణులలో మాదక ద్రవ్యాల వినియోగం పెరుగుతుండడానికి మరికొన్ని కారణాలు. మహిళలు చాలా మంది కోక్‌కు అలవాటు పడిపోతున్నారు. దానిని ఒకసారి వాసన చూస్తే ఆకలి నశిస్తుంది. చాలా గంటల పాటు శక్తివంతంగా వుండేటట్లుగా చేస్తుంది. మహిళలు అనేక సమస్యల నుంచి తప్పించు కోవడానికి కూడా ఒక మార్గంగా మాదక ద్రవ్యాలను ఆశ్రయిస్తున్నారు. మాదక ద్రవ్యాల మీద ఆధారపడటం వల్ల జీవ రసాయనికంగా, మానసికంగా, సామాజికంగా దెబ్బతినడం, మందులలోని రసాయనిక పదార్థాలు నాడీ వ్యవస్థ మీద దాడి చేయడం, తీవ్రమైన ప్రవర్తనలు, కాలక్రమంలో ఆత్మీయులతో సంబంధాలు విచ్ఛిన్నం కావడం జరుగుతాయి. భారతదేశంలో కొకైన్‌పై వ్యసన పడుతున్న వారి సంఖ్య రానురానూ పెరుగుతోందని అధికా రులు నిర్ధారిస్తున్నారు. వరల్డ్ డ్రగ్ రిపోర్ట్ ప్రకారం, 2020లో 275 మిలియన్ల మంది డ్రగ్స్ వాడారు. 36 మిలియన్ల మంది డ్రగ్స్ వినియోగ రుగ్మతలతో బాధప డుతున్నారు. డ్రగ్స్ ఆరోగ్యాన్ని నాశనం చేస్తున్నాయి మరియు భవిష్యత్తును దొంగిలిస్తున్నాయి, డ్రగ్స్ వాడకం మాత్రమే 2019లో దాదాపు అర మిలియన్ల మందిని చంపింది. గంజాయి చౌకగా దొరకడంతో చాలా మంది దీనికి బానిసలవుతున్నారు. మహారాష్ట్రకు చెందినవారే ఎక్కువగా ఈ పంట సాగుచేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలో అమాయక గిరిజనులకు మాయమాటలు చెప్పి వారి భూములను తక్కువధరకు కౌలుకు తీసుకుని అందులో నిషేధిత గంజాయి పండించి దొడ్డిదారిన రూ. లక్షలు గడిస్తున్నారనే ఆరోపణలున్నాయి. రసాయనిక పరమైన మందులతో భారతదేశానికి వచ్చి గంజాయి లాంటి వాటిని తిరిగి తీసుకువెళ్లే విదేశీ పర్యాటకుల నుంచి వీటికి ఎక్కువ గిరాకీ లభిస్తోంది. 25 శాతం మంది శారీరక సమస్యలకు గురవుతారు. 42 శాతం ఒత్తిడికి, మానసిక సమస్యలతో బాధపడతారు. 25 శాతం మంది భార్యల నుండి విడాకులు కోరుతున్నారు. 40 శాతం నేరపూరిత ఆలోచనలతో గడుపుతున్నారు. యువత 45 శాతానికి పైగా సెక్స్‌లో విఫలమ వుతున్నారు. 24 శాతం మంది స్థూలకాయంలాంటి సమస్యలతో బాధపడుతుంటారు. మద్యం మత్తులోనే 90 శాతం నేరాలు. ఘోరాలు జరుగుతున్నాయి. మాదక ద్రవ్యాలు నల్ల బజారులో అందుబాటులో ఉంటున్నాయి. వివిధ ప్రాంతాలలో సంకేత నామాలతో చెలామణిలో ఉన్నాయి, నల్లమందు, మార్ఫిన్, హెరాయిన్, చరస్, గంజాయి, మారిజు వానా, కొకైన్, ఎల్ఎస్‌డీ ఇందులో ముఖ్యమైనవి. వీటిని కొందరు అక్రమ వ్యాపారాలతో దొంగ రవాణాకు పాల్పడుతూ కోట్లాది రూపాయలను గడిస్తుంటే, యువత వానిని వినియోగిస్తూ చెడిపోతున్నారు. వీటికి అలవాటు పడిన విద్యార్థులు, యువకులు చదువులు వదిలి సర్వస్వం కోల్పోయి నిర్భాగ్యులవుతున్నారు. ఒకసారి దీనికి బానిసలైన తర్వాత వీటిని సంపాదించడానికి ఎంతటి అకృత్యాలు, నేరాలు చేయడానికైనా వారు వెనుకాడరు. మాదక ద్రవ్యాల నిరోధానికి భారత ప్రభుత్వం నార్కోటిక్స్, డ్రగ్స్ అండ్ సైకోట్రాపిక్ సబ్‌స్టెన్సస్ చట్టాన్ని చేసింది. ఈ మత్తు మందులు పండించేవారు, వ్యాపారం చేసేవారు, కలిగివున్నవారు చట్టపరంగా కఠినంగా శిక్షార్హులు. మారక ద్రవ్యాల వినియోగానికి అడ్డుకట్ట వేస్తూ, మాదక ద్రవ్యాలు తీసుకునే వారిని నేరస్థుల్లా చూడటం మానేసి, వారిని డీఅడిక్ట్ చేసేందుకు సహకారం అందించాల్సిన అవసరముంది. దీనికి తల్లి తండ్రులు, డాక్టర్లు, సమాజం, మీడియా కూడా సహకారం అందించాలి.



## అవని

### జీలకర్ర.. ఆరోగ్యానికి జీవగర్ర



తిరగమోతలో జీలకర్ర చిటపటలాడితేనే అందం. జీలకర్ర.. ఉప్పు.. నలిపి తింటే కడుపు బ్బరం పరార్! పోపులపెట్టెలో అగ్రతాం బూలం అందుకున్న జీలకర్రలో చాలా రకాలు ఉన్నాయి. సాదాసీదా జీలకర్రలో పోషకాలెన్నో! దీన్ని మించిన ఔషధి నల్ల జీలకర్ర. ఆయుర్వే దంలో నల్ల జీలకర్రను ఎక్కువగా ఉపయో గిస్తారు. అనేక రుగ్మతలను నయం చేసే నల్ల జీలకర్ర ప్రయో జనాలు మరెన్నో ఉన్నాయి. నల్ల జీలకర్రను చేదు జీలకర్ర అని కూడా అంటారు. జీర్ణవ్య వస్థ, మూత్రపిండాలు, కాలేయం, గుండె, ఊపి రితిత్తులకు సంబంధించిన సమస్యల పరిష్కా రంలో ఇది దివ్యౌష ధంగా పనిచేస్తుంది. శరీరంలో పేరుకుపోయిన వ్యర్థమైన కొవ్వును కరిగిం చడంలో నల్ల జీలకర్ర బేషుగ్గా పనిచేస్తుంది. బీపీని నియం త్రించడంతోపాటు చర్మవ్యాధు లనూ అరికట్ట డంలో దోహదం చేస్తుంది. నల్ల జీలకర్ర యాంటీ బాక్టీరియల్, యాంటీ వైరస్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలను కలిగి ఉంటుంది. శరీరంలో ఉండే వాపులను తగ్గించ డంలో దగ్గు, జలుబు వంటి ఇన్ఫెక్షన్లను తగ్గించ డంలోనూ ఇది తోడ్పడుతుంది. నల్ల జీలకర్ర కషాయం తాగడం వల్ల సీజనల్ వ్యాధుల నుంచి ఉపశమనం లభిస్తుంది. దీన్ని తయారు చేయడం కూడా తేలిక. ఒక గ్లాస్ నీటిలో ఒక టీ స్పూన్ నల్ల జీలకర్రను వేసి అర గ్లాస్ అయ్యే వరకు మరిగించి వడకట్టుకోవాలి. గోరువెచ్చని కషాయం పరగడుపున తాగడం వల్ల దీర్ఘకాలిక రోగాల బారిన పడకుండా జాగ్రత్తపడవచ్చు. నల్ల జీలకర్ర పొడికి తేనెను కలిపి పరగడుపున తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది.

## నినాదం మార్కెట్

### ఆ ఐదు ఎస్‌యూవీలకు పోటీగా నిసాన్ న్యూ ఎక్స్-ట్రయల్




ప్రముఖ జపాన్ కార్ల తయారీ సంస్థ నిసాన్ మోటార్స్ తన న్యూ ఎక్స్-ట్రయల్ ఎస్‌యూవీ కారును భారత్ మార్కెట్లో వచ్చేనెల ఆవిష్కరించనున్నది. ప్రస్తుతం భారత్ మార్కెట్లో విక్రయిస్తున్న నిసాన్ మ్యాగ్నైట్ కు జత కలువనున్నది. జూలై 17న ఎక్స్-ట్రయల్ కారు ఆవిష్కరించే అవకాశాలు ఉన్నాయి. టయోటా ఫార్చ్యూనర్, ఎంజీ గ్లోస్టర్, హ్యుందాయ్ టస్కన్, ఫోక్స్ వ్యాగన్ టైగూన్, సిట్రోన్ సీ5 ఎయిర్ క్రాస్ తదితర ఎస్‌యూవీ కార్లకు గట్టి పోటీ ఇవ్వనున్నదని భావిస్తున్నారు. భారత్ మార్కెట్ నుంచి నిష్క్రమించిన తర్వాత ఎనిమిదేండ్లకు తిరిగి ఎక్స్-ట్రయల్ ఎస్‌యూవీతో తిరిగి ఎంటరవుతోంది. 2005లో తొలుత భారత్ మార్కెట్లో ఎక్స్ ట్రయల్ ఎస్‌యూవీ పాత జనరేషన్ కారు ఆవిష్కరించినప్పుడు పాపులర్ మోడల్ ఎస్ యూవీ కార్లలో ఇదొకటి. కానీ ఈ కారును 2014లో డిస్ కంటిన్యూ చేసింది. 2022లో గ్లోబల్ మార్కెట్లో కొత్త అవతార్‌లో ఎక్స్-ట్రయల్ అందుబాటులో ఉంది. ఎక్స్ -ట్రయల్ కారు 5-సీటర్, 7-సీటర్ కాన్ఫిగరేషన్ తో గ్లోబల్ మార్కెట్లలో అందుబాటులో ఉన్నా, భారత్ మార్కెట్లో రోడ్ల పరిస్థితులకు అనుగుణంగా కొన్ని మార్పులు చేసే అవకాశాలు ఉన్నాయి.

ఈ-పవర్ డ్రైవ్ సిస్టమ్‌తో వస్తున్న నిసాన్ ఎక్స్-ట్రయల్ కారు.. అలయెన్స్ సీఎంఎఫ్-సీ ప్లాట్ ఫామ్ పై రూపుదిద్దుకున్నది. ఈ-పవర్ డ్రైవ్ సిస్టమ్‌లో హై ఔట్ పుట్ బ్యాటరీ, వారియబుల్ రేషియో పెట్రోల్ ఇంజిన్ తోపాటు ఇంటిగ్రేటెడ్ పవర్ ట్రైన్, పవర్ జనరేటర్, ఇన్వర్టర్, 150 కిలోవాట్ల ఫ్రంట్ ఎలక్ట్రిక్ మోటార్ ఉంటాయి. నిసాన్ ఎక్స్-ట్రయల్ కారు రెండు పవర్ ట్రైన్ ఆప్షన్లలో అందుబాటులో ఉంటుందని సమాచారం. ఈ-పవర్ స్ట్రాంగ్ హైబ్రీడ్ మోటారు గరిష్టంగా 201 బీహెచ్పీ విద్యుత్, ఆల్ వీల్ డ్రైవ్ ఈ-పవర్ వేరియంట్ 211 బీహెచ్పీ విద్యుత్, మైల్డ్ హైబ్రీడ్ వేరియంట్ విత్ 12వీ మైల్డ్ హైబ్రీడ్ టెక్నాలజీ మోటార్ 160 బీహెచ్పీ విద్యుత్, 300 ఎన్ఎం టార్క్ వెలువరించే సామర్థ్యం గల ఇంజిన్ అమర్చే అవకాశాలున్నాయి. భారత్ మార్కెట్లోకి నిసాన్ న్యూ ఎక్స్-ట్రయల్ ఎస్ యూవీ కారు కంప్లీట్‌లీ బిల్ట్ యూనిట్ (సీబీయూ) రూట్‌లో వస్తోంది.

## చాట్‌జీపీటీకి అమెజాన్ చెక్

### లేటెస్ట్ ఏఐ మోడల్‌పై టెక్ దిగ్గజం కసరత్తు




టెక్ దిగ్గజం అమెజాన్ ఓపెన్ఏఐ చాట్‌జీపీటీకి దీటైన పోటీ ఇచ్చేందుకు కసరత్తు సాగిస్తోంది. చాట్‌జీపీటీని ఢీ కొనేందుకు నూతన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ చాట్‌బాట్‌ను లాంఛ్ చేసేందుకు అమెజాన్ ప్రణాళికలు రూపొందిస్తోంది. మెటిస్ పేరుతో అమెజాన్ న్యూ ఏఐ చాట్‌బాట్ యూజర్ల ముందుకు రానుంది. అమెజాన్ అంతర్గత ఏఐ మోడల్ ఒలింపస్ ఆధారంగా మెటిస్ పనిచేస్తుందని భావిస్తున్నారు. అమెజాన్ ప్రస్తుత మోడల్ టైటాన్ ఏఐ మోడల్ కంటే ఒలింపస్ అత్యంత శక్తివంతమైన ఏఐ మోడల్ కావడం గమనార్హం. సంభాషణల పద్ధతిలో టెక్ట్స్, ఇమేజ్ ఆధారిత సమాధానాలను ఇచ్చేలా మెటిస్‌ను డిజైన్ చేస్తున్నారు. సోర్స్ రెస్పాన్స్‌లకు లింక్‌లు షేర్ చేయడం, ప్రశ్నలను ఫాలోఅప్ చేయడం, ఇమేజ్ జనరేట్ చేయడం వంటి విధులనూ మెటిస్ నిర్వర్తిస్తుంది. మైక్రోసాఫ్ట్, గూగుల్, యాపిల్ సహా పలు టెక్ కంపెనీల న్యూ ఏఐ అసిస్టెంట్‌లకు దీటుగా మెటిస్‌ను ముందుకు తీసుకొచ్చేందుకు అమెజాన్ కసరత్తు సాగిస్తోంది. ఏఐ రేస్‌లో తొలుత వెనుకబడినట్టు కనిపించిన అమెజాన్ లేటెస్ట్ ఏఐ మోడల్‌తో న్యూ టెక్నాలజీలో సత్తా చాటేందుకు సిద్ధమైంది. మరోవైపు పలు ఏఐ కంపెనీలు ఎందుకు తమ క్లౌడ్ సేవలను వినియోగించడం లేదని అమెజాన్ వ్యవస్థాపకులు, మాజీ సీఈవో జెఫ్ బెజోస్ ఇటీవల అమెజాన్ ఉద్యోగులకు పంపిన మెయిల్‌లో ప్రశ్నించారని సమాచారం. ఇక న్యూ ఏఐ మోడల్ గురించి అమెజాన్ అధికారికంగా ఇప్పటివరకూ ప్రకటించకపోయినా సెప్టెంబర్‌లో మెటిస్‌ను లాంఛ్ చేయవచ్చని భావిస్తున్నారు. అలెక్సా ఈవెంట్ వేదికగా మెటిస్‌ను అమెజాన్ లాంఛ్ చేస్తుందని చెబుతున్నారు.

## పదేళ్ల తర్వాత కాశీకి వెళ్లిన నీతా అంబానీ..



రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ ఇంట త్వరలో పెళ్లి బాజాలు మోగనున్న విషయం తెలిసిందే. ఆయన చిన్న కుమారుడు అనంత్ అంబానీ వివాహం రాధికా మర్చంట్‌తో జులై 12న జరగనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ముకేశ్ అంబానీ సతీమణి నీతా అంబానీ ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి వెళ్లారు. అక్కడ ప్రఖ్యాత కాశీ విశ్వనాథ ఆలయాన్ని సందర్శించి విశ్వేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. తన కుమారుడి ఆహ్వాన పత్రికను కాశీ విశ్వనాథుడి పాదాల చెంత ఉంచారు. తన కుమారుడి వివాహానికి ఆదిదంపతుల కుటుంబం మొత్తాన్ని ఆహ్వానించారు. పూజల అనంతరం నీతా అంబానీ మాట్లాడారు. అనంత్, రాధికల వివాహ ఆహ్వాన పత్రికను శివయ్యకు అందించడానికి ఇక్కడికి వచ్చినట్లు చెప్పారు. దాదాపు పదేళ్ల తర్వాత కాశీకి వచ్చినట్లు తెలిపారు. ఇక్కడ జరుగుతున్న అభివృద్ధిని చూసి ఎంతో సంతోషం కలిగినట్లు చెప్పారు. కాగా, వారణాసి పర్యటన సందర్భంగా నీతా అంబానీ ఓ సాధారణ దుకాణంలో చాట్ ను ఆస్వాదించారు. స్థానికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఓ వ్యక్తి నీతా అంబానీకి కాశీ విశ్వనాథ ఆలయ నమూనాను బహుమతిగా అందజేశారు. కాగా, అనంత్ రాధికల వివాహం ముంబై నడిబొడ్డున ఉన్న బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లో 'జియో వరల్డ్ ప్లాజా' వీరి వివాహం అంగరంగ వైభవంగా జరిపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ వివాహ తంతు జులై 12న (శుక్రవారం) మొదలై.. జులై 14న (ఆదివారం) మంగళ ఉత్సవ్ (రిసెప్షన్)తో ముగియనుంది. ఈ వేడుకకు పలువురు బాలీవుడ్, టాలీవుడ్, హాలీవుడ్ తారలు సహా ప్రముఖ పారిశ్రామిక వేత్తలు, అంతర్జాతీయ ప్రముఖులు హాజరుకానున్నట్లు తెలుస్తోంది. మరోవైపు అనంత్ అంబానీ వివాహం నేపథ్యంలో ఇప్పటికే ఆ ఇంట వేడుకలు మొదలయ్యాయి. ఈ ఏడాది మార్చిలో వీరి ప్రీ వెడ్డింగ్ సెలబ్రేషన్స్ కూడా అంగరంగ వైభవంగా జరిగిన విషయం తెలిసిందే. గుజరాత్ జామ్ నగర్‌లో జరిగిన ఈ వేడుకలకు దేశ, అంతర్జాతీయ ప్రముఖులు హాజరై సందడి చేశారు. ఆ తర్వాత రెండోసారి ప్రీవెడ్డింగ్ వేడుకలను కూడా నిర్వహించారు. మే 29వ తేదీన ఇటలీలో మొదలైన వేడుకలు జూన్ 1న స్విట్జర్లాండ్‌లో ముగిశాయి. మూడు రోజులపాటు జరిగిన ఈ వేడుకలు మొత్తం భారీ క్రూయిజ్ షిప్‌లోనే కొనసాగాయి. ఈ వేడుకలకు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రముఖులతోపాటు బాలీవుడ్‌లోని పెద్ద స్టార్స్ కూడా పాల్గొన్నట్లు తెలుస్తోంది.

### ఎన్‌ఫీల్డ్‌కు పోటీగా బ్రిటన్ కంపెనీ సై ..


## త్వరలో సరికొత్త మోటారు సైకిల్..?!



ఫేమస్ టూ వీలర్స్ తయారీ సంస్థ రాయల్ ఎన్‌ఫీల్డ్‌కు పోటీగా కొత్త బ్రిటిష్ మోటార్ సైకిల్ కంపెనీ క్లాసిక్ లెజెండ్స్ కొత్త మోటార్ సైకిల్ తీసుకొస్తోంది. భారత్‌లో జావా యెజ్డీ మోటారు సైకిళ్లను తయారు చేస్తున్నదీ క్లాసిక్ లెజెండ్స్. ప్రస్తుతం భారత్ మార్కెట్లో రెట్రో మోటార్ సైకిళ్లకు శరవేగంగా ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటారు సైకిళ్లకు పోటీగా 650సీసీ మోటార్ సైకిల్ తేవడానికి క్లాసిక్ లెజెండ్స్ సిద్ధమైనట్లు తెలుస్తోంది. వచ్చే ఆగస్టు 15న భారత్ మార్కెట్లో క్లాసిక్ లెజెండ్స్ కొత్త మోటార్ సైకిల్ ఆవిష్కరణకు సర్వం సిద్ధమైంది. ఇప్పటికే గ్లోబల్ మార్కెట్లో బీఎస్ఏ గోల్డ్‌స్టార్ పేరుతో విక్రయిస్తున్నారు. మోడ్రన్ అవతార్‌లో గోల్డ్ స్టార్ మోటారు సైకిల్ వస్తోంది. టాప్‌పై ట్విన్ పాడ్ ఇన్‌స్ట్రుమెంట్ ప్యానెల్, ఫ్రంట్ ఎండ్‌లో రౌండ్ హెడ్ ల్యాంప్, రౌండ్ బీఎస్ఏ లోగో కూడా ఉంటుంది. సింగిల్ పీస్ సీట్, బ్యాక్‌లో ఫెండర్ కాంబో, రెట్రో టెయిల్ లాంప్ ఉంటాయని తెలుస్తోంది. రాయల్ ఎన్‌ఫీల్డ్ ఇంటర్‌సెప్టర్ మోటారు సైకిల్ ట్విన్ సిలిండర్ ఇంజిన్‌తో వస్తుండగా, బీఎస్ఏ గోల్డ్ స్టార్ 652 సీసీ లిక్విడ్ కూల్డ్ సింగిల్ సిలిండర్ మోటార్ కలిగి ఉంటుంది. గ్లోబల్ మార్కెట్లలో అందుబాటులో ఉన్న బీఎస్ఏ గోల్డ్ స్టార్ మోటారు బైక్ ఇంజిన్ గరిష్టంగా 45 బీహెచ్పీ విద్యుత్, 55 ఎన్ఎం టార్క్ వెలువరిస్తుంది. ఇండియన్ వర్షన్ మోటారు సైకిల్ ఇంజిన్ కెపాసిటీలో మార్పులు ఉండవచ్చునని భావిస్తున్నారు. భారత్ మార్కెట్లో రెట్రో లుక్ మోటారు సైకిళ్లకు రోజురోజుకు ఆదరణ పెరుగుతున్నది. ఇప్పటికైతే ఈ సెగ్మెంట్‌లో హవా కొనసాగిస్తున్న రాయల్ ఎన్‌ఫీల్డ్ కు పోటీగా ఇతర ద్విచక్ర వాహనాల తయారీ సంస్థలు జత కట్టాయి. ట్రయంఫ్ భాగస్వామ్యంతో బజాజ్ ఆటో, హార్లే డేవిడ్సన్ భాగస్వామ్యంతో హీరో మోటో కార్ప్ కొత్త మోటారు సైకిళ్లను మార్కెట్లోకి తెస్తున్నాయి.

## ఆల్‌టైమ్ గరిష్ఠానికి స్టాక్ మార్కెట్లు..

### 78వేల మార్క్‌ను దాటిన సెన్సెక్స్



దేశీయ స్టాక్ మార్కెట్లు భారీ లాభాల్లో కొనసాగాయి. ప్రపంచ మార్కెట్లలో సానుకూల పవనాలతో మార్కెట్లు మంగళవారం భారీ లాభాల్లో మొదలయ్యాయి. ఆర్థిక, బ్యాంకింగ్ స్టాక్‌లలో లాభాల మద్దతుతో రెండు సూచీలు ప్రారంభ ట్రేడింగ్‌లో సానుకూలంగా ప్రారంభమయ్యాయి. చివరి వరకు అదే ఊపును కొనసాగాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సూచీలు సెన్సెక్స్ 77,529.19 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలయ్యాయి. ఇంట్రాడేలో 78,164.71 పాయింట్ల గరిష్ఠానికి చేరి జీవితకాల గరిష్ఠా నికి చేరింది. చివరకు 712.45 పాయింట్లు లాభపడి.. 78,053.52 వద్ద లాభాల్లో ముగిసింది. నిఫ్టీ సైతం ఆల్‌టైమ్ గరిష్ఠానికి పెరిగింది. 183.45 పాయింట్లు పెరిగి.. 23,721.30 వద్ద స్థిరపడింది. నిఫ్టీలో శ్రీరామ్ ఫైనాన్స్, యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, టెక్ మహీంద్రా, లార్సెన్, విప్రో, ఎస్‌బీఐ, బ్రిటానియా, విప్రో భారీగా లాభప డ్డాయి. బీపీసీఎల్, ఐచర్ మోటార్స్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఏషియన్ పేయింట్స్, పవర్ గ్రిడ్ కార్పొ రేషన్, టాటాస్టీల్, ఓఎన్‌జీసీ, కోల్ ఇండియా, బజాజ్ ఆటో నష్టాల్లో ముగిశాయి. బ్యాంక్ నిఫ్టీ ఇండెక్స్ 902.05 పాయింట్లు పెరిగి 52,606 వద్ద స్థిరపడింది. ఇతర రంగాల సూచీల కంటే ఫైనాన్షియల్ సర్వీసెస్, బ్యాంకింగ్ స్టాక్‌లు లాభాల్లో కొనసాగగా.. మెటల్, రియల్టీ స్టాక్‌లు నష్టాల్లో ముగిశాయి.

# సబ్ సెంటర్ ద్వారా ప్రజలకు విస్తృతంగా వైద్య సేవలు

**-కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**-వంద శాతం గర్భిణీ స్త్రీల ఏ.ఎన్.సి రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలి**

**-ప్రతి వారం సబ్ సెంటర్ పరిధిలో మెడికల్ క్యాంపు ఏర్పాటు**

**-గర్రెపల్లి పి.హెచ్.సి పరిధిలో సబ్ సెంటర్లు అందిస్తున్న వైద్య సేవలపై సమీక్షించిన జిల్లా కలెక్టర్**



**సుల్తానాబాద్, జూన్ 25 (నినాదం న్యూస్):**
ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సబ్ సెంటర్ల ద్వారా ప్రజలకు విస్తృతంగా వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. మంగళ వారం జిల్లా కలెక్టర్ సుల్తానాబాద్ మండలం గ ర్రెపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని,సుల్తానాబాద్ లోని 30 పడకల ఆసుపత్రి తనిఖీ చేశారు.సబ్ సెంటర్ల వారీగా గర్భిణీ స్త్రీల ఏ.ఎన్.సి రిజిస్ట్రే షన్,గర్భిణీ మహిళలకు అందించే టీకాలు, ఎ న్.సి.డి స్క్రీనింగ్,సబ్ సెంటర్లలో ఓపి,తదితర అంశాలను కలెక్టర్ ఆరా తీశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్ సెంటర్ ల పరిధిలో ఎవరైనా స్త్రీలు గర్భందాలిస్తే తప్పనిసరిగా ఏ.ఎ న్.సి రిజిస్ట్రేషన్ జరిగేలాచూడాలని, క్షేత్రస్థాయి లో పని చేసే ఆశా కార్యకర్తలతో నిరంతరం సమ న్వయం చేసుకుంటూ పని చేయాలని సూచించారు.గర్భిణీ స్త్రీలు రెగ్యులర్ గా చెక్ అప్ చేయించుకొని,అవసరమైన మందులు వాడే విధం గా ఫాలో అప్ చేయాలని, ప్రతి గర్భిణీ స్త్రీ తప్ప నిసరిగా టీకాలు వేయించుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు.మధుమేహం, బీపి గుర్తించిన వ్యక్తు లకు వెంటనే మందులు అందజేయాలని,మం దుల కొరత రాకుండా ఎప్పటికప్పుడు స్టాక్ పర్య వేక్షించాలని సూచించారు. గ్రామాలలో ఆర్.బి. ఎస్.కె పర్యటించే సమయంలో ఆశా కార్యకర్త లు, ఏఎన్ఎంలు అందుబాటులో ఉంటూ పూర్తి స్థాయిలో ప్రతి పిల్లవాడికి వైద్య పరీక్షలు నిర్వ హించేలా చూడాలని,సబ్ సెంటర్ పరిధిలో గల తక్కువ బరువు,తక్కువ ఎత్తు పిల్లలను గుర్తిం చి,వారి ఎదుగుదలకు అంగన్వాడీలతో సమన్వ యం చేసుకుంటూ చర్యలు తీసుకోవాలని అన్నారు.ప్రతి వారంలో ఒక రోజు సబ్ సెంటర్ ప రిధిలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని, ఈ సమాచారాన్ని ముందస్తుగా ప్రజలకు తెలి యజేయాలని కలెక్టర్ తెలిపారు. సబ్ సెంటర్ లలో ఏదైనా సామాగ్రి అవసరం ఉంటే వెంటనే ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ పేర్కొన్నా రు. అనంతరం సుల్తానాబాద్ పట్టణంలో ఉన్న 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను కలెక్టర్ తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ఉన్న ఔట్ పేషెంట్ వార్డు, జనరల్ వార్డ్, లేబర్ వార్డు,చిన్నపిల్లల వార్డులను తనిఖీ చేసిన కలెక్టర్ అవుట్ పేషెంట్ల సంఖ్య,ఆసుపత్రి లో జరుగుతున్న ప్రసవాల సం ఖ్య పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్ట ర్ సూచించారు.ఈ కార్యక్రమంలోజిల్లా వైద్య, ఆ రోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.ప్ర మోద్ కుమార్, మున్సిపల్ కమీషనర్ కట్ల వేణు మాధవ్, ఆసు పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి,ఆర్. ఎం.ఓ డాక్టర్ మహేందర్,చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ శ్రీధర్,సంబంధిత అధికారులు, తదితరు లు పాల్గొన్నారు.

## వికలాంగుల పునరావాస కేంద్రంను సందర్శించిన డిఆర్డిఓ రవీందర్

**సుల్తానాబాద్, జూన్ 25, (నినాదం న్యూస్):**

సుల్తానాబాద్ మండల కేంద్రం లోని వికాసం వికలాంగుల పున రావాసకేంద్రంను పెద్దపల్లి డిఆర్డి ఓ రవీందర్ సందర్శించారు.ఈ సందర్భంగా కేం ద్ర నిర్వాహ కులకు తగు సలహాలు సూచనలు తెలిపారు. అలాగే ప్రభుత్వం ప్రతి ష్టాత్మకంగా చే పట్టిన మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటు చేయుటకు స్థల పరిశీలన చేసినారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డి ఆర్ డి ఓ.రవికుమార్,ఏపీఎం శ్రీ నివాస్ తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

## పెండింగ్ ధరణి దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలి

**-కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**-సుల్తానాబాద్ తహసిల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ**



**సుల్తానాబాద్, జూన్ 25 (నినాదం న్యూస్):**
సుల్తానాబాద్ తహసిల్దార్ కార్యాలయాన్ని మం గళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆకస్మికం గా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సుల్తానాబాద్ తహసిల్దార్ కార్యా లయంలో పెండింగ్ ధరణి దరఖాస్తుల వివరాల గురించి ఆరా తీసిన కలెక్టర్ పెండింగ్ లో ఉన్న టిఎం 33, పిఓబి వివిధ దరఖాస్తులను రెండు రోజులలో పూర్తి చేయాలని అన్నారు.మండలం లో సర్వే కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి దర ఖాస్తు సర్వే వారం రోజుల లోపు పూర్తి చేయాల ని కలెక్టర్ సర్వేయర్ను ఆదేశించారు. ఈ కార్య క్రమంలో తహసిల్దార్ మధుసూదన్ రెడ్డి, మున్సి పల్ కమిషనర్ వేణుమాధవ్ తో పాటు సంబం ధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## స్ఫూర్తి అవార్డుకు ఎంపికైన సీనియర్ పాత్రికేయుడు జబ్బార్ ఖాన్

**-నేడు మంత్రి శ్రీధర్ బాబుతో అవార్డు ప్రధానం**

**రామగిరి జూన్ 25 నినాదం న్యూస్:**

కమాన్ పూర్ సీనియర్ పాత్రికేయుడు జబ్బార్ ఖాన్ స్ఫూర్తి అవార్డుకు ఎంపికయ్యారు.
గురువారం హైదరాబాద్ లోని రవీంద్ర భారతిలో జరిగే కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ శాసనసభ భారీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నట్లు వసుంధర విజ్ఞానమండలి వికాస మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు అవార్డుల సభ అధ్యక్షుడు మధుకర్ వైద్యుల తెలిపారు. కాగా జబ్బార్ ఖాన్ గత 30 సంవత్సరాలుగా పత్రిక రంగంలో ఉండి ప్రజలకు అధికారులకు ప్రజా ప్రతినిధులకు వారధిగా ఉండి వార్తలు రాయడం జరిగిందని పేర్కొన్నారు. దీంతో ఆయనను స్ఫూర్తి అవార్డుకు ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు.

## కలెక్టర్‌కి బుధవారంపేట గ్రామస్థుల వినతి

**-అక్రమ లే-అవుట్ రిజిస్ట్రేషన్లను ఆపండి**


**- సహకరించిన ఎంపీఓ, పంచాయితీ కార్యదర్శులపై చర్యలు తీసుకోవాలి**



**రామగిరి జూన్ 25 నినాదం న్యూస్:**
మంథని సివిల్ కోర్టులో కేసు నడుస్తున్న బుదవారంపేట గ్రామపంచాయితీ పరిధిలోని సర్వే.నం : 4/6 లో గల 0.19 గుంటల భూమినీ అక్రమంగా వెంచర్ వేసి, విక్రయాలు జరుపుటకు సహకరించిన రామగిరి ఎంపీఓ, గ్రామ పంచాయితీ కార్యదర్శులపై చర్యలు తీసుకోవాలని, రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని సోమవారం పెద్దపల్లి కలెక్టరేట్ లో బుధవారంపేట గ్రామ ప్రజలు మూకుమ్మడిగా జిల్లా కలెక్టర్ శ్రీహర్ష కీ వినతి పత్రం అందజేశారు. బుదవారం పేట గ్రామ పంచాయితిలోని రియల్ ఎస్టేట్ వ్యాపారులు డి.టి.సి.పి. లే-అవుట్ అప్రోవల్ లేకుండా వ్యవసాయ భూమిని నాలా కన్వర్షన్ చేసి రియల్ ఎస్టేట్ పేరుతో ఇష్టానుసారంగా ఆ భూమినీ ఫ్లాట్స్ గా విభజించి అధిక ధరలకు విక్రయిస్తూ గ్రామ పంచాయితికి చేస్తున్న నష్టం గురించి ఈనెల 10న ప్రజావాణి లో జిల్లా కలెక్టర్ కీ ఫిర్యాదు చేసిన, ఎం.పి.ఓ. అండదండలలో సదరు వెంచర్ అక్రమాధారులు మంథని సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో 6 గురికి రిజిస్ట్రేషన్ చేయించరాన్నరు. రిజిస్ట్రేషన్ చేసిన సదరు భూమిపై 2017 సంవత్సరములో మంథనిలో సివిల్ కోర్టులో సి.ఎన్.ఆర్.నెం. సిసి0000319/2017 లో కేసు నడుస్తున్న అక్రమార్కులు ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శి సహకారంతో విక్రయాలు జరిపినట్లు పేర్కొన్నారు. అక్రమ వ్యక్తులు ఏర్పాటు చేసిన వ్యక్తులపై అందరూ సహకరించిన అధికారిపై, గ్రామపంచాయతీ నష్టం చేకూర్చిన పంచాయతీ కార్యదర్శి పై తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీహర్ష కీ వినతిపత్రం అందజేశారు.

## ఎస్సీ ఎస్టీ కేసు పై విచారణ

**-ఏసీపీ మడత రమేష్**

**మంథని జూన్ 25 (నినాదం న్యూస్):**

ముత్తారం మండలంలోని పారుపల్లి గ్రామంలో నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసు పై మంగళవారం గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ విచారణ చేపట్టారు. ఇదే గ్రామానికి చెందిన ఇనుముల లక్ష్మయ్య ను అదే గ్రామానికి చెందిన గొట్టిముక్కుల సంపత్ రావు కులం పేరుతో దూషించాడని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు కాగా,ఏసీపీ గ్రామంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తుల నుంచి వివరాలను సేకరించారు. ఆయన వెంట మంథని సిఐ వెంకటేశ్వర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పుట్ట మధు ఆరోపణలు విడ్డూరం

**మంథని జూన్ 25 (నినాదం న్యూస్):**
పుట్ట మధు చేసిన ఆరోపణలు విడ్డూరమని కాంగ్రెస్ నాయకులు భూపెల్లి రాజు అన్నారు. మంగళవారం మంథని ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ప్రతి ఒక్క వర్గానికి అన్యాయం చేసినవు కాబట్టి రెండుసార్లు ఓడిపోవడం జరిగిందని ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం సరికాదు అన్నారు. నువ్వు అధికారంలో ఉన్నప్పుడు దుద్దిళ్ల కుటుంబాన్ని తలుచుకున్నావు, నీకు అధికారం లేనప్పుడు కూడా , దుదిల్ల కుటుంబాన్ని తలుచుకుంటున్నావనీ శ్రీధర్ బాబు, శ్రీను బాబు ల పేర్లు తీయనిదే నీకు పూట గడవదని ఎద్దేవా చేశారు. మీ రాజకీయ ప్రస్తావనం ఎక్కడ మొదలైందో గుర్తుంచుకోవాలని సూచించారు. ఇసుక వనరులు అక్రమనకు గురవుతున్నాయని మాట్లాడడం మట్టి తవ్వకాల్లో అవకతవకులు జరుగుతున్నాయని ఆరోపించడం మానేయాలని టిఆర్ఎస్ పదేండ్ల పాలనలో జరిగినంత ఇసుక దోపిడి మరెన్నడు జరగలేదని రాత్రి పగలు తేడా లేకుండా ఈ ప్రాంతానికి చెందిన ఇసుకను హైదరాబాదులోకి తీసుకెళ్లి అమ్ముకోవడం టీఆర్ఎస్ కె చెల్లిందని అన్నారు. ప్రభుత్వాన్ని విమర్శించేముందు, ప్రభుత్వ పనితీరును ఎండగడితే ముందు ఒకసారి ఆత్మవిమర్శ చేసుకోవాలని సూచించారు.మీ టిఆర్ఎస్ పాలనలో ముఖ్యమంత్రిని కేసీఆర్ ను మంత్రి కేటీఆర్ ను మంత్రి హరీష్ రావు కలవాలంటే ఎమ్మెల్యేలకు జడ్పీ చైర్మన్ ల కూడా సాధ్యం కాలేదని అన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వమే ప్రజలందరికీ అన్యాయం చేసిందని, మాయమాటలు చెప్పి మోసగించడంలో టిఆర్ఎస్ నెంబర్వన్ స్థానంలో ఉంటుందని అన్నారు.దళిత బంధు పేరిట దళితులను మోసం చేశారని బీసీ బందు పేరిట బీసీలను మోసం చేశారని ఏ ఒక్క వర్గానికి కూడా సంక్షేమ అందించలేదని అందుకే ఎలక్షన్ లో టిఆర్ఎస్ కు తగిన గుణపాఠం చెప్పారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు మంథని సత్యం కాంగ్రెస్ నాయకులు అక్కపాక సంపత్, ఆర్ల నారాయణ, కాశిపేట బాపు, కుమ్మరి అశోక్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.




## మేరిమీడియాట్రిక్స్ పాఠశాలలో జరుగుతున్న అవకతవకలపై చర్యలు తీసుకోవాలి

**మంథని జూన్ 25 ( నినాదం న్యూస్):**
మంథని మండలం సూరయ్యపల్లి గ్రామంలోని మేరిమీడియాట్రిక్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఉపాధ్యాయుల నియామంలో జరుగుతున్న అవకతవకలపై చర్యలు తీసుకోవాలనీ విద్యార్థుల పట్ల అవలంభిస్తున్న విధానాలు, అధిక ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రుల పట్ల అనుసరిస్తున్న విధానాలపై తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి, సర్వ శిక్షా అభియాన్, హైదరాబాద్ కు, పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కు మైదుపల్లి మాజీ సర్పంచ్ వేల్పుల పోచం మంగళవారం ఫిర్యాదు చేశారు. పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులకు కనీస విద్యార్హతలు లేకపోయిన వారికి తక్కువ వేతనాలు చెల్లిస్తూ, వారితో వెట్టి చాకిరి చేయించుకుంటున్నారని పేర్కొన్నారు.విద్యార్థుల తల్లి దండ్రుల నుండి అధిక ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితిని గమనించకుండా వారిని వేధనలకు గురిచేస్తున్నారని, అన్నారు. విద్యా హక్కు చట్టం 2009 12(1) (సి) ప్రకారం నిరుపేద విద్యార్థులకు ఉచితముగా విద్యను ఈ పాఠశాల యాజమాన్యం అందించడం లేదని,ఈ పాఠశాలలో కాసిపేట స్వప్న అనే దళిత ఉపాధ్యాయురాలిని అన్యాయంగా తొలగించి,ఆమె స్థానంలో వేరొక ఉపాధ్యాయురాలిని నియమించుకొని ఆమె భర్త తో స్కూల్కు సంబంధించిన పుస్తకాలను 50 శాతం కమీషన్ ఒప్పందం కుదుర్చుకొని పాఠ్యపుస్తకాలను, నోట్ బుక్కులను విక్రయిస్తూ అధిక ధరలకు అమ్ముతూన్నారు. తల్లిదండ్రులను నిలువు దోపిడి పాఠశాల యాజమాన్యం చేస్తుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. తక్షణమే అధికారులు స్పందించి పాఠశాల యాజమాన్యం పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## పారుపల్లి ప్రాథమిక పాఠశాలకు వంట సామాగ్రి వితరణ

**గోదావరిఖని ఏసిపి మడత రమేష్**

**మంథని జూన్ 25 (నినాదం న్యూస్):**
ముత్తారం మండలం పారుపల్లి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం అక్షరాభ్యాసం కార్యక్రమంలో పాల్గొని,పాఠశాలకు సుమారు పదివేల విలువగల మధ్యాహ్న భోజన వంట సామాగ్రిని గోదావరిఖని ఏసిపి రమేష్ వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన మధ్యాహ్న భోజనాన్ని అందించాలన్నారు.విద్యార్థులకు విలువలతో కూడిన గుణాత్మక విద్యను అందించి ఉత్తమ పౌరులుగా విద్యార్థులను సమాజానికి అందించాలని ఉపాధ్యాయులకు పిలుపునిచారు.ఈ కార్యక్రమంలో మంథని సీఐ వెంకటేశ్వర్లు ముత్తారం ఎస్ఐ మధుసూదన్ రావు ముత్తారం మండల నోడల్ ఆఫీసర్ ఇరుగురాల ఓదెలు, ఎంపీఓ వేణు మాధవ్ ఉపాధ్యాయులు కానుగంటి అంజయ్య,ఏ ఏ పీసీ చైర్మన్ శ్రీమతి శోభ, గ్రామ కార్యదర్శి సంతోష్, సిఏ పద్మ . అంగన్వాడీ కార్యకర్త శ్రీమతి తిరుపతమ్మ, పర్ష శ్రీనివాస్, బోడ లక్ష్మణ్ , సీఆర్పీ సమ్మయ్య విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.




## అంగన్ వాడీ సెంటర్ల అభివృద్ధికి కార్యాచరణ

**పెద్దపల్లి ప్రతినిధి, జూన్ 25( నినాదం):**
పూర్వ ప్రాథమిక విద్య కేంద్రాలుగా అంగన్ వాడీలను అభివృద్ధి చేయాలని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి వాకాటి కరుణ అన్నారు. మంగళవారం ఆమె రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించగాజిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణశ్రీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి వాకాటి కరుణ మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్ వాడీ పూర్వ ప్రాథమిక విద్యా కేంద్రాల ఏర్పాటుకు నిర్ణయం తీసుకుందన్నారు. పిల్లలకు నేర్పాల్సిన పాఠ్యాంశాలు, అభివృద్ధికి తీసుకోవాల్సిన ప్రణాళిక రూపొందించామన్నారు. అంగన్ వాడీ సెంటర్లలో పిల్లలకు నేర్పించాల్సిన అంశాలను వివరిస్తూ అంగన్ వాడీ టీచర్లకు ప్రత్యేక బుక్ లెట్ రూపొందించామన్నారు. జూలై మొదటి వారం నాటికి రాష్ట్ర వ్యాప్తంగా అంగన్ వాడీ టీచర్లకు పూర్వ ప్రాథమిక విద్యపై శిక్షణ పూర్తి చేయాలని కలెక్టర్ లకు ఆమె సూచించారు. ప్రతి అంగన్ వాడీ సెంటర్ లో ప్లే మ్యాట్ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా స్థాయిలో సంక్షేమ శాఖ వద్ద అందుబాటులో ఉన్న నిధులతో ప్రతి అంగన్ వాడీ కేంద్రంలో పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా వాల్ పెయింటింగ్స్ వేయించాలని అన్నారు. మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. జిల్లా స్థాయిలో జరుగుతున్న అంగన్ వాడీ శిక్షణ కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా పర్యవేక్షించాలన్నారు.అంగన్ వాడీ పిల్లలకు ఏక రూపదుస్తులు అందించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. జూలై నెలలో అంగన్ వాడీ పూర్వ ప్రాథమిక విద్య కేంద్రాలను ప్రారంభించడం జరుగుతుందన్నారు.చిన్నపిల్లల్లో పోషక లోపాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. పోషక లోపం గల పిల్లలను అంగన్ వాడీ టీచర్ల ద్వారా గుర్తించి వారికి పౌష్టికాహారం అందించాలన్నారు. 6 సంవత్సరాల లోపు పిల్లలను రిజిస్టర్ చేయించి ఒగ్యులర్ గా పౌష్టికాహారం అందించాలన్నారు.

## సత్య సాయి రైస్‌మిల్ యజమానిపై ఆర్డీవోకు ఫిర్యాదు

**మంథని జూన్ 25 (నినాదం న్యూస్):**
మంథని మున్సిపల్ పరిధిలోని గంగాపురి సత్యసాయి రైస్ మిల్ యజమానిపై చర్యలు తీసుకోవాలని మంగళవారం ప్రజాసంఘాల నాయకుల బాధితుడు గొర్రె రమేష్ తో కలిసి మంథని ఆర్.డి. ఓ కి ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్ మాట్లాడుతూ గంగాపురి సత్య సాయి రైస్ మిల్ యజమాని ఓల్లాల సత్యనారాయణ ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా దొంగ దారిన మంథని బొక్కల వాగు నడి మధ్యలో బోరు వేసి నీటిని సత్య సాయి రైస్ మిల్లుకు తరలిస్తూ నీటి చౌర్యానికి పాల్పడుతున్నాడనీ తెలిపారు. బోరు బావికి అక్రమంగా కరెంట్ కనెక్షన్ ఇచ్చి మూడు మూగజీవాల మృతికి సత్యసాయి రైస్ మిల్ యాజమాన్యం కారణమైందని అన్నారు. వారం రోజులు గడుస్తున్న తెగిన కరెంటు తీగలు మార్చకపోవడం ఎంతవరకు సమంజసం అని ఈ ప్రాంతంలో గంగాపురి నుండి బోయిన్ పేటకు నిత్యం ప్రజలు కాలినడకన వెళుతున్నారని అన్నారు.మనుషులకు ప్రమాదం జరిగితే ఇంతేనా అని రైస్ మిల్ యాజమాన్యంపై మండిపడ్డారు. సామాన్య రైతును వాడుకుంటే కఠినమైన చర్యలు తీసుకునే అధికారులు బహిరంగంగా బొక్కల వాగు నీటిని దొంగ దారిన రైస్ మిల్లుకు నీటిని తీసుకుపోతుంటే సంబంధిత అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పుడు మూగజీవాలు చనిపోయిన పట్టించుకోని అధికారులు రేపు మనుషులు చనిపోయిన పట్టించుకోరా అని అధికారులపై ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సాగర్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వేల్పుల సురేష్,బావు రవి,యాదవ సంఘం నాయకులు కన్నెబోయిన కిష్టస్వామి ఉన్నారు.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి

**-ప్రభుత్వ ఆసుపత్రులలో ఔట్ పేషెంట్లు, ప్రసవాల సంఖ్య పెంచాలి**

**-వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్ శ్రీహర్ష**



**పెద్దపల్లి ప్రతినిధి,జూన్-25( నినాదం ):**
జిల్లాలోని ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన సమావేశంలో వైద్య,ఆరోగ్య శాఖ అధికారులతో మంగళవారం సమీక్షించారు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులలో పనిచేస్తున్న సిబ్బంది, ప్రసవాల సంఖ్య, అందుతున్న సేవల గురించి అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది విధి నిర్వహణలో సమయపాలనను పాటించాలన్నారు. జిల్లాలో ఉన్న ప్రతి గర్భిణీ స్త్రీకి ఏ.ఎన్.సి పరీక్షలు వంద శాతం పూర్తి చేయాలన్నారు. ఆర్.బి.ఎస్.కె. లు వైద్యాధికారులు, ఏఎన్ఎం సమన్వయం చేసుకుంటూ జిల్లాలోని పిల్లలకు రెగ్యులర్ గా వైద్య పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్ల పరిధిలో ఔట్ పేషెంట్ ల సంఖ్య పెరగాలని అన్నారు. ప్రభుత్వ వైద్యంపై ప్రజలకు నమ్మకం కల్పించేలా సేవలందించాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నియంత్రణ కోసం ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. అంగన్వాడి కేంద్రాలలో ఉన్న పిల్లల ఎదుగుదల ఎప్పటి కప్పుడు పరిశీలిస్తూ పోషకాహార లోపం నివారణ కు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీఎంహెచ్వో కె.ప్రమోద్ కుమార్, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

**స్వశక్తి సంఘాల పని తీరుపై సమీక్ష**
జిల్లా కలెక్టరేట్ లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ శ్రీహర్ష స్వశక్తి మహిళా సంఘాల పనితీరుపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణశ్రీ తో కలిసి సమీక్షించారు. స్వశక్తి మహిళా సంఘాలకు రుణాల పంపిణీ, ఏకరూప దుస్తుల కుట్టు పనులు, పాడి పశువుల యూనిట్ల ఏర్పాటు, మొబైల్ ఫిష్ రిటైల్ అవుట్ లెట్స్ , మిల్క్ పార్లర్, మీసేవ, ఈవెంట్ మేనేజ్మెంట్, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ యూనిట్ కేంద్రాల ఏర్పాటు, పౌల్ట్రీ ఏర్పాటు, తదితర అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. స్వశక్తి మహిళా సంఘాలకు నిర్దేశించిన రుణాలు సకాలంలో పూర్తి చేయాలని, మహిళా సంఘాల ఎన్.పి.ఏ రుణాలు రికవరీపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. యాక్టివ్ గా లేని స్వశక్తి మహిళా సంఘాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలన్నారు. పాఠశాలల్లో పేరెంట్స్, టీచర్స్ సమావేశాలు సజావుగా జరిగేలా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు పర్యవేక్షించాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్డిఓ రవీందర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా చతుర్థి వేడుకలు

**-గణనాథుని దర్శించుకున్న భక్తులు**



**మంథని జూన్ 25 (నినాదం న్యూస్):**
మంథని పట్టణంలోని శ్రీ మహా గణపతి దేవాలయంలో సిద్ధి, బుద్ధి సమేతంగా కొలువుతీరిన గణనాథున్ని సంకష్టహర చతుర్థిని పురస్కరించుకొని మంగళవారం భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ప్రతి నెలలో పౌర్ణమి తర్వాత వచ్చే చవితి తిథి రోజున సంకష్టహర చతుర్థి వస్తుంది. ఈ రోజున రాత్రి 10 గంటల 28 నిమిషములకు చంద్రోదయం అనంతరం స్వామివారి పూజ చేసి భోజనం చేయడం ఎంతో శ్రేయష్కారం. ఈ రోజున ఉపవాస దీక్ష స్వీకరిస్తే జీవితంలో ఎదుర్కొంటున్న విఘ్నాలన్ని తొలగిపోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ సందర్భంగా శ్రీ మహాగణత దేవాలయాన్ని ఎంతో అందంగా అలంకరించారు. దేవతలలో మొట్టమొదట పూజించబడే ఎంతో విశిష్టత కలిగిన శ్రీ విఘ్నేశ్వరున్ని పూజించడం వల్ల అన్ని కష్టాలు తొలగిపోయి అంతా శుభం జరుగుతుందనే విశ్వాసంతో సంకష్టహర చతుర్థి దీక్షను స్వీకరిస్తారు. ఈ రోజున విఘ్నేశ్వరునికి ఇష్టమైన గరిక ( దూర్వాలు ) సమర్పించడం అలాగే 21 ఉండ్రాళ్ళు నైవేద్యంగా సమర్పిస్తే విఘ్నేశ్వరునికి ప్రీతిపాత్రలవుతారు అని శాస్త్రాల్లో చెప్పబడింది. చంద్రోదయం అనంతరం భోజనం చేయడం ఈ దీక్షలో ప్రధానంగా చెప్పుకోవచ్చు.

